www.prajasakti.com
PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 39 Vol సంచిక : 11 No | విజయవాడ, శుక్రవారం 11 జనవరి 2019 | 12 + 12 పేజీలు వెల : 4.00 Rs.

వాణిజ్య కేంద్రంగా వెల్‌కం గ్యాలరీ

- ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- వేర్వేరు కంపెనీలతో ఒప్పందాలు

2

హబుల్ షట్‌డౌన్



12

మూతపడిన హబుల్ అధునాతన కెమెరా


సుమోటోగా సంపన్నుల సేవ!

- దళితులు, సన్న, చిన్నకారు రైతులకు మొండి చెయ్యి
- చుక్కల భూములపై సర్కారు సిత్రాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

చుక్కల భూములు, నిషేధిత భూముల క్రమబద్ధీకరణ ముసుగులో విలువైన భూములను అధికార పార్టీ అనుయాయులకు కట్టబెట్టేందుకు సర్కారు యత్నిస్తోందనే విమర్శలు వినవస్తున్నాయి. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూముల క్రమబద్ధీకరణ, నిషేధిత జాబితా నుంచి ఆయా సర్వే నెంబర్లు తొలగిస్తారంటే పేదలు, దళితులు , సన్న చిన్న కారు రైతులు ఆనందపడ్డారు. ఆచరణలో ఇందుకు భిన్నంగా ప్రభుత్వం జారీ చేసిన సర్క్యులర్ మెమో పెత్తందార్లు, రాజకీయ పలుకుబడిన వ్యక్తులు, పారిశ్రామిక వేత్తలకు లబ్ధి చేకూరే విధంగా వుండడం విస్మయం కలిగిస్తోంది.

సుమోటో పరిష్కారం పేరిట ప్రభుత్వం ఈనెల 4న జారీ చేసిన మెమో నెంబర్ 57443లో చుక్కల భూములు, నిషేధిత భూములు, అసైన్డ్ ల్యాండ్స్‌కు సంబంధించి ఏయే అర్హతలుంటే ఈ జాబితాలో నుంచి తొలగించవచ్చో నాలుగు నిబంధనలను పేర్కొన్నారు. 1(బి)లోని కాలమ్ 8లో కొనుగోలు, వారసత్వం, వంశపారపర్యం ద్వారా ఆ భూమి సంక్రమించినట్లు నమోదై ఉంటే 22-ఎ (1) నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాలని సూచించారు.



GOVERNMENT OF ANDHRA PRADESH
REVENUE (ASSIGNMENT-I)DEPARTMENT

Circular Memo No.57443/ Assn.I/2012, Dated: 04.01.2019

b. nothing is noted in "acquisition column" (i.e. column No.8), it shall be treated as private patta Land and shall be deleted from the prohibited properties notified U/s 22-A (1) of Registration Act, 1908.

(p.t.o)

కాలమ్ 8లో ఆ భూమి ఎలా సంక్రమించిదనే వివరాలు నమోదు కాకుండా వున్నా వాటిని ప్రైవేటు భూములుగా పరిగణిస్తూ నిషేధిత భూముల జాబితాలో తొలగించవచ్చని సూచించారు. కాలమ్ 8లో ఏమీ రాయని భూములను పెత్తందార్లు క్రమబద్ధీకరించుకునే అవకాశం పుష్కలంగా వుంది. ఎక్కడైనా ఏదైనా వివరం వుంటే దాని ఆధారంగా నిర్ధారణకు రావడం, నిర్ణయాలు చేయడం జరుగుతుంది కానీ ఏమీ రాయకపోతే ప్రైవేటు భూమి అని పరిగణించాలనే నిబంధన ఆశ్చర్యం కలిగిస్తోంది. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తమ అనుయాయులకు విలువైన భూములను కట్టబెట్టేందుకు ఈ నిబంధనను చొప్పించారనే విమర్శలు వినవస్తున్నాయి. మూడవ నిబంధనలో 1954 ముందు డికెటి పట్టాలు, అసైన్‌మెంట్ పొందినట్లు కాలమ్ 8లో ఉంటే ఆయా భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని సూచించారు. నాల్గవ నిబందనలో 1954 తరువాత డికెటి పట్టాలు పొందిన భూములను, అసైన్డ్ ల్యాండ్స్‌ను నిషేధిత జాబితాలోనే కొనసాగించాలని పేర్కొన్నారు. దళితులు, పేదలు, సన్న, చిన్న కారు రైతుల్లో అత్యధికుల భూములు నిషేధిత జాబితాలోనే కొనసాగుతాయన్నమాట. కాబట్టి తాజా మెమోతో పేదలకు ఒరిగేదేమీ లేదు.

ప్రత్యక్షంగా భూములను పరిశీలించాలనే ఊసే లేదు

చుక్కల భూములు, నిషేధిత భూములు, అసైన్డ్ ల్యాండ్స్ క్రమబద్ధీకరణ సందర్భంగా అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ నివేదికను తయారు చేయాలని ప్రభుత్వం పేర్కొనలేదు. కేవలం 1(బి) రిజిష్టర్‌లోని కాలమ్(2)లో పట్టాదారుని పేరును మాత్రమే పరిశీలిం చాలని చెబుతుండటంతో కాలమ్8లో తమకు అనుకూలంగా ఖాళీలను భర్తీ చేసుకునే అవకాశం లేక పోలేదని నిపుణులు మిగతా 9లో

సిబిఐలో మరో కుదుపు

- అలోక్‌వర్మ తొలగింపు
- ఎం.నాగేశ్వరరావుకే మళ్లీ పగ్గాలు
- ప్రధాని అధ్యక్షతన జరిగిన హైపవర్‌కమిటీ సమావేశ నిర్ణయం
- వ్యతిరేకించిన ఖర్గే
- స్వతంత్ర విచారణ జరపండి : కాంగ్రెస్



న్యూఢిల్లీ : సిబిఐలో మరో కీలకపరిణామం చోటుచేసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాలతో విధుల్లో చేరి 24 గంటలు గడవకముందే అలోక్‌వర్మను డైరక్టర్ పదవి నుండి తొలగించాలని హైపవర్ కమిటీ నిర్ణయించింది. ఈ నిర్ణయం వెలువడిన కాసేపటికే ఒడిశా క్యాడర్‌కు చెందిన ఎం.నాగేశ్వరరావుకు ఆ బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన హైపవర్ కమిటీ సమావేశం గురువారం సాయంత్రం జరిగింది. ప్రధాని కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్రమోడీతో పాటు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.కె.సిక్రి, లోక్‌సభలో విపక్షనేత మల్లికార్జున ఖర్గే పాల్గొన్నారు. రెండు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో అలోక్‌వర్మకు వ్యతిరేకంగా సివిసి ఇచ్చిన నివేదికపైనే ప్రధానంగా చర్చ జరిగింది. ఈ నివేదిక ఆధారంగా సిబిఐ డైరక్టర్‌గా అలోక్‌వర్మను తొలగించాలన్న అభిప్రాయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోడీతో పాటు, సుప్రీంకోరుట న్యాయమూర్తి సిక్రి వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని ఖర్గే తీవ్రంగా వ్యతిరేకించారు. 'హై పవర్ కమిటీ నిర్ణయం రాజ్యాంగ వ్యతిరేకం' అని సమావేశానంతరం ఆయన వ్యాఖ్యానించారు. అయితే, మెజార్టీ సభ్యుల నిర్ణయం మేరకు అలోక్‌వర్మను తొలగిస్తున్నట్లు ప్రకటించారు. ఆయన పదవీకాలం ఈ నెల 31తో ముగుస్తుంది. అంతవరకు ఆయన్ను ఫైర్ సర్వీసెస్, సివిల్ డిఫెన్స్, హోమ్‌గార్డుల విభాగానికి డైరక్టర్ జనరల్‌గా నియమిస్తూ హైపవర్ కమిటీ నిర్ణయం వెలువడిన కాసేపటికే మిగతా 9లో



ఇబిసి కోటాపై సుప్రీంలో సవాలు

న్యూఢిల్లీ: జనరల్ కేటగిరీ పేదలకు విద్య, ఉద్యోగావకాశాలలో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదించిన బిల్లును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో గురువారం కొన్ని పిటిషన్‌లు దాఖలయ్యాయి. యూత్ ఫర్ ఈక్వాలిటీ అనే సంస్థతో పాటు కౌశల్ కాంత్ మిశ్రా ఈ పిటిషన్‌లు దాఖలు చేశారు. రిజర్వేషన్లకు కేవలం ఆర్థిక వెనుకబాటుతనమే ప్రాతిపదిక కాదని, అందువల్ల ఈ బిల్లును కొట్టేయాలని పిటిషనర్లు కోర్టును అభ్యర్థించారు. జనరల్ కేటగిరీ వర్గాలకు ఆర్థిక పరమైన రిజర్వేషన్లను పరిమితం చేయరాదని, 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని మించరాదన్న రాజ్యాంగ మౌలిక లక్షణాలను ఈ బిల్లు ఉల్లంఘిస్తోందని పిటిషనర్లు పేర్కొన్నారు. ఈ బిల్లును మంగళవారం లోక్‌సభ ఆమోదించగా, బుధవారం నాడు రాజ్యసభ ఆమోదించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన వర్గా(ఒబిసి)లకు అమలు చేస్తున్న 50 శాతం రిజర్వేషన్లకు ఈ ప్రతిపాదిత పది శాతం కోటా అదనం. ఈ అదనపు రిజర్వేషన్ల విధానాన్ని సుప్రీంకోర్టు వ్యతిరేకిస్తే ప్రస్తుత రిజర్వేషన్ల పరిధిలోనే అదనపు కోటాను ఏర్పాటుచేయాల్సి వుంటుంది.



చిన్న వ్యాపారులకు జిఎస్టీ ఊరట

- రిజిస్ట్రేషన్ పరిమితి రూ.40 లక్షలకు పెంపు
- ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ
- రాష్ట్రాల ప్రతిపాదనలు చర్చకు రావటం లేదు: యనమల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

జిఎస్టీ పరిధిలోకి వచ్చే వ్యాపార రిజిస్ట్రేషన్ పరిమితిని పెంచుతున్నట్లు కౌన్సిల్ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో చిన్న వ్యాపారులకు వస్తు, సేవల పన్ను (జిఎస్టీ) నుంచి ఊరట లభించింది. ప్రస్తుతమున్న పరిమితిని రూ.20 లక్షల నుంచి రూ.40లక్షలకు పెంచుతున్నట్లు ఆర్థికశాఖ మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. కాంపొజిషన్ పథకం కింద ఉండే పరిమితిని రూ.కోటి నుంచి రూ.1.5 కోట్లకు పెంచుతున్నట్లు తెలిపారు. గురువారం నాడిక్కడ విజ్ఞాన మిగతా 9లో

పిఎసిఎస్ సిబ్బంది గోడు వినపడటం లేదా?

- ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిలదీసిన మధు
- సమస్యలు తక్షణమే పరిష్కరించాలని సిఎంకు లేఖ
- విజయవాడలో ఉద్యోగుల భారీ ర్యాలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమస్యల పరిష్కారం కోసం రోజుల తరబడి ఆందోళన చేస్తున్నా పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా విజయవాడలో పిఎసిఎస్ ఉద్యోగులు భారీ ప్రదర్శన నిర్వహించారు. రోజుల తరబడి సమ్మె, నిరాహార దీక్షలు చేస్తున్నా స్పందించకపోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెల 3 వ తేది నుండి చేస్తున్న నిరాహార దీక్షలను విరమించిన వారు గురువారం విజయవాడకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. విజయవాడ రైల్వేస్టేషన్ నుండి బయలుదేరిన ప్రదర్శన అలంకార్ సెంటర్లోని ధర్నా చౌక్ వరకూ ప్రదర్శన నిర్వహించారు. రైల్వేస్టేషన్ నుండి బయలుదేరిన ప్రదర్శన గాంధీనగర్, ఐలాపురం మీదుగా ధర్నాచౌక్‌కు చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు ఈ ప్రదర్శనలో మారుమ్రోగాయి. అనంతరం ఎపి స్టేట్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ సొసైటీస్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు పి.వి.సత్యనారాయణరాజు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సిపిఎం మిగతా 9లో



విజయవాడలో పిఎసిఎస్ ఉద్యోగుల ర్యాలీ, ఇన్‌సెట్‌లో ప్రసంగిస్తున్న మధు



జస్టిస్ బేడి నివేదికను పిటిషనర్లకు ఇవ్వలేం

8

- గుజరాత్ ఎన్‌కౌంటర్లపై పోలీసు అధికారి వెల్లడి

ఆర్టీసికి 61 ఏళ్లు



1932 నాటి తొలితరం డక్కన్ క్వీన్ బస్సు

- అతిపెద్ద రవాణా సంస్థగా ఎదుగుదల
- గిన్నిస్ బుక్‌లోనూ స్థానం
- నేడు ఆర్టీసి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బస్సు ప్రయాణమంటే వెంటనే గుర్తుకొచ్చేది ఎపిఎస్‌ఆర్‌టిసినే! మారుమూల గ్రామాల నుంచి పెద్ద నగరాల వరకు అన్ని ప్రాంతాలను అనుసంధానం చేసే ఆర్టీసి సేవలు ప్రారంభమై నేటికి 61 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ కాలంలో ప్రజాప్రయాణ సాధనంగా ఆర్‌టిసి తిరుగులేని గుర్తింపుపొందింది. ఎన్నో రికార్డులు సాధించింది. ఆర్‌టిసి కార్మికుల అంకితభావం, నిర్విరామ కృషే ఈ ఘనతకు కారణం. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, ప్రైవేటీకరణ కత్తిని వేలాడదీసినా ఆర్‌టిసి కార్మికులు ఏనాడు వెనుకంజవేయలేదు. వాస్తవానికి 1932 జూన్‌లో నిజామ్ స్టేట్ రైల్, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్(ఎన్‌ఎస్‌ఆర్-ఆర్‌టిడి)గా 27 బస్సులతో 166 మంది ఉద్యోగులతో ఈ సంస్థ ప్రారంభమైంది. 1951 నవంబర్ 1న హైదరాబాద్ రాష్ట్ర ప్రభుత్వంలో ఒక శాఖగా మారింది. అనంతరం 1958 జనవరి 11న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థగా మారింది. నేడు 128 డిపోలు, 427 బస్‌స్టేషన్లు, 11,773 బస్సులతో 53644 మందికి ఉపాధి కల్పిస్తూ దేశంలోనే అతి పెద్ద రవాణా సంస్థగా పేరొందింది. కార్పొరేషన్‌గా మారి జనవరి 11కు 61 వసంతాలు పూర్తి చేసుకుంది. మారుతున్న మిగతా 9లో

అయోధ్య కేసు విచారణ 29కి వాయిదా

బెంచ్ నుండి వైదొలిగిన జస్టిస్ లలిత్

న్యూఢిల్లీ : అయోధ్య వివాదంపై సుప్రీంకోర్టు విచారణ మరింత జాప్యం కానుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రధాన న్యాయమూర్తితో కూడిన ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం నుండి జస్టిస్ యుయు లలిత్ గురువారం వైదొలగడంతో తదుపరి విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈ వివాదంతో సంబంధం ఉన్న ఒక క్రిమినల్ కేసులో కళ్యాణ్ సింగ్ ప్రభుత్వం తరుపున 1997లో జస్టిస్ యుయు లలిత్ వాదించారని యుపి సెంట్రల్ వక్ఫ్‌బోర్డు తరుపు న్యాయవాది రాజీవ్ ధావన్ అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే ఆ కేసుకు, వివాదాస్పద అయోధ్య కేసుకు ఎటువంటి సంబంధాలు లేవని ధార్మిక సంస్థల తరుపు మిగతా 9లో

నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు అక్రమ లాకౌట్

రోడ్డున పడ్డ 3,500 మంది కార్మికులు



లాకౌట్ ప్రకటించిన నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు

ప్రజాశక్తి- నెల్లిమర్ల (విజయనగరం జిల్లా)

రాష్ట్రంలో పేరెన్నికగన్న విజయనగరం జిల్లా నెల్లిమర్ల జ్యూట్‌మిల్లుకు యాజమాన్యం అక్రమ లాకౌట్ ప్రకటించింది. మిల్లు గేటు వద్ద లాకౌట్ నోటీసు పెట్టింది. దీంతో,1500 మంది పర్మినెంట్ కార్మికులు, సుమారు రెండు వేల మంది దినసరి కూలీలు రోడ్డున పడ్డారు. గత రెండు రోజులుగా దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సమ్మె చేసిన కార్మికులు గురువారం ఉదయం ఎ-షిఫ్ట్‌కు హాజరయ్యేందుకు వెళ్లారు. రోజూ ఎ-షిఫ్టుకు మూడు సైరన్లు మోగాల్సి ఉండగా, మోగలేదు. సైరన్ పనిచేయడం లేదని కార్మికులు భావించారు. డ్యూటీ కోసం మిల్లుకు వచ్చిన కార్మికులు లాకౌట్ నోటీసును చూసి అవాక్కయ్యారు. లాకౌట్‌కు సహేతుకమైన కారణాలను చెప్పకుండా యాజమాన్యం కార్మికులపై నెపం నెట్టేందుకు ప్రయత్నించింది. యాజమాన్యానికి చెందిన స్థలాలను కార్మికులు ఆక్రమించేందుకలు మిగతా 9లో



వాణిజ్య కేంద్రంగా వెల్‌కం గ్యాలరీ

- ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- వేర్వేరు కంపెనీలతో ఒప్పందాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వాణిజ్య కేంద్రంగా అమరావతి వెల్‌కం గ్యాలరీ ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. సమాజం, వాణిజ్యం, భాగస్వామ్యాలకు మూలకేంద్రంగా ఉంటుందనీ తెలిపారు. అమరావతి రాజధాని ప్రాంతంలోని లింగాయపాలెంలో ఏర్పాటు చేసిన వెల్‌కం గ్యాలరీని సింగపూర్ మంత్రి ఈశ్వరన్‌తో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. తొలిదశలో 45 ఎకరాల్లో సుమారు 40 కోట్ల పెట్టుబడితో పనులు ప్రారంభిస్తామని చెప్పారు. దీనిపై ఇప్పటికే జర్మనీ, ఇండియా, సింగపూర్‌కు చెందిన 15 కంపెనీలు ఎడిపితో ఒప్పందం చేసుకున్నాయని తెలిపారు. అభివృద్ధి విషయంలో సింగపూర్ సహకారం మరువలేనిదని చెప్పారు. లీక్వాన్ యూనివర్శిటీ రేటింగ్‌లో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసే వెల్‌కం గ్యాలరీలో మార్కెట్ లీడర్లను ఒకేచోటకు తెచ్చేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. స్మార్ట్ ఎనర్జీ, కొలాబరేషన్స్, స్మార్ట్ బిల్డింగ్, ఎన్విరాన్‌మెంట్ అభివృద్ధి చేయడమే ఈ కంపెనీ లక్ష్యమని చెప్పారు. సింగపూర్ మంత్రి ఈశ్వరన్ మాట్లాడుతూ సింగపూర్, ఆంధ్రప్రదేశ్ మధ్య పటిష్ట బంధం ఏర్పడిందని తెలిపారు. దీనివల్లే సహకారం తెలికైందని చెప్పారు. వెల్‌కం గ్యాలరీలో రోజుకు రెండు నుండి మూడువేల మంది వరకూ సందర్శించే ఏర్పాట్లు చేశామని ఎడిసి వైస్ ఛైర్‌పర్సన్ లక్ష్మీపార్థసారథి తెలిపారు. 2.6 హెక్టార్ల విస్తీర్ణంలో దీన్ని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. స్టార్టప్ ఏరియాకు సంబంధించి ఏకీకృత సేవల కేంద్రంగా ఈ గ్యాలరీ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారాయణ, ఆనందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్యేలు శ్రావణ్‌కుమార్, ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, సిఎం కార్యదర్శులు సాయిప్రసాద్, రాజమౌళి, గిరిజాశంకర్, రెరా అధ్యక్షులు రమానాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానితో గవర్నర్ నరసింహన్ భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తెలుగు రాష్ట్రాల ఉమ్మడి గవర్నర్ నరసింహన్ ఢిల్లీ పర్యటనలో గురువారం బిజిబిజీగా గడిపారు. ఉదయం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో సమావేశమై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని తాజా రాజకీయ పరిస్థితులను చర్చించినట్లు సమాచారం. అదేవిధంగా హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో కూడా నరసింహన్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా రెండు రాష్ర్టాల్లోని రాజకీయ, పరిపాలన పరిస్థితులపై ఆయనకు నివేదిక ఇచ్చారు. అంతేకాకుండా తెలుగు రాష్ట్రాల్లోని తాజా పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. తెలంగాణలో టిఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత గవర్నర్ ఢిల్లీ పర్యటనకి వెళ్లడం ఇదే తొలిసారి కావడం విశేషం.

పొడి వాతావరణమే!

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో మూడు నాలుగు రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఒకటి రెండు రోజులు కోస్తా, సీమల్లో పగటి, రాత్రవేళల్లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గినా తర్వాత సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు చెబుతున్నారు. కోస్తాలో పగలు 27 నుంచి 32, రాత్రి వేళ 15.5 నుంచి 21 డిగ్రీలు వరకు, రాయలసీమలో పగలు 30 నుంచి 33, రాత్రి వేళలో 12.5 నుంచి 17.5 డిగ్రీలు వరకు నమోదవుతున్నాయి. విశాఖ ఏజెన్సీలో లంబసింగి, అరకు వంటి ప్రాంతాల్లో రాత్రి వేళల్లో 5 నుంచి 6 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.

28న కలెక్టర్ల కాన్ఫరెన్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌ను ఈనెల 28న జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(రెవెన్యూ) మన్మోహన్‌సింగ్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసం వద్దనున్న ప్రజావేదిక హాలులో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు

నేటి నుంచి ఆహారోత్సవం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో విజయవాడ, తిరుపతి, కాకినాడ నగరాల్లో ఆహారోత్సవాన్ని నిర్వహించనున్నారు. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో ఈ నెల 11 నుంచి 24 వరకు, అలాగే తిరుపతిలో హోటల్ మానస్ సరోవర్‌లోనూ, కాకినాడలో మహేంద్రా మిఠాయి వాలాలోనూ ఈ నెల 12 నుంచి వారం రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పర్యాటక శాఖ సిఇఓ హిమాన్షు శుక్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగుదనం ప్రతిబింబించే వంటకాలను జనబాహుళ్యంలోకి తీసుకొచ్చేందుకు పర్యాటక శాఖ ఈ ఉత్సవాలను నిర్వహిస్తోం దని పేర్కొన్నారు. పోషక విలువలు, రుచుల పరంగా ఆంధ్రప్రదేశ్ వంటకాలను మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావటమే ప్రధాన ధ్యేయమని తెలిపారు.

ప్రజ్ఞ

సమాధానాలు 7లో

1. భారత ప్రసారాలపై నిషేధం విధించిన దేశం ?
2. ఎక్కడ ఖైలో ఇండియా యూత్ గేమ్స్ జరుగుతున్నాయి?
3. రాజీనామ చేసిన ప్రపంచ బ్యాంక్ ప్రెసిడెంట్ ఎవరు?
4. ఏ బ్యాంక్ ఇండియన్ ఆర్మీకి మధ్య MOU ఒప్పదం కుదిరింది?
5. ఏ సంస్థ సౌర వ్యవస్థలో 3వ కొత్త గ్రహం HD 21749 దీని కనుకోన్నది ?

ఎంఎస్‌ఎంఇ పార్కులకు వసతుల కల్పన

- 16వేల గ్రామాల్లో అభివృద్ధి ప్రణాళిక
- పంచదార్ల గ్రామసభలో అమరావతి నుంచి సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

ప్రతి ఇంట్లో ప్రతి వ్యక్తీ పారిశ్రామికవేత్తగా ఎదగాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆరో విడత జన్మభూమి సందర్భంగా విద్యుత్, పరిశ్రమలు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధిలో భాగంగా రూ. 200 కోట్లతో చేపట్టనున్న 31 ఎంఎస్‌ఎంఇ పార్కులు, రూ.2500 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ముఖ్యమంత్రి అమరావతి నుంచి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన రాంబిల్లి మండలం పంచదార్లలో జరిగిన జన్మభూమి-మావూరు గ్రామసభనుద్దేశించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పారిశ్రామికంగా రాష్ట్రాన్ని భారతదేశంలో మొదటిస్థానంలో నిలపడం తన లక్ష్యమన్నారు. చిన్నపరిశ్రమల ఏర్పాటు వల్ల ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. విశాఖలోని అధాని గ్రూపు 70వేల కోట్లతో డేటా సెంటర్ పెట్టడానికి ముందుకురావడంతో లక్షమందికి ఉపాధి కలుగుతుందని తెలిపారు. మానవశక్తికి అదనంగా కంప్యూటర్ శక్తి తోడైతే కొన్ని వందల పరిష్కారాలు లభిస్తాయన్నారు. రాష్ట్ర వ్యాపితంగా 16వేల గ్రామాల్లో విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్ తయారు చేయనున్నామని పేర్కొన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో వ్యక్తిగత ఆదాయం, అభివృద్ధి, తలసరి ఆదాయం, కుటుంబ, సమాజ వికాసానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. చిన్న పరిశ్రమలు ఎక్కువగా రావాలన్నారు.



పంచదార్ల సభలో మాట్లాడుతున్న మంత్రి గంటా శ్రీనివాసరావు
(ఇన్‌సెట్‌లో) అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల అభివృద్ధికి ఆదరణ పథకం ద్వారా ఆధునిక పరికరాలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఎంఎస్‌ఎంఇ పార్కులకు అన్ని రకాల వసతులను కల్పిస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఎలక్ట్రికల్ స్కూటర్లను ఇవ్వనున్నామని తెలిపారు. స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీస్‌కు విద్యుత్ ఛార్జీలు పెంచబోమన్నారు. లోకల్ గ్రిడ్‌కు అనుసంధానం చేసి సోలార్ విద్యుత్ ఉత్పత్తిచేయనున్నట్లు చెప్పారు. మెడటెక్ జోన్‌లో 270 ఎకరాల్లో ప్రపంచంలోని ఎక్కడాలేని విధంగా మెడికల్ ఎక్విప్‌మెంట్ పరికరాల తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వ్యవసాయరంగంతో పాటు ఇండస్ట్రీస్, సర్వీసు సెంటర్లను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఐటి రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.


గ్రామసభలో రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి ఎంపి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంఎల్‌సి పప్పల చలపతిరావు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ లాలం భవానీ, యలమంచిలి ఎంఎల్‌ఎ పంచకర్ల రమేష్‌బాబు, అనకాపల్లి ఎంఎల్‌ఎ పీలా గోవింద సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, పరిశ్రమల శాఖ కమిషనర్ సిద్ధార్థ జయన్ తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగత కమిటీలకు సమాయత్తం

- గుంటూరు, కడప జిల్లాల నేతలతో పవన్ సమావేశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంస్థాగత కమిటీలు వేయడానికి జనసేన పార్టీ సమాయత్తమౌతోందని ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చెప్పారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గుంటూరు, కడప జిల్లాల పార్టీ నాయకులతో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణా, ఆంధ్ర ప్రాంతాలు సాంస్కృతికంగా సమ్మిళితం కాలేకపోవడం వేర్పాటువాదానికి ఒక కారణమన్నారు. రాయలసీమలో ఇటువంటి పరిస్థితి ఉందని, దీనిపై ఆలోచన చేయకపోతే భవిష్యత్తులో పరిస్థితులు ప్రమాదకరంగా మారుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. కడప జిల్లాకు రాజంపేట, కడప పార్లమెంట్ స్థాయి కమిటీలు ఉంటాయన్నారు. రాష్ట్రాభివృద్ధికి, అమరావతి ముందుకు తీసుకెళ్లడానికి జనసేన పార్టీ అవసరం ఉందన్నారు.



రాజధాని నిర్మాణానికి కనీసం 30 ఏళ్ళ పడుతోందని చెప్పారు. రాష్ట్రంలో ఏ జిల్లా చూసినా రాజకీయం కొన్ని కుటుంబాలకే పరిమితం అయ్యిందని చెప్పారు. జనసేనకు యువత, మహిళలు అండగా ఉన్నారని వీరి మద్దతుతోనే వచ్చే ఎన్నికల్లో ముందుకు వెళ్లగలమన్నారు.

పెదరావూరు రైతులతో 13న ఇష్టాగోష్టి

జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ గుంటూరు జిల్లా తెనాలి సమీపాన పెదరావూరులో మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్ వ్యవసాయ క్షేత్రంలో ఈ నెల 13న జరగనున్న సంక్రాంతి సంబరాల్లో పవన్ పాల్గొంటారని ఆ పార్టీ ఉపాధ్యక్షులు పి.మహేందర్‌రెడ్డి తెలిపారు. రైతులతో ఇష్టాగోష్టి ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదే రోజు జనసేన సాంస్కృతిక విభాగాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు

ఎంబిబిఎస్ రిజర్వేషన్ల పరిశీలనకు త్రిసభ్య కమిటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా ఎంబిబిఎస్ సీట్ల కేటాయింపులో ఎస్సీ, ఎస్టీ, బిసి రిజర్వేషన్ల అమలు పరిశీలనకు ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఈమేరకు వైద్యఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వైద్య విద్య సంచాలకులు (డిఎంఇ) (అకాడమిక్), డిఎంఇ (పరిపాలన), ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ కమిటీలో సభ్యులుగా ఉంటారని పేర్కొన్నారు. గతేడాది ఎంబిబిఎస్ సీట్ల కౌన్సెలింగ్‌లో జిఒ 550 అమలు చేయకపోవడంతో రిజర్వేషన్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్న విమర్శలున్నాయి. అయితే ఈ విద్యాసంవత్సరం నుంచి జిఒ 550 యథాతథంగా అమలు చేయాలంటూ సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన సంగతి విదితమే. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాలు, రిజర్వేషన్ కోటా, పరిమితులు తదితర నిబంధనలు పరిగణలోకి తీసుకొని కమిటీ మూడు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని పేర్కొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి!

కాంగ్రెస్ కోర్ కమిటీ పిలుపు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని కాంగ్రెస్ కోర్ కమిటీ పిలుపు నిచ్చింది. ఇటీవల మూడు రాష్ట్రాల్లో విజయం అందించిన ఉత్సాహంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ, లోక్‌సభ ఎన్నికల సన్నాహాలపై ఇప్పటికే దృష్టి సారించింది. అందులో భాగంగా గురువారం నాడిక్కడ కాంగ్రెస్ పార్టీ వార్ రూంలో అన్ని రాష్ట్రాల పిసిసి అధ్యక్షులు, వర్కింగ్ ప్రెసిడెంట్లు, కోశాధికారులు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించింది. ముందుగా దేశంలోని అన్ని పిసిసి కమిటీలకు సంయుక్త సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో ఏపి నుంచి పిసిసి అధ్యక్షుడు రఘు వీరారెడ్డి హాజరయ్యారు. టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్ కుమార్‌రెడ్డి విదేశీ పర్యటనలో ఉండటంతో టిపిసిసి కోశాధికారి గూడూరు నారాయణ రెడ్డి, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఆయా రాష్ట్రాల్లో తాజా రాజకీయ పరిణామాలు, సార్వత్రిక ఎన్నికలపై ఈ సమావేశంలో చర్చించారు. భవిష్యత్ కార్యాచరణపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీతో పాటు ఇతర సీనియర్ నేతలు దిశానిర్దేశం చేశారు.

షెడ్యూల్ లోపే పొత్తులపై నిర్ణయం: రఘువీరా

పొత్తులపై క్లారిటీ లేదని, ఈ నెల 20 లోపు ఏపిలో టిడిపితో కాంగ్రెస్ పొత్తు ఉంటుందా? లేదా? అన్న అంశంపై ఏపిసిసి అధ్యక్షుడు రఘువీరా రెడ్డి స్పష్టత వస్తుందని తెలిపారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడే లోపు పొత్తులపై నిర్ణయం తీసుకుంటామని అధిష్ఠానం తెలిపిందన్నారు. మానిఫెస్టో రూపకల్పన, అభ్యర్థుల ఖరారుపై అధిష్టానం దృష్టి సారించిందని తెలిపారు. బూత్ స్థాయి నుంచి అన్ని కమిటీలను పూర్తి చేయాలని అధిష్ఠానం ఆదేశించిందని తెలిపారు.

22న దావోస్‌కు సిఎం

- పర్యటన కేవలం మూడు రోజులే
- 17 మందితో ప్రతినిధుల బృందం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 22వ తేదీన దావోస్ పర్యటనకు బయలుదేరనున్నారు. 17 మంది ప్రతినిధులతో ఆయన వెళ్తున్నారు. తిరిగి 25వ తేదీన రాష్ట్రానికి రానున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు జరుగుతున్న ఈ పర్యటనకు ఏడు రోజులపాటు అనుమతించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా వారు కేవలం మూడు రోజులకు మాత్రమే అనుమతించడం గమనార్హం. ఈ పర్యటనలో చంద్రబాబుతోపాటు ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సతీష్‌చంద్ర, ఆరోగ్య శాఖ స్పెషల్ సిఎస్ పూనం మాలకొండయ్య, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు టి.విజయకుమార్, సిఎంఓ ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్, ఇంధన, మౌలికాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌జైన్, ఆర్థికాభివృద్ధి బోర్డు కార్యదర్శి కృష్ణకిషోర్, పరిశ్రమలశాఖ కార్యదర్శి సాల్మన్ అలోక్‌రాజ్, ఐటి కార్యదర్శి విజయానంద్, క్రీడా కమిషనర్ శ్రీధర్, ఎపిఐఐసి విసిఎండి అహ్మద్‌బాబు, సమాచార శాఖ కమిషనర్ వెంకటేశ్వర్‌తోపాటు చంద్రబాబు వ్యక్తిగత సిబ్బంది కూడా ఈ పర్యటనలో పాల్గొంటున్నారు. కాగా ఈ పర్యటనను పెట్టుబడుల ఆహ్వానానికి నిర్వహిస్తున్నట్లు కేంద్రానికి చేసుకున్న దరఖాస్తుల్లో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఈ పర్యటన చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ పర్యటన ద్వారా కొన్ని ఒప్పందాలు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు, పూర్తిగా రాష్ట్ర నిధులతోనే ఈ పర్యటన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా పర్యటన అనంతరం సాధించిన ఫలితాలను రాష్ట్ర ప్రభుత్వం వివరించాల్సి ఉంటుందని కేంద్రం షరతు విధించింది.

ఈ నెల 13న డిఎస్‌సి నమూనా పరీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్‌సి నమూనా పరీక్ష ఎస్టీయు ఆధ్వర్యంలో ఈ నెల 13న నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు, గాజుల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థుల్లో అవగాహన, ఆత్మస్థైర్యం పెంపొందించడానికి నమూనా పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. కేవలం ఎస్‌జిటి తెలుగు మీడియం అభ్యర్థులకు మాత్రమే ఆఫ్‌లైన్లో నిర్వహిస్తామని ప్రకటించారు. ప్రతి కేంద్రంలో అభ్యర్థులు పొందిన మార్కులను తెలియజేస్తామని, మొదటి మూడు ర్యాంకులు పొందిన అభ్యర్థులకు బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు ఆయా జిల్లా ఎస్టీయు శాఖలను సంప్రదించాలని తెలిపారు.

ఒక్కరోజులో రూ. లక్ష కోట్ల ఒప్పందాలు : సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఒక్కరోజులోనే లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని, దీంతో లక్షా ఇరవై వేల ఉద్యోగాలు కల్పించే పరిశ్రమలు రానున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. తొమ్మిది రోజులుగా జరుగుతున్న జన్మభూమి కార్యక్రమంపై గురువారం జిల్లా కలెక్టర్లు, నోడల్ అధికారులు, ప్రజాప్రతినిధులతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ జన్మభూమికి ప్రజల నుంచి స్పందన బాగుందన్నారు. విశాఖలో ముప్పై వేల కోట్ల పెట్టుబడులతో డేటా సెంటర్ పార్కులు వస్తాయని చెప్పారు. ప్రకాశం జిల్లాకు రూ.24,500 కోట్ల పెట్టుబడులు రానున్నాయని పేర్కొన్నారు. ఏపి లాజిస్టిక్ హబ్‌కానుందని పేర్కొన్నారు. ఇళ్ల కోసం ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కోరారు.

ట్రాన్స్‌జెండర్ బిల్లును సవరించాలి

మానవహక్కుల వేదిక డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ట్రాన్స్‌జెండర్ల హక్కుల రక్షణ బిల్లు 2018ను సవరించి వారి హక్కులను కాపాడాలని ఏపి మానవహక్కుల వేదిక (హెచ్‌ఆర్‌ఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు హెచ్‌ఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు యు జి శ్రీనివాసులు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ట్రాన్స్‌జెండర్ల హక్కుల రక్షణ బిల్లును లోక్‌సభ ఇటీవల ఆమోదించిన సంగతి తెలిసిందనీ, ఈ బిల్లులో పేర్కొన్న అంశాలు ట్రాన్స్‌జెండర్ల హక్కులను కాలరాసే విధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ బిల్లు ప్రకారం ఎవరికి వారు ట్రాన్స్‌జెండర్లుగా నిర్ణయించుకునే వీలులేదనీ, జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటి పరిశీలించాల్సి ఉందనీ తెలిపారు. ఇది తమ హక్కుల ఉల్లంఘనేనని ట్రాన్స్‌జెండర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. 'నల్సా' తీర్పులో సుప్రీం కోర్టు తమను సామాజికంగా వెనుకబడిన వర్గంగా పరిగణించి విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని తీర్పునిస్తే వాటి ప్రస్తావన ఈ బిల్లులో లేదని పేర్కొన్నారు. ట్రాన్స్‌జెండర్లు యాచించడాన్ని ఈ బిల్లు నేరంగా పరిగణిస్తోందనీ, గత్యంతరం లేని పరిస్థితుల్లోనే వారు యాచిస్తున్నారనీ తెలిపారు. ట్రాన్స్‌జెండర్లు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల సంరక్షణలోనే ఉండాలనే ఆంక్షలను ఈ బిల్లులో కేంద్ర ప్రభుత్వం విధించిందనీ, వారికి ఇష్టం వచ్చినవారితో కలిసి జీవించే స్వాతంత్రాన్ని కల్పించాలని ఆయన కోరారు. ట్రాన్స్‌జెండర్ల హక్కులను కాలరాసేలా ఉన్న ఈ బిల్లును రాజ్యసభ ఆమోదించకుండా, బిల్లును సవరించి శతాబ్దాలుగా ఏ హక్కుకూ నోచుకోని ట్రాన్స్‌జెండర్లకు ఊరట చేకూర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

జగన్ సిఎం అయితే రాక్షస పాలనే

కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తులసిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి అధినేత జగన్ రాష్ట్ర ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో రాక్షస పాలన సాగిదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ తులసిరెడ్డి విమర్శించారు. ఇడుపుల పాయ, బెంగుళూరు వరకే పరిమితమైన జగన్ ఆర్థిక సామ్రాజ్యం అంగారక గ్రహంపైకి విస్తరిస్తుందని గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. పాదయాత్రకు రోజుకు రూ.2కోట్లు జగన్ ఖర్చు చేశారని, ఎమ్మెల్యే టిక్కెట్టుకు రూ.30కోట్లు, ఎంపి టిక్కెట్టుకు రూ.100కోట్లు వసూలు చేసి డబ్బుపై వ్యామోహం లేదనడం దశాబ్దపు జోక్ అని పేర్కొన్నారు.

ప్రత్యేకం

కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులపై

ప్రత్యేక దృష్టి



సిఎస్ పునేఠా

శాఖలతో ఎపి భవన్ అనుసంధానం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్రం నుంచి వచ్చే నిధులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇటీవల జరిగిన కార్యదర్శుల సమీక్ష అనంతరం కొన్ని కీలక నిర్ణయాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పునేఠా, రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్‌లు అన్ని శాఖలకు సర్క్యులర్లు జారీ చేశారు. పలు అంశాలపై తీసుకున్న చర్యలను వివరిస్తూ ఈనెల 11 లోగా నివేదికలు పంపించాలని నిర్దేశించారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ఇప్పటివరకు వచ్చిన నిధులపై ఆర్థిక శాఖ ఒక నివేదిక తయారుచేయాలని, దాని ఆధారంగా అన్ని శాఖలూ ఢిల్లీలోని ఎపి భవన్ అధికారులతో సమన్వయం చేసుకుని, కేంద్రం నుంచి అదనపు నిధులొచ్చేలా ప్రయత్నించాలని వారు సూచించారు. త్వరలోనే ముఖ్యమంత్రి కూడా ఇదే అంశంపై సమీక్షించనున్నారని వారు వివరించారు. అలాగే సేవా రంగంలో వృద్ధిని పెంచేందుకు ఏర్పాటుచేసిన కమిటీతో మూడో వారంలో సమీక్షించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా సిద్ధం చేయాలని వారు ఆదేశించారు. పౌర సరఫరాల శాఖపై ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిపైనా వారు స్పందిస్తూ అసంతృప్తిని తగ్గించే చర్యలపై ఆర్టీజి అమలు చేస్తున్న విధానాలను ఇంకా కొనసాగించాలని పలు దఫాలుగా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించాలని సూచించారు. యువనేస్తానికి సంబంధించి కూడా కొన్ని సూచనలు చేశారు.

వివిధ శాఖలను యువనేస్తంతో అనుసంధానం చేసేందుకు ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. దీనికోసం అవసరమైన వనరులను కూడా సిద్ధం చేసి ఫైలును వెంటనే ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. యువనేస్తం ద్వారా 35 వేల మంది వ్యవసాయం, అనుబంధ రంగాల్లో వృత్తి శిక్షణకు దరఖాస్తు చేసుకున్నారని, అందువల్ల వాటికి సంబంధించిన శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పింఛన్లు, ఇళ్లు, ఇతర లబ్ధికి సంబంధించిన దరఖాస్తులను వెంటనే అధ్యయనం చేసి జన్మభూమి చివరి రోజున ప్రకటించాలని సూచించారు.

సీమకు తాగునీరు...

వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటినుంచే తాగునీటిపై దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రధానంగా ప్రకాశం, రాయలసీమ జిల్లాలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. విశాఖ గ్రామీణంలో ఏర్పాటుచేస్తున్న పెట్రోలియం సంస్థకు కావాల్సిన నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం అమలు కోసం ట్రైసైకిళ్లు, చెత్తకుండీలతోపాటు, ఎల్ఇడి వీధిదీపాలను కూడా సిద్ధం చేయాలని, దీనికోసం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రోన్ల వినియోగంపై రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని, త్వరలోనే దీనిపై సమీక్ష నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

సంక్షిప్తం

ప్రజలంతా జగన్ వెంటే : విజయచందర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కుల, మత, ప్రాంతాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలంతా వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెంట ఉన్నారని, ప్రజా సంకల్పయాత్రకు లభించిన ఆదరణతో ఆ విషయం స్పష్టమైందని వైసిపి ప్రచార కమిటీ అధ్యక్షులు, సినీ నటులు టిఎస్ విజయచందర్ అన్నారు. విజయవాడలోని వైసిపి రాష్ట్ర కార్యాలయంలో గురవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇచ్ఛాపురంలో జరిగిన పాదయాత్ర ముగింపు సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే సంక్రాంతి ముందుగా వచ్చినట్లు అనిపించిదన్నారు. వైసిపి నేత నందిగం సురేష్‌బాబు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు గతంలో పాదయాత్ర చేసినప్పుడు కిలో మీటరు నడిచి, ఆరు కిలోమీటర్లు బస్సులో ప్రయాణించారని, అదీ ఒక పాదయాత్రేనా అని ప్రశ్నించారు.

ఆరు దేశాల్లో జగన్ మనీ లాండరింగ్ : వర్ల రామయ్య

ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరు దేశాల్లో మనీ లాండరింగ్‌కు పాల్పడ్డాడని, ఆ సమాచారాన్ని సిబిఐ ఎందుకు సేకరించడం లేదని ఎపిఎస్ ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య ప్రశ్నించారు. బందరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల కోసం పాదయాత్ర చేస్తే, ప్రతిపక్షనేత జగన్ పాద యాత్ర విహారయాత్రలాగా సాగిందని ఆయన ఎద్దేవా చేశారు.

స్వప్రయోజనాల కోసమే జగన్ యాత్ర : వేమూరి

ప్రతిపక్షనేత వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర కేవలం ఆయన స్వప్రయోజనాల కోసమే తప్ప, ప్రజల కోసం కాదని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ వేమూరి ఆనందసూర్య అన్నారు. బందరు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో స్వీకరించిన అర్జీలను ఏనాడైనా ప్రభుత్వ శాఖలకు పంపారా? అని ఆయన ప్రశ్నించారు.

పదిశాతం రిజర్వేషన్లపై

నేడు బిసి సంఘం ఆందోళన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

అగ్రకులాల్లో పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్‌లను ముట్టడించాలని రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కేశన శంకరరావు కోరారు. గుంటూరులోని అరండల్‌పేటలో గల జిల్లా కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ బిల్లు ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీలకు గొడ్డలిపెట్టులాంటిదని చెప్పారు. ఈ విషయంలో బిసిలు స్పందించాలని, లేదంటే భవిష్యత్తులో పూర్తిగా నష్టపోతామన్నారు. సుప్రీంకోర్టు తీర్పును బేఖాతరు చేస్తూ మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల బిసిలకు నష్టం జరుగుతుందన్నారు. 15 శాతం మంది ఉన్న అగ్రకులాలకు 50శాతం, 52 శాతం మంది జనాభా ఉన్న బిసిలకు 22 శాతం రిజర్వేన్లు ఇస్తున్నారని తెలిపారు. బిసిల జనాభాకనుగుణంగా వారికి కోటా పెరగడంలేదని చెప్పారు. కలెక్టరేట్‌ల ముట్టడి తరువాత ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. బిసిలు ఒక రాజకీయ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగాలన్నారు.



షాట్‌పుట్ విభాగంలో పాల్గొన్న మహిళా సిబ్బంది

ముగిసిన ఇంటర్ బోర్డు స్వర్ణోత్సవాలు

విజేతల వివరాలు వెల్లడి : త్వరలో బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - తెనాలిటౌన్ (గుంటూరు)

ఇంటర్మీడియట్ బోర్డు ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గుంటూరు జిల్లా తెనాలి వేదికగా నిర్వహించిన స్వర్ణోత్సవాలు గురువారంతో ముగిశాయి. క్రీడలు, అథ్లెటిక్స్ పోటీలలో విజేతల వివరాలను గురువారం ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి జడ్ఎస్.రామచంద్రరావు వెల్లడించారు. బోసు రోడ్డులోని వేదికలో ఆర్ఐఒ వెల్లడించిన వివరాల ప్రకారం మైమ్ విభాగంలో మొదటి స్థానాన్ని నరసరావుపేట ఎస్‌వి జూనియర్ కళాశాలకు చెందిన మనోజ్‌కుమార్ బృందం సొంతం చేసుకుంది. మిమిక్రీలో గుంటూరు జిల్లా మండపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన తేజ, మ్యూజిక్ సోలో విభాగంలో ఈస్ట్ గోదావరి జిల్లాకు చెందిన తేజ, నెల్లూరు జిల్లాకు చెందిన నందు ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందారు. మ్యూజిక్‌లో విన్నర్‌గా విశాఖపట్నానికి చెందిన ఐ.కృష్ణశృతి రన్నర్‌గా గుంటూరుకు చెందిన కృపాజ్యోతి నిలిచారు. క్లాసికల్స్ టీమ్‌లో వైజాగ్‌కు చెందిన ఐ.కృష్ణశృతి విన్నర్‌గాను కడపకు చెందిన రిషిత రన్నర్‌గాను నిలిచారు. ఫోక్ సింగింగ్‌లో వైజాగ్‌కు చెందిన తేజస్విని గ్రూపు విన్నర్‌గాను, గుంటూరుకు చెందిన కృపాజ్యోతి గ్రూపు రన్నర్‌గానూ నిలిచారు. లైట్ మ్యూజిక్ సోలోలో విన్నర్‌గా విజయవాడకు చెందిన పద్మశ్రీ, రన్నర్‌గా వైజాగ్‌కు చెందిన శ్రీకీర్తన నిలిచారు. క్లాసికల్ డ్యాన్స్‌లో వైజాగ్‌కు చెందిన ఎఎస్.రాజా జూనియర్ కళాశాలకు చెందిన ఎల్.హారిక విన్నర్‌గా, నెల్లూరు డికె.జూనియర్ కాలేజీకి చెందిన పి.తనుష్క రన్నర్‌గా, క్లాసికల్ డ్యాన్స్‌లో బాపట్ల సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల బృందం విన్నర్‌గానూ, విజయవాడ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ జూనియర్ కళాశాల బృందం రన్నర్స్‌గా నిలిచారు. ఫోక్ డ్యాన్స్ సోలోలో కైకలూరు జిజెసికి చెందిన ఎం.కొండలమ్మ విన్నర్‌గా నిలిచారు. ఫోక్ డ్యాన్స్ గ్రూపు విభాగంలో గుంటూరు బిహెచ్‌హెచ్.జూనియర్ కళాశాల రన్నర్‌గాను, చిత్తూరు జిల్లా తిరుపతి పద్మావతి మహిళ జూనియర్ కళాశాల బృందం రన్నర్స్‌గానూ నిలిచారు.

గిరిజనులను మోసగించిన టిడిపి

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

గత ఎన్నికల్లో గిరిజనుల అభివృద్ధి కోసం అనేక హామీలు ఇచ్చి ఒక్కటి కూడా అమలు చేయని తెలుగుదేశం ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడించాలని గిరిజన సంఘాల జెఎసి ఛైర్మన్ పాలకీర్తి రవి పిలుపునిచ్చారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం గిరిజన సంఘాల జెఎసి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించేందుకు రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రవి మాట్లాడుతూ.. సుండిపెంట ఐటిడిఎలో పీఓ మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1.60 కోట్లు కేటాయింపుల్లో చూపించి ఎక్కడా వాటిని నిర్మించలేదని తెలిపారు. ఐటిడిఎ పీఓఈ రామశేషు స్వాహా చేసిన అంశంపై ప్రభుత్వం విచారణ కమిటీ వేసి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీసీ కూలాలను గిరిజన జాబితాలో చేర్చాలనే నిర్ణయాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని కోరారు. గిరిజనులకు ఇచ్చే రుణాలను కేవలం తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు మాత్రమే ఇస్తున్నారని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఉయ్యాల శ్యామల, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, నాయకులు అనిగాని సుధాకర్, మేడా కృష్ణ, బందెల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడి కేసులో

ఎఆర్ హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

ప్రజాశక్తి-నెల్లూరు క్రైం

ఆంధ్రభూమి రిపోర్టర్ మల్లికార్జునపై దాడి చేసిన కేసులో ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎన్.వరప్రసాద్‌ను గురువారం సస్పెండ్ చేశారు. ఈ మేరకు శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఎస్‌పి ఐశ్వర్య రస్తోగి ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల మేరకు.. ఓ పత్రికలో విలేకరిగా పనిచేస్తున్న మల్లికార్జున బుధవారం రాత్రి నెల్లూరులోని అలంకార్ సెంటర్‌లో తన స్నేహితుని హోటల్ వద్ద ఉన్నాడు. ఆ సమయంలో హెడ్ కానిస్టేబుల్ కుమారుడు వచ్చి హోటల్ తాలూక వంట గ్యాస్‌కు సంబంధించి డబ్బులు ఇవ్వాలని అడిగాడు. యజమాని లేకపోవడంతో మళ్లీ రావాలని మల్లికార్జున సూచించాడు.దీంతో మాటామాట పెరిగి వారి మధ్య గొడవ జరిగింది. విషయం తెలిసిన హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ వచ్చి మల్లికార్జునపై దాడి చేశాడు. దీంతో మల్లికార్జున గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జర్నలిస్టు సంఘాల నాయకులు మల్లికార్జునను పరామర్శించి,సిఐ అన్వర్‌బాషాకు పరిస్థితి వివరించారు. ఎస్‌పి ఐశ్వర్య రస్తోగి ఘటనపై ఆరా తీశారు. వెంటనే హెడ్‌కానిస్టేబుల్ వర ప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు విధించారు.

నాణ్యత లేని 'ఏక్తా' భోజనం

- కంపు కొడుతున్న పప్పు, చెడిపోయిన కోడిగుడ్లు సరఫరా
- విద్యార్థుల ఆరోగ్యంపై ఆలోచన శూన్యం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మధ్యాహ్న భోజనం సరఫరాలో ఏక్తాశక్తి ఫౌండేషన్ నాణ్యతకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చేస్తుందని, ముద్ద నోట్లో పెట్టలేక పోతున్నామని పశ్చిమగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా జిల్లా విద్యాశాఖాధికారులు ఆ సంస్థను వెనకేసుకొస్తున్న పరిస్థితి నెలకొంది. ఈనెల 2 నుంచి ఏక్తా సంస్థ ఏలూరు, ఉండి, యర్నగూడెం క్లస్టర్లకు సంబంధించిన పాఠశాలలకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తోంది. వంటమ్మలను కాదని ప్రభుత్వం ఈ సంస్థకు మధ్యాహ్న భోజనాన్ని అప్పగించింది. తొలి మూడురోజులు భోజనం సరిగా సరఫరా కాకపోవడంతో విద్యార్థులు ఆకలితో అలమటించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బిస్కెట్లు, అరటిపళ్లు, ఉప్మా వంటివి పెట్టి ఆకలి తీర్చారు. ఏక్తాసంస్థను రద్దుచేసి వంటమ్మలతో పాతపద్ధతిలో భోజనం తయారు చేయించాలంటూ సిఐటియు, పలు ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి.



ఏలూరులోని ఒక స్కూల్‌లో భోజనం తినలేక పారేస్తున్న విద్యార్థిని

దీంతో ఒక్కో క్లస్టర్‌కు నాలుగు మండలాలు ఉండగా రెండు మండలాలు తగ్గించి ఏక్తా సంస్థకు భోజన సరఫరా అప్పగించారు. ఇప్పుడు భోజనం సమయానికి పంపిస్తున్నా నాణ్యతను పూర్తిగా గాలికొదిలేసింది. చిమిడిన అన్నం, చలి కంపు వస్తున్న పప్పు, దెబ్బతిన్న గుడ్లు, నీళ్లను తలపిస్తున్న సాంబారుతో భోజనం సరఫరా చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీనిపై ఆధారాలతోసహా పత్రికలు వార్తలను ప్రచురిస్తూనే ఉన్నాయి. ఉపాధ్యాయులు సైతం భోజనంలోని లోపాలను అధికారులకు వివరిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తాము పరిశీలన చేసిన దగ్గర బాగానే ఉందంటూ ఆ సంస్థను సమర్థిస్తున్నారు. గురువారం సైతం పాలకోడేరు మండలం మోగల్లు హైస్కూల్‌లో పప్పు చలి కంపు రావడంతో ఎంఇఒ సత్యానందం వచ్చి పరిశీలించారు. మిగిలిన చోట్లా ఇదే పరిస్థితి కొనసాగింది. చాలామంది విద్యార్థులు ఇంటినుంచే భోజనం తెచ్చుకుని తింటున్న పరిస్థితి కొనసాగుతోంది. తెల్లవారు జామున మూడు గంటలకు భోజనం వండి సరఫరా చేస్తుండటం, నాణ్యత లేకపోవడంతో విద్యార్థులు తినలేని దుస్థితి నెలకొంది. భోజనం నాణ్యతపై విద్యార్థులంతా జన్మభూమి సభలో ఉండి ఎంఎల్‌ఎ వేటుకూరి శివరామరాజు దృష్టికి సైతం తీసుకువెళ్లారు. కిందిస్థాయి అధికారులు, ఉపాధ్యాయులు వాస్తవ పరిస్థితులను వెల్లడిస్తుండగా జిల్లాస్థాయి అధికారులు కొందరు ప్రయివేటు ఏజెన్సీకి అనుకూలంగా వ్యవహరిస్తుండటం గమనార్హం.

నాణ్యత బాగానే ఉంది.. పరిశీలించా
సివి రేణుక, జిల్లా విద్యాశాఖ అధికారి

కొన్ని పాఠశాలలకు వెళ్లి పరిశీలించి స్వయంగా భోజనం చేశాను. నాణ్యత బాగానే ఉంది. ఇబ్బంది లేదు. కావాలనే దుష్ప్రచారం జరుగుతోంది. ఉదయం తొమ్మిది గంటలకు సరఫరా చేస్తున్నారు. 11 గంటలకు పంపించాలని చెప్పాం. కొత్తగా ప్రారంభించారు కాబట్టి సర్దుకోవడానికి కొంత సమయం పడుతుంది.

రుచిలేక పిల్లలు తినలేకపోతున్నారు
సత్యానంద్, ఎంఇఒ, పాలకోడేరు

యుపికి చెందిన వారితో వంట చేయిస్తున్నారు. కూరల్లో ఉప్పు ఉండదు. పసుపు ఎక్కువగా వేస్తున్నారు. సాంబారులో పులుపు వేయరు. దీంతో రుచిలేక పిల్లలు తినలేకపోతున్నారు. స్థానిక వంటమనిషిని పెట్టాలని సూచించాం. ఆ ప్రయత్నాలు జరుగుతున్నాయి.



ఎన్టీఆర్ బయోపిక్ స్ఫూర్తిని నింపే చిత్రం

సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎన్టీఆర్ బయోపిక్ చిత్రం కథానాయకుడు స్ఫూర్తిని నింపేవిధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ చిత్రాన్ని తెలుగు జాతి ప్రజలందరూ వీక్షించాలని కోరారు. హిందూపురం శాసనసభ్యులు, నటుడు నందమూరి బాలకృష్ణ నటించిన ఎన్టీఆర్ జీవితచరిత్ర (బయోపిక్) చిత్రాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బాలకృష్ణ, చిత్ర దర్శకుడు క్రిష్‌తో కలిసి వీక్షించారు. విజయవాడ ట్రెండ్‌సెట్ మాల్‌లో గురువారం సిఎం ఈ చిత్రాన్ని వీక్షించారు. ముఖ్యమంత్రితో రాష్ట్ర మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీలు బచ్చుల అర్జునుడు, బుద్ధా వెంకన్న, ఎపిఎఫ్‌డిసి ఛైర్మన్ అంబికాకృష్ణ, ఆర్టీసి ఛైర్మన్ వర్ల రామయ్య తదితరులు కలిసి ఈ చిత్రాన్ని వీక్షించారు. సినిమా వీక్షించిన అనంతరం సిఎం విలేకరులతో మాట్లాడుతూ యుగ పురుషుని జీవితం తీయడం సాహసమేనన్నారు. తెలుగు జాతి గర్వించదగిన నాయకుడి పాత్రకు దర్శకుడు క్రిష్ ప్రాణం పోశారన్నారు. క్రిష్‌ను సిఎం ప్రత్యేకంగా అభినందించారు.

రోడ్డు పనులకు మంత్రి కిడారి శంకుస్థాపన

ప్రజాశక్తి- డుంబ్రిగుడ (విశాఖపట్నం)

విశాఖ జిల్లా డుంబ్రిగుడ మండలంలో రూ.6.71కోట్లతో పలు రోడ్డు పనులకు రాష్ట్ర గిరిజన సంక్షేమం, ప్రాథమిక వైద్యశాఖ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. పాడేరు రోడ్డు ఒంటిపాక జంక్షన్ నుంచి జి.బొడ్డుపుట్టు వరకు రూ.1.98 కోట్లతో బిల్లాపుట్టు జంక్షన్ నుంచి గౌళి మీదుగా వసబంద వరకు రూ.80 లక్షలు, పెదపాడు జంక్షన్ నుంచి రంగినివలస వరకు రూ.1.19 కోట్లు, చెలిమరవలస నుంచి రంగినివలస వరకు రూ.1.99 కోట్లతో మంజూరైన రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి కిడారి శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో రూ.10 లక్షలతో నిర్మించిన కిడారి సామాజిక భవనాన్ని, జిసిసి ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభించారు.

సంపాదకీయం

శ్రమజీవులకు జేజేలు!

జనవరి 8,9 రెండు రోజుల సార్వత్రిక సమ్మె, 9న గ్రామీణ భారత్ బంద్ విజయవంతం చేసిన భారత శ్రామిక జనావళికి జేజేలు పలుకుతున్నాం. సార్వత్రిక సమ్మెలో సంఘటిత, అసంఘటిత కార్మికులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భవన నిర్మాణం, ప్రైవేట్ రవాణా, పర్వత సానువుల మొదలు శిఖరాల వరకూ పని చేసే ప్లాంటేషన్ వర్కర్లు... ఇలా అన్ని విభాగాలు, తరగతుల కార్మికులు పెద్దఎత్తున పాల్గొనడం హర్షణీయం. బ్యాంకింగ్, ఇన్సూరెన్సు, టెలికమ్యూనికేషన్లు, పోర్టులు, షిప్‌యార్డులతోసహా అనేక భారీ పరిశ్రమల్లో పని స్తంభించిపోయింది. భారత కార్మికోద్యమ చరిత్రలో ఇది ఓ ముఖ్య ఘట్టంగా నిలిచిపోవడం ఖాయం. కేంద్ర ట్రేడ్ యూనియన్లు రెండు రోజుల సమ్మెకు పిలుపివ్వగా అఖిలభారత కిసాన్‌సభ, వివిధ రైతు, వ్యవసాయ కార్మిక, సామాజిక సంఘాలతో కూడిన భూమి అధికార్ ఆందోళన్ జనవరి 9న గ్రామీణ భారత్ బంద్ నిర్వహించాలని నిర్ణయించడం కార్మిక కర్షక మైత్రీ బంధాన్ని బలోపేతం చేసింది. బిజెపి సర్కారుపై యావద్భారత శ్రామిక లోకం ఎత్తిన తిరుగుబాటు బావుటా ఉవ్వెత్తున ఎగసింది. సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్ విజయం కష్ట జీవుల్లో మరింత ఆత్మ విశ్వాసాన్ని నింపి, భవిష్యత్ పోరాటాలకు గొప్ప బలాన్ని చేకూర్చుతుంది.

సార్వత్రిక సమ్మెతో కేరళ, అసోం, ఒడిషా, పశ్చిమ బెంగాల్, త్రిపుర తదితర రాష్ట్రాల్లో జనజీవనం స్తంభించిపోయింది. సమ్మె ఈ రాష్ట్రాల్లో గరిష్ట ప్రభావాన్ని చూపింది. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి రోజు కార్మిక సమ్మె, ప్రదర్శనలు జరగ్గా రెండో రోజున వివిధ పట్టణాల్లో, నగరాల్లో మానవ హారాలుగా ఏర్పడి కష్టజీవుల ఐక్యతను చాటి చెప్పారు. గ్రామీణ ప్రజలు జాతీయ రహదారితోసహా అనేక రోడ్లపై ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు నిలిపివేసి రవాణాను స్తంభింపజేశారు. బెంగాల్‌లో తృణమూల్ గూండాలు, పోలీసులు దాడులు, తీవ్ర నిర్బంధం విధించినా అనేక రంగాలకు చెందిన శ్రమజీవులు వాటిని అధిగమించి సమ్మెను విజయవంతం చేయడం శ్లాఘనీయం. అలాగే త్రిపురలో కాషాయ మూకలు, రక్షక భటుల నిర్బంధాన్ని తిప్పిగొట్టి శ్రామికులు బంద్ నిర్వహించడం అభినందనీయం. మహారాష్ట్ర, కర్ణాటకల్లో అనేక బహుళజాతి సంస్థలు సైతం మూత పడ్డాయి. ప్రధాని మోడీ స్వరాష్ట్రం గుజరాత్‌లో ఇంత విస్తృతంగా కార్మిక సమ్మె జరగడం చాలా దశాబ్దాల తరువాత ఇదే మొదటిసారి అని మీడియా పేర్కొనడం గమనార్హం.

వినాశకర నయా ఉదారవాద విధానాలను అనసరిస్తున్న మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను అడ్డగోలుగా సవరిస్తోంది. కార్మిక సంఘాలతో కనీసం చర్చించకుండానే చట్టాల్లో పెను మార్పులు చేసేస్తోంది. దేశానికి కీలకమైన రక్షణ రంగ ఉత్పత్తులతోసహా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు పూనుకుంది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 2016 సెప్టెంబర్ 2న జరిగిన సమ్మె తరువాత సాగిన ఈ విస్తృత కార్యాచరణ కార్మికవర్గ ఆగ్రహానికి అద్దం పట్టింది. వివిధ కార్మిక సంఘాలు, శ్రమజీవులూ సాగించిన అనేక పోరాటాలు నిరసనలకు కొనసాగింపుగానే ఈ సమ్మె జరిగింది. గత ఆగస్టు తొమ్మిదిన జరిగిన జైల్‌భరో, సెప్టెంబర్ 5న ఢిల్లీలో జరిగిన కిసాన్- మజ్దూర్ సంఘర్ష్ ర్యాలీ, ఆ తరువాత నవంబర్ 29,30 తేదీల్లో హస్తినలో కదం తొక్కిన కిసాన్ ముక్తి మార్చ్ వంటివన్నీ శ్రమ జీవుల్లో పోరాట స్ఫూర్తిని మరింతగా పెంచాయి. మహారాష్ట్ర రైతుల పోరాటం, మధ్యప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో నిలకడగానూ విస్తృతంగానూ సాగిన గ్రామీణ ప్రజల పోరాటాలు, ఉద్యమాలూ ఇందులో భాగమే!

ఆసేతు శీతాచలం శ్రామికులు కన్నెర్ర చేస్తున్నా మోడీ సర్కారు తన రూటు మార్చుకోవడంలేదు సరికదా కష్ట జీవులపై దాడిని మరింత పెంచడం గర్హనీయం. కార్పొరేట్ల సేవలో తరించిపోతున్నది. సమ్మె మొదటి రోజైన జనవరి ఎనిమిదవ తేదీనే కేంద్ర కార్మిక మంత్రి ట్రేడ్ యూనియన్ చట్ట సవరణ బిల్లును ప్రవేశ పెట్టడం ఇందుకు తార్కాణం. పైపెచ్చు ఈ సమ్మెవల్ల ఎలాంటి ప్రభావమూ వుండదని నిండు సభలో మంత్రి వ్యాఖ్యానించడం అహంకారానికి నిదర్శనం. కేంద్ర ప్రభుత్వ శ్రామిక వ్యతిరేక వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, రాదనీ స్పష్టమవుతోంది. బిజెపిని, మోడీ ప్రభుత్వాన్ని ఓడించడానికి రానున్న లోక్‌సభ ఎన్నికల రాజకీయ పోరాటంలో కార్మికవర్గం భాగస్వామి అవుతుందని ఈ రెండు రోజుల సమ్మె సంకేతాలిచ్చింది. కార్మికులు, రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు నయా ఉదారవాద విధానాలనే మొత్తంగా విడనాడాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. ప్రపంచంలో ఈ విధానాలెక్కడా ప్రజలకు ప్రయోజనాలు చేకూర్చలేదు సరికదా కడగండ్లనే మిగిల్చాయి. అయినప్పటికీ మొండిగా ఆ విధానాలనే అమలు చేయబూనుకుంటే పాలకవర్గాలకు శృంగభంగం తప్పదు. శ్రమ జీవులకు విజయోస్తు!

ఇది విషయం




మాకు రోజు గడవడం కష్టం,
కాని వారాలు వాటికవే గడచిపోతాయి
సమాజం నుండి వేరు చేయబడినా
వేరుగా చూసినా, మేమెప్పుడూ
సమాజంలోనే బ్రతుకుతుంటాము

- మంజీర

విశ్లేషణ

మహనీయులు తిరిగిన చోట మరుగుజ్జుల తచ్చాట

సైన్సు మనల్ని అహేతుక భావజాలం నుండీ, పాక్షిక దృక్పథాల నుండీ కాపాడుతుంది...జోతిష్యం, రసవాదం రెండూ మిథ్యాశాస్త్రాలు. పాజిటివ్, నెగెటివ్ ఎనర్జీ అని దొంగ వైద్యులు, దొంగ బాబాలు చెప్పేవన్నీ పనికిమాలిన మాటలు...దేశంలో ఎవరు ఏ మాంసం తినాలి అన్న చెత్త వాదనలు, మతం పేరుతో గుంజాటనలు దేశానికి నష్ట దాయకం. ఈ వాదనలు చేస్తున్నవారు తమను తాము దేశభక్తులమని మురిసిపోవచ్చు గాక కానీ వాస్తవానికి వారు దేశాన్ని నష్టపరుస్తున్నారు...



ఎస్ వెంకట్రావు



ఎ.యు విసి
జి నాగేశ్వరరావు

హతవిధీ మన భారతీయ సైన్సు కాంగ్రెస్ ఎంత అథమ స్థాయికి దిగజారిపోయింది! జగదీష్ చంద్ర బోస్, సివి రామన్, శాంతి స్వరూప్ భట్నాగర్, హోమీ బాబా వంటి మహా శాస్త్రవేత్తలు నడయాడిన సైన్సు కాంగ్రెస్ మహాసభలో సైన్సును భ్రష్టు పట్టించే బఫూన్లు, సైన్సుకూ, మిథ్యా సైన్సుకూ మధ్య తేడా తెలియని మరుగుజ్జులూ మహోపన్యాసాలు చేస్తుంటే సైంటిస్టులమనుకునే వారు చెవులు రిక్కించి, నోరు వెళ్లబెట్టి వినాల్సిన దుస్థితి దాపురించిందే!

ఈ నెల 3వ తేదీ నుండి 7వ తేదీ వరకు పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగిన 106వ ఇండియన్ సైన్సు కాంగ్రెస్‌లో మన ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ జి నాగేశ్వరరావు చేసిన ఉపన్యాసం వింటే భారతీయ సైన్సు భవిష్యత్తును తలచుకుని ప్రతి ఒక్కరూ భయపడాల్సి వస్తుంది. ఈ సైన్సు కాంగ్రెస్‌ను 'భవిష్యత్ భారత్-సైన్సు టెక్నాలజీ' అనే పేరుతో నిర్వహించడం విశేషం. సైన్సు కాంగ్రెస్‌లో విసి గారి 'ప్రవచనాలు' వినండి : మొదటిది, కౌరవులు టెస్ట్ ట్యూబ్ టెక్నాలజీ వల్ల జన్మించారు. అంటే వాళ్లంతా టెస్ట్‌ట్యూబ్ బేబీలన్న మాట. ప్రపంచంలో మొట్టమొదటి టెస్ట్‌ట్యూబ్ బేబీ 1978లో ఇంగ్లండ్‌లో ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ వల్ల పుట్టిన లూయిస్ జోయ్ బ్రౌన్ అని ఎవరైనా చెబితే ఆంధ్రా యూనివర్శిటీ విసి గారు ఊరుకోరు. రెండవది, మన దేశంలో వేల సంవత్సరాలకు పూర్వమే గైడెడ్ క్షిపణులున్నాయట. పురాణాల్లో చెప్పే విష్ణుమూర్తి విసిరే విష్ణుచక్రం గైడెడ్ క్షిపణి తప్ప మరోటి కాదని నాగేశ్వరరావుగారి ఉవాచ. ఆయన అక్కడితో ఆగలేదు. శ్రీలంకలో రావణాసురుడి దగ్గర 24 రకాల విమానాలుండేవట. అవి దిగడానికీ, ఎగరడానికీ ఆ కాలంలోనే విమానాశ్రయాలుండేవట.

ప్రముఖ భారతీయ అమెరికన్ శాస్త్రవేత్త, నోబుల్ బహుమతి గ్రహీత ప్రొఫెసర్ వెంకట్రామన్ రామకృష్ణన్ భారతీయ సైన్సు కాంగ్రెస్‌లో ఇటువంటి వారి ఉపన్యాసాలను గమనించే, దాన్ని ఒక 'సర్కస్' అన్నారు. అక్కడ సైన్సును శాస్త్రీయంగా ఆలోచించే వారు తగ్గిపోయి పుక్కిటి పురాణాలనూ, ఆధారాలకు నిలవని మిథ్యా సైన్సునూ సైన్సుగా ప్రబోధించే వారు ఎక్కువైపోయారు. ఒక నాడు సివి రామన్ వంటి నోబుల్ బహుమతి గ్రహీతలకు నిలయమైన భారతీయ సైన్సు రంగాన్ని నేడు బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ పరివారం పురాణాలను సమర్థించే వేదికగా మార్చేయడం దారుణం. అందుకే స్వాతంత్ర్యం నాటికి మనకన్నా వెనుకబడిన చైనా శాస్త్రీయ వైఖరితో శాస్త్ర-సాంకేతిక రంగాల్లో ముందుకు పురోగమిస్తుంటే మన దేశం వెనక చూపులు చూస్తోంది.

ఆంధ్రా యూనివర్శిటీ విసి గారిని అనుకోవడానికి లేదు. ఎందుకంటే ఆయన తన స్వంత తెలివితో ఈ మాటలు చెప్పలేదు. లేక అవి తను పరిశోధన చేసి కనుగొన్న విషయాలూ కావు. ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వంలోని మన నేతలు చిన్నా పెద్ద అందరూ ఇవే చెబుతున్నారు. ఆయన వాటిని ఫాలో అయిపోయారు అంతే. మన పురాణాల్లో ఉన్న వినాయకుడు ప్లాస్టిక్ సర్జరీ చేయడం వల్ల అలా ఏర్పడ్డాడని ప్రధాని నరేంద్ర మోడీ 2015లో ముంబయిలో జరిగిన వైద్య నిపుణుల సదస్సులో చెప్పారు. ఆయన ఇంకో విషయాన్ని కూడా కనిపెట్టారు. మహాభారతంలో కర్ణుడు జెనిటిక్ ఇంజినీరింగ్ వల్ల పుట్టాడని చెప్పారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి సత్యపాల్ సింగ్ మూఢత్వంలో ప్రధానిని మించిపోయారు. 'చార్లెస్ డార్విన్ పరిణామ వాదం తప్పు. ఎందుకంటే నరవానరం మనిషిగా మారడాన్ని ఎవరూ చూడలేదు' అని సెలవిచ్చారు. 2017 సెప్టెంబర్‌లో ఈయనగారే బెంగళూరు ఐఐటిలో మాట్లాడుతూ... రామాయణంలో పేర్కొన్న 'పుష్పక విమానం' లాంటి 'ఆవిష్కరణల' గురించి ఐఐటి విద్యార్థులకు బోధించాలని సలహా ఇచ్చారు.

బెంగుళూరులోని 'స్వామి వివేకానంద యోగా అనుసంధాన సంస్థాన్‌లో' ఒక రకమైన యోగా చేస్తే క్యాన్సర్ వ్యాధి తగ్గిపోతుందని కేంద్ర మంత్రి ('ఆయుష్' శాఖ) శ్రీపాద్ నాయక్ 2016లో చెప్పారు. దాన్ని తను నిరూపిస్తానని కూడా చెప్పారు. కానీ రెండేళ్లు గడుస్తోంది ఆయన ఇంకా నిరూపించలేదు. హరిద్వార్‌కు చెందిన బిజెపి ఎంపీ ఇటీవల లోక్‌సభలో మాట్లాడుతూ 'లక్షల సంవత్సరాల క్రితమే రుషి కణాదుడు అణు పరీక్ష జరిపాడని' పేర్కొని అందర్నీ ఆశ్చర్యపరిచాడు. ప్రతి జంతువూ ఆక్సిజన్ పీల్చుకుని కార్బన్ డై ఆక్సైడ్ విడుదల చేస్తుందని మనకు తెలుసు. కానీ రాజస్థాన్ బిజెపి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి వాసుదేవ్ దేవ్నాని 'ఆవు మాత్రమే ఆక్సిజన్ పీల్చుకుని మళ్లీ ఆక్సిజన్ విడుదల చేస్తుందని' చెప్పాడు. కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి రాధా మోహన్ సింగ్ 'యోగా వ్యవసాయం' గురించి కనిపెడితే, మరో కాషాయ 'వ్యవసాయ శాస్త్రవేత్త' సుభాష్ పాలేకర్ ఆవు మూత్రంతో వ్యవసాయం కనిపెట్టారు.

కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్ గారు ఢిల్లీలో ఇటీవల జరిగిన హిందీ దివస్ సభలో మాట్లాడుతూ క్వాంటమ్ ఫిజిక్స్‌లో వార్నర్ హీసెన్‌బర్గ్ రూపొందించిన అస్థిరతా సిద్ధాంతం (థియరీ ఆఫ్ అన్‌సెర్టెనిటీ) వేదాల నుండి తస్కరించిందేనన్నారు. రవీంద్రనాథ్ టాగూర్‌తో హీసెన్‌బర్గ్ వేదాల గురించి జరిపిన చర్చల సందర్భంగా ఆయన ఈ సూత్రం పసిగట్టేశాడని మంత్రిగారు వెల్లడించారు.

ఆర్‌ఎస్‌ఎస్ తిక్క ఏనాడో తలకెక్కిన గుజరాత్‌లో ఏకంగా పురాణాలనే సైన్సుగా మార్చేసి బోధిస్తున్నారు. భారతీయ సంస్కృతిలోని 'వాస్తవాలు' అనే పేరుతో ప్రతి విద్యార్థి చదవాల్సిన పుస్తకాలను అక్కడి ప్రభుత్వం అచ్చొత్తించింది. అందులో చెప్పిన ఒక సైన్సు సంగతి చూడండి! 'స్టెమ్ సెల్ పరిశోధన తామే చేశామని అమెరికా చెప్పుకుంటోంది. కానీ శరీర భాగాలు పునః సృష్టి చేసే పేటెంట్‌ను డాక్టర్ బాలకృష్ణ గంపత్ మతపుర్కార్ ఇప్పటికే పొంది వున్నారు... నిజానికి ఈ పరిశోధన ఇప్పటిది కాదనీ, దీన్ని మహాభారతం నుండి డాక్టర్ మతపుర్కార్ గ్రహించారనీ వింటే మీరు ఆశ్చర్యపోతారు. కుంతికి సూర్యునిలాంటి వెలుగునిచ్చే కొడుకుండేవాడు. రెండేళ్ల నుండి గర్భం దాల్చని గాంధారికి ఈ విషయం తెలిసింది. ఆమె గర్భవతి అయింది కానీ అబార్షన్ అయింది. ఆమె కడుపు నుండి పెద్ద మాంసపు ముద్ద బయటకొచ్చింది. ఇది తెలిసి మహర్షి ద్వైపాయన సహాయం కోరారు. ఆయన ఈ మాంసానికి కొన్ని ఔషధాలు కలిపి చల్లని కుండలో పెట్టాడు. తరువాత ఆ మాంసం ముద్దను తీసి నూరు భాగాలు చేసి, ఒక్కో భాగాన్ని నేతితో నిండిన ఒక్కో కుండలో పెట్టాడు. రెండేళ్ల తరువాత అందులో నూరుగురు కౌరవులు తయారయ్యారు. ఇది చదివిన తరువాత స్టెమ్‌సెల్స్ తన పరిశోధన కాదనీ మహాభారత సమయంలోనే వున్నదనీ మతపుర్కార్ తెలుసుకున్నాడు'... గుజరాత్ లోని బడి పిల్లలతో బలవంతంగా చదివిస్తున్న తేజోమయ భారత్ పుస్తకం 92-93 పేజీల్లో ఈ విషయం రాశారు.

ఆంధ్రా విశ్వవిద్యాలయ విసి 'టెస్ట్‌ట్యూబ్ బేబీల కథ' ఎక్కడి నుండి వచ్చిందో ఇప్పుడు అర్థమయింది కదూ..! ఆర్‌ఎస్‌ఎస్ వారు ప్రచారంలో పెట్టిన ఇటువంటి అశాస్త్రీయ విషయాలనే కాపీ కొట్టి నాగేశ్వరరావు లాంటి వాళ్లంతా చెబుతున్నారు. అసలు ఐన్‌స్టీన్ సిద్ధాంతం తప్పు అని నాగేశ్వరరావు గారి ఉవాచ. న్యూటన్ పరిశోధనలు పనికిమాలిన వని ఆయన భావన. విశేషమేమంటే 90 ఏళ్ల చరిత్ర గలిగిన ఒక విశ్వవిద్యాలయానికి విసిగా ఉన్న వ్యక్తి ఇటువంటి పనికిమాలిన విషయాలను నిస్సంకోచంగా, నిస్సిగ్గుగా చెప్పడం.

అశాస్త్రీయ భావాలు వెదజల్లడంలో మూఢ శక్తులకు జంకూ గొంకూ ఉండదు. ఎందుకంటే అసత్యాల మీద మాత్రమే వారు చీకటి సామ్రాజ్యాన్ని నిర్మిస్తారు. ఇదంతా ఆర్‌ఎస్‌ఎస్ గ్రాండ్ ప్రాజెక్టులో ఒక భాగం. అందుకే వారు ఆధునిక సైన్సుపై దాడి చేస్తూ ప్రాచీన భారత సమాజంలో ఘనీభవించిన మూఢ నమ్మకాలను సైన్సుగా ప్రచారం చేస్తున్నారు. నిజానికి తద్వారా వారు ప్రాచీన భారత సమాజంలో అభివృద్ధి చెందిన సైన్సుకు కూడా ద్రోహం చేస్తున్నారు. మన దేశ చరిత్రలో సైన్సు ఒక దశ వరకు అభివృద్ధి చెంది ప్రపంచానికే ఆదర్శంగా నిలిచింది. కానీ తరువాత ఫ్యూడల్ యుగంలో ఇటువంటి ఛాందస భావాలు పెరగడం వల్ల దాని అభివృద్ధి ఆగిపోయింది. సాంస్కృతిక పునరుజ్జీవనం, ప్రజాస్వామ్య భావాలు పరిఢవిల్లిన పారిశ్రామిక యూరప్‌లో అది అభివృద్ధి చెందింది.

మన దేశంలో కూడా సైన్సు మళ్లీ ఉరకలెత్తాలంటే ప్రజల్లో శాస్త్రీయ భావాలు పెరగాలి. బిజెపి-ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేస్తున్న ఛాందస భావాలకు అడ్డుకట్ట వేయాలి. ఈ సందర్భంగా మనం ప్రొఫెసర్ రామకృష్ణన్ చెప్పిన ఈ వాక్యాలు మననం చేసుకోవాలి. 'సైన్సు మనల్ని అహేతుక భావజాలం నుండీ, పాక్షిక దృక్పథాల నుండీ కాపాడుతుంది...జోతిష్యం, రసవాదం రెండూ మిథ్యాశాస్త్రాలు. పాజిటివ్, నెగెటివ్ ఎనర్జీ అని దొంగ వైద్యులు, దొంగ బాబాలు చెప్పేవన్నీ పనికిమాలిన మాటలు...దేశంలో ఎవరు ఏ మాంసం తినాలి అన్న చెత్త వాదనలు, మతం పేరుతో గుంజాటనలు దేశానికి నష్ట దాయకం. ఈ వాదనలు చేస్తున్నవారు తమను తాము దేశభక్తుల మని మురిసిపోవచ్చు గాక కానీ వాస్తవానికి వారు దేశాన్ని నష్టపరుస్తున్నారు... ఆధునీకరణ, పారిశ్రామీ కరణ విషయంలో ఇప్పటికే మనం చైనా కన్నా బాగా వెనుకబడిపోయాం. వాళ్లు కృత్రిమ మేధస్సును పెద్ద ప్రాధాన్యతగా తీసుకుని పురోగమిస్తున్నారు. రోబోటిక్స్ మీద, పునరుత్పత్తి ఇంధనాల మీద పెట్టుబడి పెడుతున్నారు. రానున్న కాలంలో ఇది పెద్ద మార్పును తీసుకొస్తుంది. భారత దేశం ఇప్పటికైనా జాగ్రత్త పడకపోతే బాగా వెనుకబడిపోతుంది.'

సెటైర్

ఓం శూన్యం భూయాత్



సుబ్రమణ్యం

స్వాముల వారు కళ్లు మూసుకుని ధ్యానంలో ఉన్నారు. చుట్టూ ఉన్న భక్తులు, శిష్యుల సందోహం వారినేరకంగానూ చీకాకు పరచలేక పోతోంది. ఒక అనిర్వచనీయమైన ఆనందం వారి ముఖంలో తాండవిస్తోంది.

చుట్టూ చేరిన శిష్యులకి, భక్తులకి స్వామివారి ఆనందానికి హేతువేమిటో తెలియడంలేదు కాని ఏదో గొప్ప విషయం స్వామి వారికి గోచరించిందని మాత్రం వాళ్లంతా గ్రహిస్తున్నారు. అదేమిటో తెలుసుకోవాలన్న కుతూహలం, ఉత్కంఠ వారిలో క్షణక్షణానికీ పెరిగిపోతోంది.

స్వామి శూన్యానంద బలహీనత ఏమిటో తెలిసిన ప్రథమ శిష్యుడు, మంచి వంటవాడు అయిన సుబ్బన్న దీక్షితులు స్వామి వారి ఆంతరంగిక మందిరంలోకి వెళ్లి వేడిగా ఘుమఘుమలాడే కాఫీ కప్పు తెచ్చి స్వామి వారి ముందుంచేడు. ఇక అనివార్యమై శూన్యానంద స్వామి కళ్లు తెరిచి, ఒక గుక్క కాఫీ సేవించి చుట్టూ చేరిన శిష్యులని చూసి మందహాసం చేసేరు. శిష్యులంతా వినయంగా చేతులు కట్టుకుని 'శెలవియ్యండి స్వామీ!' అని అనిపించేలా మౌనంగానే చూపులతో వేడుకున్నారు. స్వామివారి గాత్రం నుండి మంద్రంగా భాషణ ప్రారంభమైంది.

'అంతయు శూన్యమే. శూన్యము నుండే విశ్వం ఆవిర్భవించింది. శూన్యంలోకే తిరిగిపోతున్నది.'

'శూన్యమును ఎన్ని రెట్లు హెచ్చవేసినా ఫలితము శూన్యమే.'

'శూన్యము నుండి శూన్యమును తీసివేసిన ఏమి మిగులును? శూన్యమే కదా!'

'శూన్యమునకు శూన్యమును కలిపిననూ ఏమి వచ్చును? శూన్యమే కదా!'

'ఓం శూన్యం భూయాత్'

స్వామి ప్రవచనం అయిపోయింది. తిరిగి ధ్యానముద్ర పట్టారు. ఇక ఆ రోజుకు ఎవరితోనూ మాట్లాడరన్నమాట.

ఇంతకీ ఆయన ప్రవచనం తాలూకు సారాంశం ఏమిటో భక్తులకు అర్థం కాలేదు. సుబ్బన్న దీక్షితులు వారికి సైగ చేసి అందరినీ సమావేశ మందిరంలోకి చేర్చేడు. శూన్యానందుల ప్రవచనానికి దీక్షితులు భాష్యం చెప్పేడు.

'స్వామిజీ ఈ రోజు బోధించినది చాలా గూడార్థం కలిగివుంది. మామూలుగా స్వాములు రాజకీయాల గురించి మాట్లాడకూడదు. కాని ఏం చేస్తాం? యోగులు, స్వాములు కొందరు ఏకంగా మంత్రులూ, ముఖ్యమంత్రులూ అయిపోయారు ఈరోజు! సర్వసంగ పరిత్యాగులకు రాజకీయాలెందుకు చెప్పండి. ఈ విషయంలో స్వామీజీకి అసంతృప్తి కలిగింది. ఆ అసంతృప్తి నుండి ప్రస్తుత దేశ రాజకీయాలని ధ్యానంలో అవలోకించారు వారు. ఆ అవలోకన సారాంశమే వారి బోధన.

నిన్న, ఈరోజు పార్లమెంటు అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించే బిల్లు గురించి చర్చించింది కదా! దాని గురించే స్వామీజీ చెప్పేరు.

'ఇబిసి బిల్లు అంతా ఒట్టిదే. ఉద్యోగాలు కల్పించలేని ప్రభుత్వ వైఫల్యం నుండి ఆ బిల్లు వచ్చింది. బిల్లు ఆమోదం పొందాక తిరిగి మరింత నిరుద్యోగం వైపే ప్రభుత్వం నడుస్తుంది.'

'ఉద్యోగాలే లేనప్పుడు ఎన్ని రిజర్వేషన్లు కల్పించినా కొత్త ఉద్యోగాలేమీ రావు.'

'ఉద్యోగాలే లేనప్పుడు రిజర్వేషన్ కల్పించినంత మాత్రాన ఆ వర్గానికి కొత్తగా ఉద్యోగాలేమీ రావు!

'ఒక సామాజిక వర్గానికి కొత్తగా రిజర్వేషన్ కల్పించినంత మాత్రాన తక్కిన సామాజిక వర్గాలు కోల్పోయే ఉద్యోగాలేమీ వుండవు.'

అని దీక్షితులు వివరించేడు. అప్పుడు వెనక నుంచి ఒక భక్తుడు లేచి


'మరి చివర్లో స్వామి వారు 'ఓం శూన్యం భూయాత్' అన్నారు గదా! దాని అర్థం ఏంటి?' అని అడిగేడు.

'ఓహో! అదా! ఈ బిల్లు తర్వాత మోడీకి వచ్చే ఓట్లు కూడా శూన్యమే అని స్వామి వారు సూక్ష్మంగా శెలవిచ్చారు' అని దీక్షితులు చర్చ ముగించేడు.

విశ్లేషణ

ఎంవిఎస్ శర్మ

పౌరసత్వ సవరణ బిల్లు-సమైక్యతకు చిచ్చు



దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతీయోద్యమ నేతలు గాని, పాల్గొన్న ప్రజలు గాని కలలు గన్న స్వతంత్ర భారతదేశం ఒక్క హిందువులదే కాదు. భారతీయులందరిదీ. మనం స్వతంత్రం సాధించుకున్నది బ్రిటిషు పెత్తనం నుంచి తప్ప వివిధ మతాల నుండి కాదు. భారతదేశం అనేక మతాల, భాషల, జాతుల ప్రజలతో కూడిన మహా దేశం. దీనిని ఒక మతానికే కుదించాలని బిజెపి చేస్తున్న ప్రయత్నం దుర్మార్గమైంది.

'భరతమాత బిడ్డలు సమస్యల్లో చిక్కుకు పోయివుంటే వారి బాధ్యతను తీసుకోవడం భారతదేశం బాధ్యత కాదా! మన ఒంట్లో ప్రవహించే రక్తం రంగు కన్నా పాస్‌పోర్టు రంగు ముఖ్యమా? దేశ విభజన కారణంగా ఇక్కడికి రాలేకపోతున్న భరతమాత బిడ్డలకు ఇక్కడి మట్టితో బంధం లేదా? ఈ బిల్లును దేశ విభజన కాలంలో జరిగిన పొరపాట్లను సరిచేయడానికే తీసుకొచ్చాము.' అస్సాంలో జరిగిన ఓ సభలో ప్రధాని మోడీ పౌరసత్వ సవరణ బిల్లు గురించి చెప్పిన మాటలు ఇవి.

పొరుగుదేశాల నుండి, ముఖ్యంగా బంగ్లాదేశ్ నుండి 1971 మార్చి తరువాత భారత దేశంలోకి వచ్చిన కాందిశీకులలో ముస్లింలు కానివారందరికీ భారతదేశ పౌరసత్వాన్ని ఇవ్వడానికి నిర్దేశించే బిల్లును మోడీ ప్రభుత్వం తెచ్చింది. అంతకు ముందే సుప్రీంకోర్టు జాతీయ పౌరసత్వ రిజిస్టరును తయారు చేయాలని ఆదేశించింది. సుమారు 40 లక్షల మందికి పౌరసత్వం ఇవ్వలేదు. వారిలో అర్హత గలవారిని మరొకమారు దరఖాస్తు చేసుకోమని సుప్రీంకోర్టు అవకాశం ఇచ్చింది. అయితే ఈ దేశంలో మార్చి 1971కి ముందు నుంచీ వారు, లేదా వారి పూర్వీకులు ఉన్నట్లు ఆధారాలు చూపగలిగితేనే వారికి పౌరసత్వం లభిస్తుంది. పౌరసత్వం నిర్ణయించడంలో మతం ప్రమేయం ఏమీ లేదు. కాని బిజెపి తెచ్చిన బిల్లు పొరుగు దేశాల నుంచి వచ్చిన వారు ముస్లిం, క్రైస్తవ మతస్థులు కానట్టయితేనే వారికి భారతదేశ పౌరసత్వం ఇవ్వడానికి వీలు కల్పిస్తుంది.

భారతదేశాన్ని బ్రిటిషు సామ్రాజ్యవాదులు ముక్కలు చేసి స్వాతంత్ర్యం ఇవ్వడం కచ్చితంగా కుట్ర పూరితమే. దీనివలన పాకిస్తాన్, ఇండియా రెండు వైపులా ఉన్న కోట్లాదిమంది ఎన్నో కడగండ్ల పాలయ్యారు. బతుకుతెరువు కోసం పాకిస్తాన్ ప్రాంతంలో స్థిరపడి, జన్మస్థలం మాత్రం భారత ప్రాంతంలో ఉన్న వారు బతుకుతెరువా? జన్మస్థలమా? ఏదో ఒక దానిని ఎంచుకోవలసిన దుస్థితి కలిగింది. అదేవిధంగా భారతదేశ ప్రాంతంలో స్థిరపడి జన్మస్థలం పాకిస్తాన్ ప్రాంతంలో ఉన్నవారూ అగచాట్లు పాలయ్యారు. వారికీ అన్యాయం జరిగింది.

దీనిని పరిష్కరించే మార్గం ఏంటి? తప్పనిసరై పాకిస్తాన్‌కు వలసపోయిన వారికి భారతదేశంలో గల తమ స్వస్థలాన్ని, బంధుమిత్రులను కలుసుకోవడానికి వీలు కల్పించడం ఒక పరిష్కారం. దానితో బాటు ఈ దేశంలోనే స్థిరపడాలనుకునే వారికి పౌరసత్వం ఇవ్వడం.

దేశ విభజన జరిగిన తొలి రోజుల్లో బంధువులను కలుసుకోవాలనుకున్న వారికి వీసాలు తేలికగానే ఇచ్చేవారు. కాని రానురాను భారత-పాక్ సంబంధాలు బలహీనపడి శతృత్వం పెరిగిన కొద్దీ వీసాలు దొరకడం దుర్లభమై పోయింది. ఈ సమస్య పాకిస్తాన్ ప్రభుత్వ వైపు నుండి మాత్రమేగాక భారత ప్రభుత్వం వైపు నుండి కూడా వుంది.

కనుక మోడీ దేశ విభజన సమయంలో జరిగిన అన్యాయాన్ని సరిచేయాలనుకుంటే పాకిస్తాన్‌తో, బంగ్లాదేశ్‌తో సుహృద్భావ సంబంధాలను పెంపొందించుకునేందుకు ప్రయత్నించాలి. ఈదేశంలో మూలాలు గల వారు పాకిస్తాన్‌లో, బంగ్లాదేశ్‌లో ఉండి వెనక్కి రావాలనుకుంటే అందుకు వీలు కల్పించాలి. భారతదేశ ప్రాంతంలో వారి మూలాలు ఉండడం అనేది ఇక్కడ ముఖ్యం. అంతే తప్ప వారిదే మతం అన్నది కాదు. బంగ్లాదేశ్ ప్రాంతంలోనే తమ పూర్వీకుల కాలం నుండీ నివసించిన వారు అక్కడే పౌరులుగా ఉండడం న్యాయం. బంగ్లాదేశ్ విముక్తి యుద్ధం సమయంలో కోటి మందికి పైగా కాందిశీకులుగా భారతదేశంలోకి వచ్చారు. యుద్ధం ముగిసి శాంతియుత పరిస్థితులు నెలకొన్నాక భారత ప్రభుత్వం కాందిశీకులను తిరిగి వెనక్కి పంపే పని చేయవలసి వుంది. కాని అలా చేయలేదు. కాందిశీకులలో అత్యధికులు ఈశాన్య రాష్ట్రాలలో, పశ్చిమ బెంగాల్‌లో స్థిరపడ్డారు. ఈశాన్య రాష్ట్రాలలో వెనకబడ్డ గిరిజనులు, స్థానిక తెగల ప్రజలు కాందిశీకుల రాకతో అభద్రతకి లోనయ్యారు. తమ స్వంత రాష్ట్రాలలోనే తాము పరాయి వారుగా మిగిలిపోతామేమోనన్న భయాందోళనలు వారిలో కలిగాయి. ఈశాన్య ప్రాంత రాష్ట్రాలలో వేర్పాటువాదం, ఉగ్రవాదం పెరగడం వెనక ఇది కూడా ఒక కారణం.

ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళిక రూపొందించి, నిధులు కేటాయించి నిర్ణీత కాలంలో అభివృద్ధి చేసి వుంటే ఇంత అభద్రతకు అవకాశం ఉండేది కాదు. కాని కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు రెండూ ఈశాన్య ప్రాంత అభివృద్ధిని నిర్లక్ష్యం చేయడమేగాక స్థానికంగా వివిధ జాతుల, తెగల మధ్య విభేదాలని తమ రాజకీయాలకు సాధనాలుగా వాడుకున్నాయి. గిరిజనులకు, గిరజనేతరులకు మధ్య ఐక్యత సాధించి అభివృద్ధి దిశగా నడిపించిన ఘనత త్రిపుర వామపక్ష ప్రభుత్వానికే దక్కుతుంది. ప్రస్తుత బిజెపి ప్రభుత్వం ఆ రాష్ట్రంలోనూ తిరిగి విద్వేష జ్వాలలను ఎగసన దోస్తోంది..

ఇప్పుడు మోడీ ప్రభుత్వం తెచ్చిన పౌరసత్వ సవరణ బిల్లు ఈశాన్య రాష్ట్రాలన్నింటిలో తీవ్ర అభద్రతా భావాన్ని కల్పిస్తోంది. ఇప్పటికే నెలకొన్న విద్వేష వాతావరణాన్ని మరింత రెచ్చగొడుతోంది. పైగా దీనికి మతచిచ్చు కూడా తోడైంది.

బిజెపి తెచ్చిన పౌరసత్వ సవరణ బిల్లు ప్రకారం కాందిశీకులు ముస్లింలు, క్రైస్తవులు కాకపోతే, వారు ఈ దేశంలో పౌరులుగా ఉండవచ్చు. హిందువులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు పౌరసత్వం పొందే వీలు కల్పించారు. ఈ దేశంలో వారి మూలాలు ఉండడమూ, ఉండకపోవడమూ అనే దానితో సంబంధం లేదు. ఈ సూత్రమే సరైనదైతే భారతదేశంలో హిందువులు మాత్రమే ఉండాలి. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో ముస్లింలు మాత్రమే ఉండాలి.

కాని దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన జాతీయోద్యమ నేతలు గాని, పాల్గొన్న ప్రజలు గాని కలలు గన్న స్వతంత్ర భారతదేశం ఒక్క హిందువులదే కాదు. భారతీయులందరిదీ. మనం స్వతంత్రం సాధించుకున్నది బ్రిటిషు పెత్తనం నుంచి తప్ప వివిధ మతాల నుండి కాదు. భారతదేశం అనేక మతాల, భాషల, జాతుల ప్రజలతో కూడిన మహా దేశం. దీనిని ఒక మతానికే కుదించాలని బిజెపి చేస్తున్న ప్రయత్నం దుర్మార్గమైంది. ఇది దేశ విభజన నాటి అన్యాయాన్ని సరిచేయదు సరిగదా కొత్తగా దేశంలో విభజన జ్వాలలను ఎగదోస్తుంది. జాతీయోద్యమానికి ఆమడ దూరంలో ఉండి బ్రిటిషు పాలకుల అడుగులకు మడుగులొత్తిన ఆరెస్సెస్, సంఘపరివార శక్తులకు పెత్తనమిస్తే ఇంతకన్నా ఏం చేయగలరు వారు!

ఈ పౌరసత్వ సవరణ బిల్లుకు ఈశాన్య ప్రాంతంలో వస్తున్న వ్యతిరేకత బిజెపికే ఎసరు తెస్తోంది. అసోంలో బిజెపి నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం నుండి ఎజిపి వైదొలగింది. మేఘాలయ ప్రభుత్వం దీనిని వ్యతిరేకించింది. ఈశాన్య భారతంలో పాగా వేసేశానని అనుకున్న బిజెపికి మొదటికే మోసం వచ్చేలా వుంది.

మోడీ ప్రభుత్వం అధికారంలో ఎన్ని రోజులు కొనసాగితే అంత ఎక్కువగా ఈ దేశ సమైక్యతకు, సమగ్రతకు ప్రమాదం ఉందని పౌరసత్వ సవరణ బిల్లు సూచిస్తోంది.



కన్నుల నిండుగ పిల్లల పండగ

సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ ఇలా.. చాలా పండగలు ఉన్నాయి. వారి వారి ఆచారాలు, సంప్రదాయాలకు ప్రతినిధిగా ప్రతి పండగ ఏదో ఒక సందేశాన్ని మోసుకొస్తుంది. ఎన్ని పండగలు ఉన్నప్పటికీ ప్రతి పండగలోనూ పిల్లలే ఒక నిండైన ఉత్సాహం, మెండైన ఉత్తేజం. అప్పుడే ఆ పండగ పండు వెన్నెల్లా విరబూస్తుంది. అలాంటి పండువెన్నెలే.. నిన్నటి రోజు తారాడిన అమరావతి బాలోత్సవం. ఈ పిల్లల పండగ ఈ నెల 2, 3, 4 తేదీల్లో విజయవాడలో ఘనంగా జరిగింది. చిన్నారుల్లో దాగిన నైపుణ్యాన్ని బయటకు తియ్యడంతో పాటు, మరిన్ని మెరుగులు దిద్దాలన్నదే ఈ పండగ ముఖ్యోద్దేశం. ఆటల పాటల మాటల ప్రతిభా ప్రదర్శనలతో అంగరంగ వైభవంగా జరిగిన బాలోత్సవ విశేషాలు చాలానే ఉన్నాయి.

విజయవాడ ఎన్టీఆర్ సర్కిల్ దగ్గరలోని శ్రీ కృష్ణవేణి స్కూలుకు వెళ్లే నాలుగు లైన్ల రహదారి ప్రారంభంలో ఏర్పాటు చేసిన ఆర్చి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రవేశద్వారం వద్ద మహనీయులు జవహర్‌లాల్ నెహ్రూ, మదర్ థెరిస్సా, డా.అంబేద్కర్, రవీంద్రనాథ్ ఠాగూర్ నిలువెత్తు ఫొటోలు దేశభక్తికి, సేవాతత్పరతకు తార్కాణంగా నిలిచాయి. ఇదంతా ఒక ఎత్తైతే. అన్ని కళల్లో ఆరితేరినట్టు, అలరించే హావభావాలతో అందరినీ అమాంతం అల్లుకుపోయారు చిన్నారులంతా. పల్లె అందాలకు పదం కట్టిన జానపదం ఘల్లు ఘల్లు గజ్జెల సంగీతంతో అడవి అందాలను మోసుకొచ్చింది. కొండకోనల నడుమ అడవి అందాలకు పరవశించిన నెమళ్లులా పిల్లల నృత్య విన్యాసాలు పరవళ్లు తొక్కాయి. అంతరాలు మరచి, పరవశించే పండగంటే ఇది కదా అనిపించేలా సాగింది. కూచిపూడి, భరతనాట్య సోయగం, కమ్మని కథల, కవితల రచన, వ్యంగ్యచిత్రాలు (కార్టూన్లు), కథా విశ్లేషణలు, వ్యాస రచనలు, ఘల్లుమన్న జానపదం, చిత్ర ప్రదర్శన, ఏకపాత్రాభినయం.., శాస్త్ర సాంకేతిక ప్రతిభా ప్రదర్శనం... ఇలా ఎన్నెన్నో విశేషాలతో పిల్లల పండగ ప్రేక్షకులకు కనువిందు చేసింది. పిల్లలను అలరించింది. ఆడిపాడే బాల్యమంతా అమరావతి బాలోత్సవంలో కొలువు తీరింది. ఇంత పారవశ్యాన్ని మోయలేక మోస్తూ కృష్ణవేణి టాలెంట్ స్కూలు కృష్ణవేణి పొంగులా హోరెత్తింది. కళ్లతోనే కాదు మనసుతో చూసినా.. ఈ మూడు రోజులూ చాలవేమో అనిపించేంత అద్భుతాన్ని ఈ పండగలో ప్రదర్శించారు చిన్నారులు.

ఎవరికి వారు మేం ఎవరికీ తీసిపోమంటూ తమదైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. నాట్య మయూరాలై, గాన విపంచులై అందరి మనసుల్లో కళామృతాన్ని నింపేశారు. తమ సృజనతో మట్టి బొమ్మలకు ప్రాణం పోశారు. సంప్రదాయ కళలకు జీవాన్ని అద్దారు. తమ నైపుణ్యంతో విజ్ఞానానికి ఒక రూపం దిద్దారు. తమ అభినయంతో సమయంతో పాటు ప్రేక్షకులనూ కట్టి పడేశారు. ఈ కార్యక్రమానికి 166 స్కూళ్ల నుంచి ఎంట్రీలు వచ్చాయి. 6,484 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పాల్గొన్న వాటిలో 111 స్కూళ్లకు బహుమతులు వచ్చాయి. ఈ కార్యక్రమం విజయవంతం అవ్వడానికి ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహమూ చెప్పుకోదగినది.

దీంతో ఎప్పుడూ పుస్తకాలతో కుస్తీ పట్టే చిన్నారులు బాలోత్సవ్‌లో సీతాకోకచిలుకల్లా విహరించారు. అంతులేని ఆనందాన్ని మూట కట్టుకున్నారు.

జరిగింది మూడు రోజుల వేడుకే అయినప్పటికీ చిన్నా పెద్దా అందరినీ అలరించింది ఈ పండగ. తెలుగు సుగంధాన్ని అడుగడుగునా వెదజల్లింది. తీసుకున్న అంశం ఏదైనప్పటికీ చిన్నారులంతా తమదైన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. సాటిలేని మేటి బాలలుగా అందరి మనసుల్నీ గెలిచారు. అంతేకాదు కలం, గళం, పదం, పాదం, హావం, భావం, విజ్ఞానం కలగలసిన పిల్లల పండగ మరో హరివిల్లై చిన్నారుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయింది.

- వైష్ణవిశ్రీ

ఫొటోలు : జి. రవి శంకర్

సృజనను ప్రోత్సహించాలని ...

చదువు సంస్కారం కోసం, ప్రగతి కోసం, పురోగతి కోసం అనుకునే రోజులు పోయాయి. టివి వచ్చాక పిల్లల మనస్తత్వాలు బాగా కలుషితమయ్యాయి. టివీలో వినిమయదారుల సంఖ్య బాగా పెరిగింది. ఎక్కువగా వాణిజ్య, వ్యాపార ప్రకటనలూ పిల్లలూ మహిళల గురించే ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో పిల్లల్లో సృజన, దేశభక్తి పెంపొందించాలన్న ఆలోచన నుంచి పుట్టుకొచ్చిందే బాలోత్సవ్.

- జి నారాయణరావు
అమరావతి బాలోత్సవ్ కల్చరల్ ఆర్గనైజర్



భవిష్యత్తుకు పునాది

అమరావతి బాలోత్సవ్ ఒక అద్భుతమైన ఆస్వాదన. పాఠశాలల్లో విశాలమైన మైదానాలు ఉన్నా సరైన ప్రోత్సాహమూ, ఇంట్లో చదువుకోలేని పరిస్థితి లేనప్పటికీ చిన్నారులు వీటిల్లో పాల్గొని, తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. చాలా సంతోషకరమైన విషయం ఇది. బయట ప్రపంచాన్ని చిన్నారులకు చూపించటానికి ఇదొక మంచి వేదిక. గత సంవత్సరం కన్నా ఈ ఏడాది వ్యాసరచనల్లో, కవితా రచనల్లో, మట్టితో చేసిన బొమ్మల నాణ్యతలోనూ మంచి పరిణితి కనిపించింది. న్యాయనిర్ణేతలూ సంతృప్తి చెందేలా ఎంట్రీలు దొరికాయి. ఇదొక మంచి పరిణామంగానే భావించాలి. ఇది చిన్నారుల భవిష్యత్తుకు మంచి పునాది కావాలని మా ఆకాంక్ష.

– జ్యోత్స్న,
అమరావతి బాలోత్సవ్ కార్యదర్శి

పిల్లల రాజ్యం

మొన్న జరిగిన బాలోత్సవ్‌కి నేనూ వచ్చాను. తెలుగు మాట్లాడటంలో (సీనియర్స్ విభాగంలో) మొదటి బహుమతి వచ్చింది. ఇక్కడ జరిగిన కార్యక్రమాలన్నీ చాలా సంతోషాన్ని కలిగించాయి. విద్య, వైజ్ఞానిక పరంగా చాలా విషయాలు తెలుసుకోగలిగాము. భోజనాలతో సహా అన్ని ఏర్పాట్లూ బాగా నచ్చాయి. ఇదంతా మా రాజ్యమే (పిల్లల రాజ్యం) అనిపించింది.

- కీర్తన, 9వ తరగతి.
సుందరమ్మ మున్సిపల్ హైస్కూల్



అనూహ్య స్పందన..

నేడు ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ ధ్యాసంతా ర్యాంకుల మీదే. అపార్ట్‌మెంట్స్‌లో పెట్టి బలవంతాన చదివించే పరిస్థితి నెలకొంది. చిన్ననాటి నుంచే ఆటలు పాటలతో కూడుకున్న సాంస్కృతిక కార్యక్రమాలతో సమన్వయించడం వల్ల పక్కవారితో ఎలా మసులుకోవాలి? ఏదైనా పోటీలో ఓడినా స్పిరిట్‌గా ఎలా తీసుకోవాలి? తెలుసుకుంటారు అంతేగాక స్నేహం, సౌభ్రాతృత్వం అలవడతాయి. ఈ ఉద్దేశంతోనే 'అమరావతి బాలోత్సవ్' పిల్లల పండగ రూపొందించాం. గత సంవత్సరం సీనియర్స్, జూనియర్స్‌లో 49 ఈవెంట్స్ నిర్వహించాం. ఊహించిన దానికన్నా మంచి స్పందన వచ్చింది. ఈ ఏడాది మొత్తం 58 ఈవెంట్స్‌గా విభజించాము. ఈసారి గొప్ప స్పందన వచ్చింది. కోలాటానికి అద్భుత స్పందన వచ్చింది. ఎవరికి నచ్చిన రంగంలో వారు రాణించేందుకు ఇవన్నీ దోహదపడతాయి. ముగ్గురు ఐఎఎస్ ఆఫీసర్లు, ఒక ఐఆర్ఎస్‌ల ప్రోత్సాహంతో పాటు అన్ని రంగాల్లో నిష్ణాతులు, రిటైర్డ్ ఉద్యోగులు, కవులు, రచయితలు మంచి సహకారాన్ని అందించారు.

- పి. మురళీకృష్ణ, బాలోత్సవ్ ప్రధాన నిర్వాహకులు.

ఇక్కడే ఉండిపోవాలనిపించింది

నా పేరు నందిని. జూనియర్స్ విభాగంలో జానపదనృత్యం పోటీల్లో పాల్గొన్నాను. మా బ్యాచ్‌కి బహుమతి రాలేదు కానీ.. ఈ విధంగా అంతమందిలో మేమూ పాల్గొనటం చాలా సంతోషాన్ని కలిగించింది. పాల్గొన్న వాళ్లంతా చాలా బాగా చేశారు. మేమూ వచ్చే సంవత్సరం ఇంతకన్నా బాగా చేసి, ప్రైజ్ గెలుచుకుంటాం. కార్యక్రమాలన్నీ చూశాక ఇక్కడే ఉండిపోవాలి అనిపించింది.

- నందిని, 7వ తరగతి,
మొహందలీపురం స్కూల్, వించిపేట.



న్యాయ నేస్తం

అతనిపై ఎలాంటి చర్య తీసుకోవాలి?


ప్లీడరు గారూ! ప్రజాశక్తి పేపర్లో వారం వారం మీ జవాబులు చదువుతున్నాను నాదొక సమస్య ఉంది. మాకు వరసకి బాబాయి అయ్యే వ్యక్తి మా ఎదురింట్లో ఉంటాడు. రిపోర్టరునంటాడు. ఏ పేపరో తెలియదు. గత మూడేళ్లుగా మా మీద రకరకాల కేసులు పెడుతూ, పోలీసు స్టేషనుకి, కోర్టుకి తిప్పుతూ హింసిస్తున్నాడు. రాజీ పడాలంటే డబ్బు కట్టమంటున్నాడు. ఇంట్లో అందరి మీద, ఆడ, మగా తేడా లేకుండా కేసు మీద కేసు పెడుతున్నాడు. దయచేసి మాకు పరిష్కారం చెప్పండి.

- రామప్రభు,
గూడూరు.

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది,
విజయవాడ.
ఫోన్ నెం : 8330968901
ఇ మెయిల్ : katururavindratrivikram@gmail.com
గమనిక : సాయంత్రం 5 తర్వాత ఫోన్ చేయగలరు.


తప్పుడు కేసులు పెట్టడం కూడా నేరమే. కావాలని ఏ కేసుల్లో ఇరికిస్తే, ఆ కేసుకి వేసే శిక్షని తప్పుడు కేసు పెట్టినవారికి కోర్టు విధిస్తుంది. అయితే, అది తప్పుడు కేసుగా మీరు లాయరు సాయంతో రుజువు చేయాలి. అటు తర్వాత ఆ తీర్పు ఆధారంగా అతని మీద కేసు పెట్టాలి. ఈలోగా మీరు జిల్లా పోలీసు ఉన్నతాధికారులకు మీ కుటుంబసభ్యులంతా కలిసి, మిమ్మల్ని వేధింపులకు గురిచేస్తూ తప్పుడు కేసులు పెడుతున్న వివరాలతో ఒక ఫిర్యాదు స్వయంగా ఇవ్వండి.

అలాగే, సోమవారం కలెక్టరుగారు నిర్వహించే ప్రజాదర్బారులో కూడా, కలెక్టరుని ఉద్దేశిస్తూ ఒక అర్జీ పెట్టుకోండి. స్వయంగా మీ సమస్య చెప్పుకోండి. పరిష్కారం లభిస్తుంది.



బహుమతి పొందిన ముగ్గు

17 చుక్కలు
9 వచ్చేవరకు
మధ్యచుక్క



సి. రాజ్యలక్ష్మీ,
ప్రశాంతనగర్ కాలనీ,
హైదరాబాద్.

డి. మాధవి,
పామూరు,
ప్రకాశంజిల్లా.




25 చుక్కలు
1 వచ్చే వరకు
సరిచుక్కలు.

మా చిరునామా: 'రమణుల రంగవల్లి', జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక, హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2. ఇమెయిల్: jeevanapageps@gmail.com ఆదివారం మినహా ఉ.12 గం. సా.6 గం. మధ్య ఫోన్ నెం. 9490099006కు సంప్రదించండి.

జీవన సౌరభం

ఓటమి ఎరుగని వ్యక్తి కన్నా విలువలతో జీవించే వ్యక్తి గొప్పవాడు, ఉత్తముడు.

మీకోసం



అరకప్పు పాలు, కొద్దిగా పసుపు, ఉప్పు వేసి కలిపి ముఖానికి రాసి, పావుగంట తర్వాత కడిగేస్తే చెంపలపై నలుపు పోతుంది.



ఉపాధి



S. LENIN BABU
LECTURER IN MATHS
GOVERNMENT
POLYTECHNIC COLLEGE
VIJAYAWADA. PH : 9985476035

REASONING FOR ALL COMPETITIVE EXAMS

Situation Reaction Test

Description : Situation reaction test is to access the reasoning power of a candidate, means how a normal candidate reacts and what should be the proper reaction of normal candidate in ideal situations since the candidate response is the main thing. At any place/working environment number of situations occur and need to make a ideal path 'how to react' in these situations.

In this, candidates few basic qualities are being tested like loyalty, honesty, moral values, straight forwardness, leadership qualities etc.

Concept : Below listed are few tips to answer the questions:


1. Candidate must first understand the situation. The reaction should be only practical not theoretical.
2. Reaction should be in such a way that accept the situation.
3. Reaction of the candidate should be ideal so that in all circumstance all the ideal people will follow that reaction.
4. Reaction given ought to be the most ideal approach to solve the given problem.
5. Reaction ought to be ethically right.
6. Reaction Should be instant and quick.
7. Reaction should be from perspective of a decent individual.

Model Problems

1. You have made some silly mistakes which have been pointed out to you. You will:
A. laugh it away.
B. get angry.
C. feel miserable.
D. feel thankful.
Option : D
Explanation:
feel thankful.

2. You are moving across the road on a scooter when you observe that two boys on a bike snatch a lady's gold chain and ride away. You would :
A. Console the woman.
B. chase the boys to catch hold of them.
C. inform the police about the matter.
D. stand and see what happens next.
Option : B
Explanation:
chase the boys to catch hold of them.

3. On reaching the railway station, you find that the train you wanted to catch is just to start and there is hardly any time for purchasing the ticket. The best thing for you is to :
A. rush to the train rather than miss it and inform the T.T.I. at the next stoppage about your inability to purchase the ticket.
B. rush to the train and perform your journey quietly.
C. first purchase the ticket and then catch the train if it is there.
D. miss the train rather than take the risk of boarding the moving train.
Option : A
Explanation:
rush to the train rather than miss it and inform the T.T.I. at the next stoppage about your inability to purchase the ticket.



4. You are returning home from school. On the way, you find a sealed envelope in a street, fully addressed with unused stamps on it. You would :
A. leave it there as it was and walk away.
B. remove the stamps and destroy the envelope.
C. open the envelope, find out who has dropped it by mistake, and send it to him if possible.
D. post it at the nearest letter box.
Option : D
Explanation:
post it at the nearest letter box.

5. If in the examination hall, you find that the question paper is too tough to be answered satisfactorily by you, the best thing to do for you is to :
A. tell the examiner that the questions are out of course.
B. provoke the candidates to walk out of the examination hall.
C. try to know something from your neighbour.
D. try to solve the questions as much as you know with a cool head.
Option : D
Explanation:
try to solve the questions as much as you know with a cool head. ★

General Mental Ability - Model Problems

Model 1: Which of the following will be best reaction for 'To be an ideal manger, you should'?
a) Organise seminars for sub-ordinates.
b) Stick to your rules.
c) Be authoritarian in your approach.
d) Present yourself as an example.
Solution:
Given Statement is
'To be an ideal manger'
Since the manager work is to get work done from others. If the manger wants to work done by others , manger can motivate them by showing himself as an example.
So, The answer is option(d)
Therefore, 'To be an ideal manger, you should be yourself as an example'.

Model 2: An angry customer wants to meet senior manager for grievance reporting. What will you do?
a) Talk to him yourself
b) Be patient and try to cool him down
c) Try to remove his inconveniences by consulting seniors.
d) Tell him it is not easy to meet the senior manager.
Solution:
Given that
An angry customer wants to meet senior manager for grievance reporting.
Suppose you are working in a company. A customer comes to you and he wants to meet the superior of the company for a grievance report.
Whenever working in a company will have a grievance over there. In this type, first thing is that you have to behave patiently because if any other person is suffering from any loss obviously that person will have grievance.
Therefore, Be patient and try to cool him down.
Hence, option(b) is the correct answer.

Model 3: You have made some silly mistakes which have been pointed out to you. You will
a) Feel miserable.
b) Laugh it away.
c) Get angry.
d) Feel thankful.
Solution:
Given
'You have made some silly mistakes which have been pointed out to you'.
Best reaction is to feel thankful when some one points out mistake in you.
In order to justify the mistake because other person is pointing out the silly mistakes and by overcoming by those mistakes you can become perfect.
Therefore, option(d) is correct answer.

Model 4: Your friend has not invited you to his marriage party. You will:
a) Hold it against him.
b) Send him your best wishes.
c) Attend the ceremony.
d) Ignore the whole affair.
Solution:
Given that
Your friend has not invited you to his marriage party.
Then the best reaction is sending the best wishes to him. Sometime, the marriage ceremony may not be that much huge that he is in a position to invite all his friends.
So, option(b) is the correct answer.

Model 5: You have a problem at your work place that really troubling you. What will you do?
a) Ask everyone of your family what you should do.
b) Abuse your colleagues in front of your close friends.
c) Sit down peacefully to try and find the solution.
d) Try and brush it as trivial that such things keep happening.
Solution:
Given that
You have a problem at your work place that really troubling you.
Then, need to sit peacefully because at the work place problems will be faced.
In order to overcome the problem, you need to sit down peacefully and try to solve it.
Therefore, option(c) is the correct answer.

ఇండియన్ రైల్వేలో 798 ఉద్యోగాలు

భారతీయ రైల్వేకు చెందిన వివిధ జోన్లలో ఖాళీగా ఉన్న రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే ప్రొటెక్షన్ స్పెషల్ ఫోర్స్‌లో 798 కానిస్టేబుల్ (యాన్సిల్లరీ) పోస్టుల భర్తీకి అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును బట్టి మెట్రిక్యులేషన్/ఎస్‌ఎస్‌ఎల్‌సీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట శారీరక ప్రమాణాలుండాలి.
వయసు: 18-25 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.
ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్ట్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్, ట్రేడ్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.
దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, ఎక్స్-సర్వీస్‌మెన్, మహిళలు, మైనార్టీ, ఈబీసీలకు రూ.250, ఇతరులకు రూ.500.
దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 30, 2019.
పూర్తి వివరాలకు : వెబ్‌సైట్‌లో పరిశీలించొచ్చు.
వెబ్‌సైట్: www.indianrailways.gov.in

ఉద్యోగాలు

బీఎస్ఎన్ఎల్‌లో 150 ఉద్యోగాలు

భారత ప్రభుత్వరంగ సంస్థ భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) 150 మేనేజ్‌మెంట్ ట్రైనీ (టెలికాం ఆపరేషన్స్)ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: టెలీ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్/ఐటీ, ఎలక్ట్రికల్‌లో బీఈ/బీటెక్ లేదా తత్సమాన ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణత.
వయసు: ఆగస్టు 1, 2019 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: అసెస్‌మెంట్ ప్రాసెస్ (ఆన్‌లైన్), గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.
దరఖాస్తు ఫీజు: ఓసీ, ఓబీసీలకు రూ.2200, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1100.
దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 26, 2019.
పూర్తి వివరాలకు : వెబ్‌సైట్‌లో పరిశీలించొచ్చు.
వెబ్‌సైట్: www.bsnl.co.in

రూ.33వేలు దాటిన బంగారం

న్యూఢిల్లీ : బంగారం ధరలు వరుసగా నాలుగో రోజూ పెరిగి 10 గ్రాముల ధర రూ.33,000 పైన పలికింది. దేశంలో పెళ్లిళ్ల సీజన్ దగ్గర పడుతున్న నేపథ్యంలో బంగారానికి డిమాండ్ పెరుగుతోందని, దీంతో ముందు జాగ్రత్తగా అభరణాల వర్తకులు కొనుగోళ్లకు మొగ్గు చూపడంతో పసిడి మరింత ప్రియమయ్యిందని బులియన్ వర్తకులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 99.9 శాతం, 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.270 ఎగిసి వరుసగా రూ.33,070, రూ.32,920కి ఎగిసింది. అంతర్జాతీయంగా బంగారంపై పెట్టుబడులు పెరగడానికి తోడు డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం కూడా బంగారం ధరలకు ఆజ్యం పోశాయి. తాజాగా కిలో వెండిపై రూ.410 ప్రియమై రూ.40,510 వద్ద ముగిసింది.

బంధన్ బ్యాంకు లాభాల్లో 10% వృద్ధి

న్యూఢిల్లీ : ప్రయివేటు రంగ విత్త సంస్థ బంధన్ బ్యాంకు 2018-19 డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 10.41 శాతం వృద్ధితో రూ.331.27 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.300.04 కోట్ల లాభాలు నమోదు చేసింది. మైక్రో బ్యాంకింగ్, డిపాజిట్ల లాంటి తమ కీలక వ్యాపారం.. ముఖ్యంగా రిటైల్‌లోని కాసా పటిష్టమైన ప్రగతిని కనబర్చిందని బంధన బ్యాంకు ఎండి, సిఇఒ చంద్ర శేఖర్ ఘోష్ పేర్కొన్నారు. క్రితం క్యూ3లో బ్యాంకు నికర వడ్డీపై ఆదాయం 10.50 శాతం పెరిగిందన్నారు. నికర వడ్డీపై ఆదాయం 53.5 శాతం పెరిగి రూ.1,124 కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.732 కోట్ల ఎన్ఐఐ నమోదయ్యింది. ఇదే సమయంలో 1.29 శాతంగా ఉన్న స్థూల నిరర్థక ఆస్తులు క్రితం క్యూ3లో 2.41 శాతానికి చేరింది. మొండి బాకీల కోసం కేటాయింపులు 208 శాతం పెరిగి రూ.377.65 కోట్లుగా నమోదయ్యాయి.

అదరగొట్టిన టిసిఎస్

- క్యూ3లో రూ.8,105 కోట్ల రికార్డు లాభాలు
- మూడున్నరేళ్లలోనే అత్యధిక రెవెన్యూ

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద ఐటి సేవల కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) మార్కెట్ అంచనాలకు మించి రికార్డు లాభాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో 24.1 శాతం వృద్ధితో రూ.8,105 కోట్ల లాభాలు నమోదు చేసింది. 2017-18 ఇదే క్యూ3లో రూ.6,531 కోట్ల లాభాలు ఆర్జించింది. టాటా గ్రూపునకు సింహభాగం రెవెన్యూను అందిస్తుంది. క్రితం డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో తమ రెవెన్యూలో 21 శాతం వృద్ధి చోటు చేసుకుందని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఎండి రాజేష్ గోపినాథ్ పేర్కొన్నారు. గత 14 త్రైమాసికాల్లో ఇదే రికార్డు రెవెన్యూ అని పేర్కొన్నారు. భౌగోళికంగానూ, అన్ని కేటగిరీల్లోనూ మెరుగైన వృద్ధిని నమోదు చేశామన్నారు.



మదుపర్లకు బొనంజా..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ప్రతీ ఈక్విటీ షేర్‌పై రూ.2 మధ్యంతర డివిడెండ్ అందించడానికి కంపెనీ బోర్డు ఆఫ్ డైరెక్టర్లు ఆమోదం తెలిపారు. దీంతో వరుసగా మూడోసారి మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించినట్లయ్యింది. తాజాగా ప్రకటించిన ఈ డివిడెండ్‌ను జనవరి 24 నాటికి చెల్లించనున్నారు. కాగా జనవరి 18వ తేదిని రికార్డు తేదిగా గుర్తించనున్నారు.

ఆకర్షణీయ లాభాలు..

ఐటి కంపెనీ ఒక త్రైమాసికంలో రూ.8000 కోట్ల పైగా లాభాలు నమోదు చేయడం సాఫ్ట్‌వేర్ రంగంలోనే ఒక కీలక మైలురాయి. ఇంతక్రితం జులై- సెప్టెంబర్ త్రైమాసికంలో ఈ కంపెనీ రూ.7,927 కోట్ల లాభాల నమోదు చేసింది. క్రితం క్యూ3లో కంపెనీ రెవెన్యూ 20.80 శాతం పెరిగి రూ.37,338 కోట్లుగా చోటు చేసుకుందని బిఎస్ఇకి టిఎస్ఎస్ వెల్లడించింది. స్థిర కరెన్సీ ధరల వల్ల కంపెనీ రెవెన్యూ త్రైమాసికం, త్రైమాసికానికి 1.8 శాతం, ఏడాదికేడాదికి గాను 12.1 శాతం పెరుగుదల నమోదయ్యింది. గత క్యూ3లో డిజిటల్ ఎకౌంట్ రెవెన్యూ 52.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. మొత్తం రెవెన్యూలో ఈ విభాగం వాటా 30.1 శాతంగా ఉందని తెలిపింది.

కొత్తగా 6,827 సిబ్బంది...

మూడో త్రైమాసికంలో కొత్తగా 6,827 మంది ఉద్యోగు లను తీసుకున్నారు. దీంతో డిసెంబర్ ముగింపు నాటికి టిసిఎస్ మొత్తం సిబ్బంది 4,17,929కి చేరింది. గురువారం బిఎస్ఇలో టిసిఎస్ షేర్ 0.02 శాతం పెరిగి రూ.1,885 వద్ద ముగిసింది.

నాలుగు రోజుల లాభాలకు బ్రేక్



ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు నాలుగు రోజుల వరుస లాభాలకు గండి పడింది. పలు ప్రతికూల పరిణామాలతో ఆసియన్ మార్కెట్లు బలహీనంగా కొనసాగడానికి తోడు బ్యాంకింగ్ షేర్లు అమ్మకాలకు గురి కావడంతో గురువారం సెన్సెక్స్, నిఫ్టీలు నష్టపోయాయి. తుదకు బిఎస్ఇ సెన్సెక్స్ 106 పాయింట్లు లేదా 0.29 శాతం తగ్గి 36,107 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 34 పాయింట్లు లేదా 0.31 శాతం తగ్గి 10,822 వద్ద నమోదయ్యింది. నిఫ్టీలో 20 స్టాక్స్ నష్టపోగా, 20 స్టాక్స్ లాభపడ్డాయి. ఇండుస్‌ఇండ్ బ్యాంకు, కొటాక్ బ్యాంకు, ఫెడరల్ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఎస్‌బిఐ సూచీలు 2.36 శాతం వరకు నష్టపోయాయి. అదే విధంగా ఒఎన్‌జిసి, మారుతి సుజుకి, సన్ ఫార్మా, హెచ్‌డిఎఫ్‌సి, హీరో మోటో కార్ప్, ఐటిసి, హెచ్‌సిఎల్ షేర్లు 1.31 శాతం మేర పడిపోయాయి.

బిఎస్ఇలో మిడ్‌క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.49 శాతం, 0.19 శాతం చొప్పున రాణించాయి. రంగాల వారిగా నిఫ్టీలో బ్యాంకింగ్ 0.69 శాతం, ఫిన్ సర్వీసెస్ 0.56 శాతం, రియాల్టీ 0.27 శాతం చొప్పున అధికంగా నష్టపోయాయి.

మారుతి కార్లు ప్రియం

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీదారు మారుతి సుజుకి తమ వాహన ధరలను రూ.10,000 వరకు పెంచుతున్నట్లు గురువారం ప్రకటించింది. పెంచిన ధరలు తక్షణమే అమల్లోకి వచ్చినట్లు పేర్కొంది. ముడి సరకు, విదేశీ మారకం రేటు పెరిగిన కారణంగా ధరలు పెంచాల్సి వచ్చినట్లు తెలిపింది. కాగా ఏ కార్లపై ఎంత ధరలు పెరుగుతాయనేది ఆ కంపెనీ వెల్లడించలేదు. ప్రస్తుతం మారుతీ సుజుకీ కార్ల మోడళ్లు ఆల్టో 800 నుంచి ఎస్ క్రాస్ వరకు ఉన్నాయి. ఢిల్లీ ఎక్స్‌షోరూం వద్ద వీటి ధరల శ్రేణీ రూ.2.53 లక్షల నుంచి రూ.11.45 లక్షలుగా ఉంది.

ప్రభుత్వానికి ఆర్‌బిఐజవాబుదారి బిమల్ జలాన్

న్యూఢిల్లీ : ఆర్‌బిఐ వద్దనున్న మిగులు నిల్వలను లాక్కోవడానికి మోడీ సర్కార్ తన యత్నాలను కొనసాగిస్తూనే వున్నది. ఆర్‌బిఐ కేంద్ర ప్రభుత్వానికి జవాబుదారి వహించాలని ఆర్‌బిఐ నగదు నిల్వల పరిశీలనా కమిటీ ఛైర్మన్ బిమల్ జలాన్ చేత తాజాగా చెప్పించింది. ఆర్‌బిఐ మాజీ గవర్నర్ జలాన్ నేతత్వంలో ఓ కమిటీని నగదు నిల్వల పరిమాణం పరిశీలనకు ఆర్బీఐ, కేంద్ర ప్రభుత్వం కలిసి నియమించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆర్‌బిఐ వద్ద రూ.9.6 లక్షల కోట్లకుపైగా మిగులు నిల్వలు ఉన్నాయి.

యమహా నుంచి కొత్త బైక్..

యమహా మోటార్ ఇండియా మార్కెట్లోకి కొత్త 2019 వైజడ్‌ఎఫ్-ఆర్15 వి3.0 ఎబిఎస్‌ను విడుదల చేసింది. ఎక్స్‌షోరూం వద్ద దీని ధరను రూ.1.39 లక్షలుగా నిర్ణయించింది. ఆర్15 సీరిస్‌కు కొనసాగింపుగా ఈ మూడో తరం బైకును అవిష్కరించామని ఆ కంపెనీ ఛైర్మన్ మోమోఫుమి షిటర పేర్కొన్నారు. ఈ 150 సిసి బైక్ కోసం బుకింగ్స్‌ను ప్రారంభించామన్నారు.



విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

డిగ్రీ సెమిస్టర్ మెగా సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించాలని, కరువు ప్రాంతాలలో విద్యార్థులకు ఫీజు రాయితీ కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ వద్ద విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ మాట్లాడుతూ సెమిస్టర్ విధానాన్ని అమలు చేసేందుకు నాగార్జున యూనివర్శిటీ అధికారుల వద్ద ఎటువంటి ప్రణాళిక లేదనీ, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ అన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ 2 కు వినతిపత్రం సమర్పించారు.

శ్రీకాకుళంలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు



132 జిఒను రద్దు చేయాల్సిందే

యుటిఎఫ్ ఆధ్వర్యాన గిరిజన ఉపాధ్యాయులు, ఉద్యోగుల ధర్నాలు

ప్రజాశక్తి యంత్రాంగం

జిఒ 132ని రద్దు చేయాలని, గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలల్లో పనిచేస్తోన్న ఉద్యోగుల, ఉపాధ్యాయుల పెండింగ్ వేతనాలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యాన శ్రీకాకుళం, విశాఖ కలెక్టరేట్ల వద్ద, అరకులోయ సబ్ ట్రెజరీ కార్యాలయం వద్ద గురువారం ధర్నాలు జరిగాయి. అరకు, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల ఉపాధ్యాయులు అరకువేలీ సబ్‌ట్రెజరీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఆశ్రమ ఉపాధ్యాయులు డ్రాయింగ్ అధికారాలను ఎటిడబ్ల్యుఒలకు బదలాయిస్తూ ప్రభుత్వం 132 జిఒ జారీ చేయగా, ఉపాధ్యాయుల ఆందోళనతో దాన్ని నిలుపుదల చేసింది. అయితే దీనికి సంబంధించి చెల్లింపు ఆదేశాలను సబ్‌ట్రెజరీలకు అందకపోవడంతో నవంబర్, డిసెంబర్ నెలలకు ఆశ్రమ పాఠశాలల ఉపాధ్యాయులు వేతనాలను చెల్లించడం లేదు. దీంతో అరకులోయ, డుంబ్రిగుడ, అనంతగిరి మండలాల ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేసి, క్రిస్మస్, కొత్త సంవత్సరాదికి చేతిలో డబ్బులు లేకుండా చేసిన ప్రభుత్వం, సంక్రాంతికైనా వేతనాల చెల్లింపునకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు ఎస్‌టిఒకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎస్‌టిఒ ఎబిఎస్ఎస్ఎన్.మూర్తి వివరణ కోరగా, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే వేతనాల చెల్లింపునకు చర్యలు చేపడతామని వివరించారు. విశాఖలో ధర్నానుద్దేశించి సంఘం రాష్ట్ర కార్యదర్శి డి.రాము మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.చినబ్బాయి మాట్లాడారు. శ్రీకాకుళంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి గిరిధర్ మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఖజానా శాఖ కార్యాలయంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నిర్మలమ్మను కలిసి వినతిపత్రం అందించారు.

బొండా సమక్షంలో దాడి

- విజయవాడ జన్మభూమి సభలో సిపిఎం, జనసేన, వైసిపి నేతలపై దౌర్జన్యం
- కొవ్వూరులో మంత్రిని నిలదీసిన స్థానికులు



దౌర్జన్యానికి నిరసనగా విజయవాడ కండ్రికలో రోడ్డుపై బైఠాయించిన ఆందోళన నిర్వహిస్తున్న సిహెచ్.బాబూరావు, వైసిపి కార్పొరేటర్ శ్రీశైలజ, జనసేన, సిపిఎం, జనసేన కార్యకర్తలు



తూర్పుగోదావరి జిల్లా గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో వైసిపి, టిడిపి కార్యకర్తల ఘర్షణ

ప్రజాశక్తి - యంత్రాంగం

జన్మభూమి సభల్లో గురువారం నాడు కూడా పలు సమస్యలపై ప్రజలు మంత్రులు, ఎమ్మెల్యేలను అధికారులను నిలదీశారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని 59వ డివిజన్ కండ్రికలో జరిగిన జన్మభూమి రసాబాసగా సాగింది. ప్రజాసమస్యలు పరిష్కరించాలని కోరిన సిపిఎం, వైసిపి మహిళా నాయకులు, జనసేన శ్రేణులపై ఎమ్మెల్యే బొండా ఉమా సమక్షంలో తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకులు దౌర్జన్యానికి దిగారు. వైసిపికి చెందిన కార్పొరేటర్‌పై సైతం దౌర్జన్యం చేసి పక్కకు నెట్టేశారు. ఎమ్మెల్యే, టిడిపి కార్యకర్తల తీరును నిరసిస్తూ ఆయా పార్టీల నేతలు ఆందోళనకు దిగారు. ఈ ఆందోళనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఎ బొండా గుండాలను, రౌడీలను పక్కన పెట్టుకుని జన్మభూమి సభలకు వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు అధికార పార్టీ వారికే కొమ్ముకాస్తున్నారని విమర్శించారు.


పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు 20వ వార్డు జన్మభూమి సభలో గతంలో ఇళ్ల పట్టాలకు డబ్బులు వసూలు చేశారని, పట్టాలు ఎప్పుడు ఇస్తారంటూ అంటూ మంత్రి జవహర్‌ను పేదలు, స్థానిక వైసిపి నేతలు ప్రశ్నించారు. దీనిపై అధికారులు, నాయకులు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో మంత్రి సభ మధ్యలోనే వెళ్లిపోయారు. ఆ సమయంలో మంత్రిని నిలదీయడానికి ప్రయత్నించిన వారిని పోలీసులు బలవంతంగా గెంటి వేశారు. కాళ్ల సభలో ఉండి ఎంఎల్ఎ శివరామరాజును గ్రామస్తులు నిలదీశారు. పాలకోడేరు మండల పరిధిలో మోగల్లులో సభ రసాబాసగా మారింది.

కృష్ణాజిల్లా మొవ్వలో ఇళ్ల స్థలాల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ప్లకార్డులతో మహిళలు జన్మభూమి గ్రామ సభ ఎదుట బైఠాయించారు.. తిరువూరు మండలంలోని అక్కపాలెంలో గతుకుల రహదారులను అభివృద్ధి చేయాలని కోరుతూ అధికారులను నిలదీశారు. గుంటూరు జిల్లా మాచర్ల మండం కొత్తూరులో జరిగిన గ్రామసభలో ఆ గ్రామానికి చెందిన యువకులు రైతులు ఆత్మహత్యలు చేసుకోకుండా ఆపాలని, గ్రామానికి తాగునీరు అందించాలని, మౌలిక సమస్యలు పరిష్కరివంచాలని అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. తమ గ్రామానికి తక్షణమే తారురోడ్డు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ విజయనగరం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడిలో సభను స్థానిక గిరిజనులు బహిష్కరించారు. 'మా గ్రామానికి అధికారులు రావద్దు. వెనక్కి వెళ్లిపోండి,' అంటూ ముక్తకంఠంతో అధికారుల బృందాన్ని అడ్డుకున్నారు. వేపాడ మండలం పికెఆర్ పురంలోకి జన్మభూమి అధికారుల వాహనాలు రాకుండా గ్రామస్తులు తాటి దుంగలను రోడ్డుపై అడ్డంగా పెట్టారు. గతేడాది చేసిన ఉపాధి పనుల బిల్లులు నేటికీ చెల్లించకపోవడంపై శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలస మండలం తోటవాడ సభలో అధికారులను కూలీలు నిలదీశారు.

తూర్పుగోదావరి జిల్లా విఆర్ పురం మండలం రేఖపల్లి సభలో పోలవరం ప్రాజెక్టు పరిధిలోని గ్రామాల అభివృద్ధిపై సిపిఎం, వైసిపి నాయకులు అధికారులను నిలదీశారు. ప్రాజెక్టు నిర్మాణంతో ముంపునకు గురికాని రేఖపల్లి పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎందుకు అభివృద్ధి పనులు చేపట్టడంలేదని సిపిఎం నాయకులు పంకు సత్తిబాబు, చిక్కాల రామారావు, వైసిపి నాయకులు చిక్కాల బాలు, బొడ్డు సత్యనారాయణ అధికారులను నిలదీశారు. చింతూరు మండలం కొత్తపల్లి పంచాయతీ సుకుమామిడి జన్మభూమి సభలో రంపచోడవరం ఎమ్మెల్యే రాజేశ్వరిదేవికి సమస్యలు చెప్పేందుకు గిరిజనులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎదురుచూశారు. మోగల్లు సభలో మధ్యాహ్నం భోజనం బాగులేదని విద్యార్థులు చెప్పారు. విశాఖ జిల్లా అనంతగిరి మండలం పైనంపాడులో సభలో కాఫీ, ఉపాధి బకాయిల చెల్లింపులో జాప్యంపై స్థానిక గిరిజనులు అధికారులను నిలదీశారు. చోడవరంలో రైతు రుణమాఫీ అమలుపైఅందరికీ వర్తించలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

ఉద్యోగం ఇస్తారా, చావమంటారా?

వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన తెలిపిన టెక్నికల్ అసిస్టెంట్లు



ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిల్లా నీటి యాజమాన్య సంస్థ పరిధిలో తొలగించిన అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమను విధుల్లోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని, ప్రభుత్వం స్పందించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. తమను విధుల్లోకి తీసుకోవడంలో అధికారులు జాప్యం చేస్తున్నారంటూ గురువారం అనంతపురం డిఆర్‌డి కార్యాలయం ఎదుట ఉన్న వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేపట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఈటె నాగరాజు కూడా ట్యాంక్ పైకి ఎక్కి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. 'విధుల్లోకి తీసుకుంటారా లేక ట్యాంక్ పైనుంచి దూకి చావమంటారా' అంటూ తొలగించిన ఉద్యోగులు నినాదాలు చేశారు. దీంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రెండో పట్టణ సిఐ ఆరోహణరావు ట్యాంక్ పైకి ఎక్కి అభ్యర్థులకు నచ్చజెప్పారు. సమస్యలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఇటువంటి చర్యలకు పాల్పడటం సరికాదని వారికి నచ్చజెప్పారు. దీంతో అభ్యర్థులు కిందకు దిగి వచ్చారు. డ్వామా పిజి జ్యోతిబసు చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తారని చెప్పారు. సిఐటియు నాయకులు నాగరాజు మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా పని చేయించుకుని ఉన్న ఫలంగా ఉద్యోగులను తొలగించడం అన్యాయంగా ఉందన్నారు. తొలగించిన వారిలో వికలాంగులు, మహిళలు, వెనుకబడిన వర్గాల అభ్యర్థులే ఎక్కువ మంది ఉన్నారని చెప్పారు. తక్షణమే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. టెక్నికల్ అసిస్టెంట్లు, అంటెండర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.బాల రంగయ్య, ఎం.క్రిష్ణమూర్తిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కెవి.రమణకు ఎఫ్‌పిఎస్‌డబ్ల్యు పురస్కారం

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

అసోసియేషన్ ఆఫ్ స్కూల్స్ ఆఫ్ సోషల్ వర్క్ ఇన్ ఇండియా పూర్వ అధ్యక్షులు, ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి కెవి.రమణకు ఇండియన్ సొసైటీ ఆఫ్ ప్రొఫెషనల్ సోషల్ వర్క్ (ఎఫ్‌పిఎస్‌డబ్ల్యు) పురస్కారం లభించింది. ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరో సైన్సెస్ (నిమ్‌హాన్స్) సైక్రియాట్రిక్ సోషల్ వర్క్ విభాగం గోల్డెన్ జూబ్లీ వేడుకలను, ఇండియన్ సొసైటీ ఆఫ్ ప్రొఫెషనల్ సోషల్ వర్క్ 37వ వార్షిక సమావేశాన్ని ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించారు. సదస్సులో ఆచార్య కెవి.రమణ కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఇండియన్ సొసైటీ ఆఫ్ ప్రొఫెషనల్ సోషల్ వర్క్ ఫెలోగా పురస్కారం అందించారు. ఈ అవార్డు ఎఫ్‌పిఎస్‌డబ్ల్యులో అత్యున్నత పురస్కారంగా నిలుస్తుంది. ఆచార్య రమణ భారతీయ సమాజానికి చేసిన సృజనాత్మక, ప్రతిభావంతమైన, అసాధారణ సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందించారు. యుజిసి పూర్వ చైర్మన్ అర్మైటి దేశాయ్ సైతం ఈ అవార్డును అందుకున్నవారిలో ఉన్నారు.

కోడిపందేలపై ఉత్కంఠ..

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కోడి పందేలపై ఉక్కుపాదం మోపుతామని, పందెం రాయుళ్ల ఆట కట్టిస్తామని తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్తికేయమిశ్రా, ఎస్‌పి విశాల్ గున్నీ హెచ్చరిస్తున్నారు. కోర్టు ఆదేశాలను తప్పకుండా అమలుచేసి తీరుతామంటున్నారు. వీరి హెచ్చరికలను పట్టించుకోకుండా పందెంరాయుళ్లు బరులు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్రంలోని పందెంరాయుళ్ల దృష్టిని ఆకర్షించిన ఐ.పోలవరం మండలం మురమళ్లలో గతేడాది నిర్వహించిన బరి గురువారం నాటికి కూడా సిద్ధం కాలేదు. మరోవైపు అల్లవరం మండలం గోడిలంకలో బరి సిద్ధమవుతోంది.

మురమళ్లలో రెండేళ్లగా భారీగా పందేలు జరిగిన ప్రాంతంలో ఎలాంటి ఏర్పాట్లు జరగడంలేదు. కలెక్టర్, ఎస్‌పి హెచ్చరికల నేపథ్యంలో గతేడాది మాదిరిగా భారీ ప్రచారం చేయకుండా పందేలు ఏర్పాటుచేసేందుకు నిర్వాహకులు అధికారపార్టీ నేతలను ఆశ్రయిస్తున్నారని సమాచారం. ఏటా అల్లవరం మండలం గోడి, గోడిలంకలో కోళ్ల పందేలు, గుండాట, పేకాట, మద్యం అమ్మకాలు జరిగేవి. గతేడాది రూ.10 కోట్లకు పైగానే పందేలు జరిగాయని భావిస్తున్న గోడిలంకలో గుంభనంగా ఓ రైతు పొలంలో బరి సిద్ధమవుతోంది. అధికార పార్టీ నాయకుల పైరవీలకు లొంగకుండా కోడిపందేలపై ఉక్కుపాదం మోపాలని పోలీసు, రెవెన్యూ యంత్రాంగం పట్టుదలగా ఉన్నాయి. జిల్లాలో ఇప్పటికే 150 మందిని పోలీసులు బైండోవర్ చేశారు. 57 కేసులు నమోదు చేసి, 13 మందిని అరెస్టు చేశారు. ఏటా కోడిపందేలు జరుగుతున్న ప్రాంతాల్లో ఈనెల 7వ తేదీ నుంచి 144 సెక్షన్ అమలులో ఉంచారు. పండగ రోజుల్లో తనిఖీలు నిర్వహించేందుకు జిల్లావ్యాప్తంగా తహశీల్దార్లు, ఎస్‌ఐలతో 18 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గతేడాది కోడి పందేలు నిర్వహించిన ప్రాంతాల్లో కాకుండా వేరే ప్రాంతాల్లో నిర్వాహకులు బరులు సిద్ధం చేస్తున్నారని ప్రచారం సాగుతోంది. ఐ.పోలవరం మండలం ఎదుర్లంక, పెదమూడి అమలాపురం మండలం కామనగరువు, ఉప్పలగుప్తం మండలం కూనవరం, చల్లపల్లి, గొల్లవిల్లి, భీమనపల్లి, సామర్లకోట మండలం వేట్లపాలెం, వికె రాయపురం, రాజానగరం మండలం దివాన్‌చెరువు, రాజానగరం, నరేంద్రపురం, పుణ్యక్షేత్రం, మన్యంలోని రాజవొమ్మంగి, మారేడుమిల్లి, వై.రామవరం, దేవీపట్నం మండలాల్లో గతేడాది పందేలు జరిగిన ప్రాంతాల్లో ఈసారి సందడి కన్పించడంలేదు. ఈసారి కోడి పందేలు ఉంటాయా? ఉండవా? అనే విషయంపై జిల్లాలో చర్చ జరుగుతోంది.

ప్రజ్ఞ

జవాబులు

1. పాకిస్తాన్
2. పునా
3. జిమ్ యోంగ్
4. పంజాబ్ నేషనల్ బ్యాంక్
5. నాసా

బాలుడి కిడ్నాప్, హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవం

ప్రజాశక్తి - గుంటూరు లీగల్




అడిగిన సొమ్ము ఇవ్వలేదనే కక్షతో బాలుడిని హత్య చేసిన కేసులో ముగ్గురికి జీవితఖైదు, జరిమానా విధిస్తూ గుంటూరు నాలుగో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎ.లక్ష్మి తీర్పునిచ్చారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నక్కా శారదామణి కథనం తెలిపిన వివరాల ప్రకారం 2016 ఏప్రిల్ 14న జరిగిన ఘటనా వివరాలిలా ఉన్నాయి. ఏటి ఆగ్రహారం జీరోలైన్‌లో నివాసముంటున్న నన్నం జయకుమారి, నాగరాజులకు ఏకైక సంతానం యదిద్యరాజు(12). ఏటి ఆగ్రహారం 8వ లైన్‌లోని శంతన్ స్కూల్లో ఆరోతరగతి చదువుతున్నాడు. కారంపూడి మండలం చింతపల్లి గ్రామానికి చెందిన ముద్దాయి ఇరుగుల వీరవెంకట నాగ మణికంఠ అలియాస్ మణికంఠ అదే స్కూల్లో కేర్ టేకర్‌గా పనిచేస్తున్నాడు. మణికంఠ ముప్పాళ్ల మండలం బొల్లారం గ్రామానికి చెందిన రామిశెట్టి గోపి, చింతపల్లి గ్రామానికి చెందిన వేల్పుల పిచ్చయ్యను కలుపుకుని తేలికగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. తాను పనిచేస్తున్న స్కూల్లోనే ఆరోతరగతి విద్యార్థి యదిద్యరాజును కిడ్నాప్ చేశారు. అతడి తల్లికి ఫోన్ చేసి రూ.15 లక్షలు డిమాండ్ చేశారు. అంత ఇచ్చుకోలేమని వారు తెలపడంతో రూ.2లక్షలకు పిల్లవాడ్ని వదిలేసేటట్లు ఒప్పందం చేసుకున్నారు. ఈ విషయాన్ని బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు తెలిపారు. పోలీస్ వారి సూచనల మేరకు కిడ్నాపర్లు ఫోన్ చేసినప్పుడు వారి మాటలను రికార్డు చేయమని సూచించగా 15వ తేదీ కిడ్నాపర్లు ఫోన్ చేయగా రూ.15 లక్షలు ఇవ్వలేమని, రూ.1 లక్ష ఇస్తామని చెప్పడంతో వారు కుదరదని చెప్పడంతో చివరకు రూ.2 లక్షలు ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు. ఈ విషయం మొత్తాన్ని జయకుమారి ఫోన్‌లో రికార్డ్ చేసింది. గుంటూరు రైల్వే స్టేషన్‌లోని మాచర్ల ట్రైన్ ఆఖరి పెట్టెలో రూ.2 లక్షలతో తీసుకుని ప్రయాణించాలని కిడ్నాపర్లు కోరగా జయకుమారి అన్న రాజు రూ.2 లక్షలు తీసుకుని ట్రైన్‌లో నుంచి వారి కోరిన చోట నగదును పెట్టాడు. ట్రెయిన్‌లో గోపితో పోలీస్ వారు కూడా మఫ్టీలో ఉన్నారని తెలుసుకుని వారు ట్రెయిన్ నుంచి దూకి వెళ్లిపోయాడు.. అర్ధరాత్రి తరువాత యదిద్యరాజును కిడ్నాపర్లు కర్చీఫ్‌తో గొంతు నులిమి కాళ్లు చేతులు కట్టేసి, తాడుతో శరీరానికి బండరాయిని కట్టి కిరాతకంగా హత్యచేసి ఫిరంగిపురం మండలం 113 తాళ్లూరు పొలాల్లోని బావిలో పడేశారు. బావిలో ఉన్న మృతదేహాన్ని గుర్తించిన పొలం యజమా నులు పోలీస్ వారికి సమాచారమిచ్చారు. ఈ కేసులో 44 మంది సాక్షులను విచారించారు. నిందితులపై నేరం రుజువు కావడంతో పై మేరకు న్యాయమూర్తి ఎ.లక్ష్మి తీర్పు నిచ్చారు.

'శ్రీ తులసి' రైతులను ఆదుకోవాలని రాస్తారోకో

దళారీ శ్రీనివాసరావును అరెస్టు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-అద్దంకి



రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

శ్రీతులసి పంట వేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నకిలీ విత్తనాలు అంటగట్టి పరారైన దళారి శ్రీనివాసరావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బల్లికురవ, కొరిశపాడు, అద్దంకి, ముండ్లమూరు, గుంటూరు జిల్లా నూజెండ్ల మండలంలోని పలు గ్రామాల రైతులు గురువారం అద్దంకిలో రాస్తారోకో చేశారు. పట్టణంలోని బంగ్లారోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద శ్రీతులసి పంట రైతులతో కలసి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు కెవివి ప్రసాద్ సమావేశం నిర్వహించారు.

అనంతరం వారితో పాటు రాస్తారోకోలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ జైకిసాన్ సంస్థ పేరిట 'శ్రీతులసి పంట వేయండి ఏడాదిలో లక్ష రూపాయలు ఆదాయం పొందండి' అని హైదరాబాదుకు చెందిన శ్రీనివాసరావు మోసపూరితమైన అగ్రిమెంట్లను తయారు చేయించి రైతులకు అంటగట్టారన్నారు. 100 గ్రాముల ప్యాకెట్ రూ.1500, రూ.200 విలువ చేసే పురుగుమందులను రూ.1200కు అమ్మారని, పంట చేతికి రాలేదనీ, రైతులు లక్షల్లో నష్టపోయారనీ అంజిరెడ్డి అన్నారు. జనవరి 1 నుంచి శ్రీ తులసి పంట కోతలను మొదలు పెడదామని రైతులకు ఫోన్లో సమాచారం అందించారన్నారు. తీరా చెప్పిన సమయానికి రాకపోవడంతో రైతులు హైదరాబాదులోని శ్రీనివాసరావు ఇంటివద్దకెళ్లితే ఆయన ఖాళీ చేసివెళ్లినట్లు తేలిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హనుమారెడ్డి, అంజయ్య, పొనకా రామాంజనేయులు, మోంద్రు చినసుబ్బారావు, తంగిరాల వెంకటేశ్వర్లు, మన్నం త్రిమూర్తులు, ఇతర గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు పాల్గొన్నారు.

ప్రత్యేకం

30వేల టన్నుల చింతపండు సేకరణ

268 కేంద్రాల్లో కొనుగోలు ● ఆరు ఉత్పత్తులకు ధర నిర్ణయించని కేంద్రం

నామమాత్రపు ధర పెంచి చెల్లించాలని జిసిసి నిర్ణయం



ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో 30వేల టన్నుల చింతపండును గిరిజనుల నుంచి కొనుగోలు చేయాలని గిరిజన సహకార సంస్థ(జిసిసి) భావిస్తోంది. ఈ సీజన్లో చింతపండు సహా అటవీఫలసాయం, వ్యవసాయ ఆధారిత ఫలసాయం, ఉద్యానపంట సేకరణకు రాష్ట్ర వ్యాపితంగా 268 ప్రాథమిక కొనుగోలు కేంద్రా(పిపిసి)లు ఏర్పాటు చేస్తోంది. గిరిజనుల తెచ్చిన ఫలసాయాన్ని సంతల్లో కాకుండా ఏ గ్రామానికీ రెండు కిలోమీటర్ల దూరం మించకుండా, 10 నుంచి 12 గ్రామాలకు ఒక పిపిసి ఏర్పాటుకు జిసిసి సన్నాహాలు ప్రారంభించింది. గిరిజనులు తమ అటవీ ఉత్పత్తులు నడిచితెచ్చినా, వాహనాలపై తెచ్చిన పిపిసి కేంద్రానికి, తన గ్రామానికి మధ్య దూరం రెండు కిలోమీటర్లు దాటకుండా పిపిసి కేంద్రాలను గుర్తించారు. వారానికి కనీసం మూడు రోజులకు తక్కువ కాకుండా పిపిసి కేంద్రాలు పనిచేసేలా ప్రయత్నాలు ప్రారంభించారు. ఏజెన్సీ ప్రాంతంలోని పంట ఉత్పత్తులు, దిగుబడి ఆధారంగా ఎక్కువ రోజులు పిపిసిలు పనిచేసేలా కొనుగోలుకు అవసరమైన పరికరాలతో సహా ఇన్‌ఛార్జ్‌ను నియమించారు.

రాష్ట్రంలోని 13 జిల్లాల్లో మూడు మినహా విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమగోదావరి, కర్నూల్, ప్రకాశం, చిత్తూరు, నెల్లూరు, కడప జిల్లాలలకు జిసిసి సేవలు విస్తరించివున్నాయి. పది జిల్లాల్లో గిరిజనుల నుంచి అటవీ ఉత్పత్తులు, వ్యవసాయోత్పత్తుల కొనుగోలుకు 268 కేంద్రాలు అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ సీజన్లో గిరిజనుల నుంచి అత్యధికంగా సేకరించదగిన చింతపండుపై జిసిసి దృష్టిపెట్టింది. చింతపల్లి, పాడేరు, పార్వతీపురం, రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతాల నుంచి 30 వేల టన్నులు చింతపండు సేకరించాలని జిసిసి యోచిస్తోంది. రంపచోడవరం ఏజెన్సీ నుంచి పిక్కతీసిన చింతపండు ఐదువేల టన్నులు సేకరించనుంది. గతేడాది కేంద్రప్రభుత్వం చింతపండుకు కనీస మద్దతు ధర 18 రూపాయలు ప్రకటించడంతో గిరిజనులు జిసిసి కంటే ఎక్కువధర ఇచ్చిన ప్రయివేటు వ్యాపారులకు అమ్ముకున్నారు. సీజన్ చివరిలో కేజీ చింతపండుకు 30 రూపాయలు చెల్లించి వెయ్యి టన్నులు జిసిసి కొనుగోలు చేయగలిగింది.

ఈ ఏడాది సీజన్ ఆరంభం నుంచి చింతపండు కొనుగోలుపై దృష్టి పెడితే 30వేల టన్నులు సేకరించవచ్చని అధికారులు చెబుతున్నారు. కేంద్రం ప్రకటించిన కేజి చింతపండు ధర 31 రూపాయలకు రూపాయి పెంచి 32 రూపాయలు చెల్లించాలని జిసిసి నిర్ణయించింది. పిక్కతీసిన చింతపండుకు కేంద్రం 54 రూపాయలు ప్రకటించగా, ఆ ధరకు ఆరు రూపాయలు పెంచి జిసిసి 60 రూపాయలు చెల్లించనుంది. 20 ఉత్పత్తుల్లో ఆరు ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించనప్పటికీ జిసిసి వాటికి ధర నిర్ణయించింది. ఏడు ఉత్పత్తులకు కేంద్రం ప్రకటిత ధరను జిసిసి చెల్లించనుంది. ఏడింటికి నామమాత్రపు ధర పెంచి గిరిజనులకు జిసిసి చెల్లించనుంది.

అటవీ ఉత్పత్తులకు ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర, జిసిసి చెల్లించనున్న ధరల వివరాలు

ఫలసాయం	కేంద్రం ధర	జిసిసి ధర (కేజికి)
పిక్కచింతపండు	31	32
పిక్కతీసినచింతపండు	54	60
విప్పగింజలు	25	25
గానుగ గింజలు	19	19
కరయా జిగురు	98	98
గుగ్గిలం జిగురు	-	75
కొండగోగు జిగురు	-	200
కరక్కాయలు	15	15
ముషిణి గింజలు	36	46
ఇండుగ పిక్క	-	30
నల్లజీడి గింజలు	8	10
విప్ప పప్పు	17	17
అడవి తేనె	195	195
తేనె మైనం	-	120
శీకాయి	43	43
కుంకుడుకాయలు	12	15
కొండచీపుర్లు	30	45
నరమామిడి చెక్క	-	28
మారేడు గడ్డలు	-	300
ఎండిన ఉసిరిపప్పు	45	100

రాహుల్‌కు మహిళా కమిషన్ నోటీసులు

న్యూఢిల్లీ : రాఫెల్ కుంభకోణంపై ఇటీవల లోక్‌సభలో చర్చ సందర్భంగా రక్షణమంత్రి నిర్మలా సీతారామన్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీని జాతీయ మహిళా కమిషన్ కోరింది. ఈ మేరకు గురువారం నోటీసులు జారీ చేసింది. ఆయన వ్యాఖ్యలు మహిళల పట్ల గౌరవాన్ని కించపరిచేవిగా, అభ్యంతకరంగా ఉన్నాయని కమిషన్ వ్యాఖ్యానించింది. రాఫెల్ డీల్‌కు సంబంధించి ప్రశ్నలకు సమాధానం చెప్పలేని ప్రధాని మోడీ ఆ భారాన్ని ఒక మహిళపై మోపారని రాహుల్ అనడం సరికాదని పేర్కొంది.



చర్చలు । 2019లో జరగనున్న పార్లమెంటు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీల మధ్య సీట్ల పంపకం గురించి బుధవారం ఢిల్లీలో చర్చలు జరుపుతున్న రాహుల్‌గాంధి, శరద్‌పవార్

ఎనిమిదో తరగతి వరకు హిందీ తప్పని సరి..!

వార్తలను ఖండించిన జవదేకర్

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో ఎనిమిదో తరగతి వరకు హిందీ భాషను తప్పని సరి చేయాలని నూతన విద్యా విధానంలో(ఎన్ఇపి) భాగంగా ప్రభుత్వానికి తొమ్మిది మంది సభ్యులతో కూడిన కె. కస్తూరి రంగన్ కమిటీ ముసాయిదా నివేదిక సిఫార్సు చేసినట్లు వార్తలు వెలువడ్డాయి. ఆంగ్లం, ప్రాంతీయ, హిందీతో కలిపి మొత్తం మూడు భాషలను తప్పనిసరి చేయాలని, దేశ వ్యాప్తంగా మాథ్స్, సైన్స్ ఒకే సిలబస్ ఉండాలని నివేదిక సూచించినట్లు వెలువడుతున్న ఈ వార్తలను మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ ఖండించారు. గిరిజన మాండలికాల కోసం దేవనాగరి లిపిని అభివృద్ధి చేసి, నైపుణ్యం ఆధారంగా విద్యను ప్రోత్సహించాలని కస్తూరి రంగన్ కమిటీ సూచించినట్లు సమాచారం. పాఠశాల విద్యలో నేర్చుకునే శాస్త్రీయ వ్యవస్థను అమలు చేయడానికి ఈ కమిటీని గతంలో నియమించిన సంగతి తెలిసిందే. దీని గడువు గత నెలలో ముగియడంతో పూర్తి నివేదిక మానవ వనరుల మంత్రిత్వ శాఖకు అప్పగించనున్నట్లు సమాచారం. అయితే నివేదిక సిద్ధమైందని, దాన్ని సమర్పించేందుకు సమయం కేటాయించాలని కమిటీ కోరినట్లు అంతకముందు ఒక మీడియాకు ప్రకాశ్ జవదేకర్ తెలిపారు.



జస్టిస్ బేడి నివేదికను పిటిషనర్లకు ఇవ్వలేం

గుజరాత్ ఎన్‌కౌంటర్లపై పోలీసు అధికారి వెల్లడి

అహ్మదాబాద్ : గుజరాత్‌లో జరిగిన 17 పోలీసు ఎన్‌కౌంటర్లపై జస్టిస్ హెచ్.ఎస్.బేడి ఇచ్చిన నివేదికను పిటిషనర్లకు అందచేయలేమంటూ గుజరాత్ పోలీసు అధికారి ఒకరు సుప్రీం కోర్టుకు తెలిపారు. క్రిమినల్ దర్యాప్తు సందర్భంగా సేకరించిన సాక్ష్యాధారాలను విశ్లేషించడానికి కొత్తవారిని అనుమతించలేమని, వారికి నివేదికలు అందచేయలేమని ఆ అధికారి చెప్పారు. నివేదిక కాపీని పిటిషనర్లకు అందచేయాలని బుధవారం సుప్రీంకోర్టు గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రంలో జరిగిన ఒక ఎన్‌కౌంటర్ విషయంలో సుప్రీం కోర్టు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తును ఎదుర్కొన్న డిఎస్‌పి జె.ఎం.భర్వాద్ కోర్టుకు అందచేసిన అఫిడవిట్‌లో ఈ విషయం పేర్కొన్నారు. నివేదిక కాపీలను పిటిషనర్లకు అందచేసినట్లైతే పోలీసు అధికారుల తప్పు వుందా లేదా అనే విషయాలపై చర్చకు అవకాశం ఇచ్చినట్లవుతుందని అభిప్రాయపడ్డారు. ఇటువంటి ఆదేశాల వల్ల తనలాంటి అధికారులు ఇబ్బందులు పడతారని ఆయన పేర్కొన్నారు.

బెస్ట్ కార్మికులపై కక్షపూరిత చర్యలు మానండి

సిఐటియు, పియుసిఎల్ డిమాండ్

ముంబయి : గత మూడు రోజులగా సమ్మె చేస్తున్న బృహన్‌ముంబయి విద్యుత్ సరఫరా, రవాణా (బెస్ట్) సంస్థ ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాల్సింది పోయి వారిపై నిరంకుశమైన మెస్మా నిబంధనలను ప్రయోగించాలని చూడడం విచారకరమని పియుసిఎల్ మహారాష్ట్ర శాఖ పేర్కొంది. ఈ వార్తలు తమకు దిగ్భ్రాంతి కలిగించాయని ఒక ప్రకటనలో తెలిపింది. సమ్మె చేస్తున్న కార్మికులకు సంఘీభావాన్ని ప్రకటించింది. తక్షణమే సమ్మె చేస్తున్న కార్మికులతో చర్చలు జరపాల్సిందిగా బెస్ట్ యాజమాన్యాన్ని కోరింది. ముంబయిలో ప్రభుత్వ రవాణాను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. గురువారానికి బెస్ట్ కార్మికులు చేస్తున్న సమ్మె మూడవ రోజుకు చేరింది. తమను క్వార్టర్లు ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేయడంపై నిరసన తెలియచేస్తూ వాడాలా తూర్పు శివార్లలోని బెస్ట్ డిపో వద్ద 300మందికి పైగా కార్మిక కుటుంబాలు ధర్నా నిర్వహించాయి. అయితే సమ్మె చేస్తున్న 300 ఉద్యోగులపై మహారాష్ట్ర నిత్యావసర సేవల నిర్వహణా చట్టం (మెస్మా) నోటీసులను బెస్ట్ సంస్థ జారీ చేసింది. వీటిని ఉపసంహరించుకోవాలని ప్రజా పౌర హక్కుల యూనియన్ (పియుసిఎల్) మహారాష్ట్ర శాఖ డిమాండ్ చేసింది. బెస్ట్ క్వార్టర్లలో నివసిస్తున్న 2వేల మంది కార్మిక కుటుంబాలను ఖాళీ చేయాలంటూ ఇచ్చిన నోటీసులను కూడా ఉపసంహరించాలని కోరింది. ఈ సందర్భంగా బెస్ట్ కార్మిక సంఘం నేత శశాంక్ రావు మాట్లాడుతూ, తాము ఏ రాజకీయ పార్టీ వద్దకు వెళ్ళబోమని చెప్పారు. కఠోర శ్రమ చేసే కార్మికుల పోరాటమిదని అన్నారు. గురువారం బెస్ట్ డిపో నుండి ఒక్క బస్సు కూడా తిరగలేదు.

ముఖ్యమంత్రికి సిఐటియు లేఖ

బెస్ట్ యాజమాన్యం కక్షపూరిత చర్యల పట్ల సిఐటియు ఆందోళన వ్యక్తం చేసింది. వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని తక్షణమే కార్మికులకు జారీ చేసిన నోటీసులను ఉపసంహరించుకునేలా చూడాలని కోరింది.

ఆఫ్ఘన్‌తో బంధం భారత్‌కు ప్రాధ్యాత

ఆర్మీ చీఫ్ రావత్



న్యూఢిల్లీ : ఆఫ్ఘనిస్తాన్ వ్యవహారాల్లో భారత్‌కు ఆసక్తి వుందని, ఆ బంధం నుండి బయటకు రాదని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ గురువారం తెలిపారు. ఈ ప్రాంతంలో శాంతి సుస్థిరతల కోసం తాలిబన్‌ను కూడా చర్చలకు రప్పించడానికి అమెరికా నేతృత్వంలో జరుగుతున్న ప్రయత్నాలను ఈ సందర్భంగా ఉదహరించారు. ఆఫ్ఘనిస్తాన్ వ్యవహారాల పట్ల భారత్‌కు ఆసక్తి వున్నందున ఏదో రకంగా ప్రమేయం వుండి తీరాలని భావిస్తున్నట్లు ఆర్మీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వార్షిక పత్రికా సమావేశంలో ఆయన తెలిపారు. చర్చల్లో తాము కూడా పాల్గొనాల్సిందేనని, లేనిపక్షంలో ఏం జరుగుతోందనేది తెలియదని అన్నారు. తాలిబన్‌తో చర్చలు జరపకూడదనేది భారత్ సాంప్రదాయంగా పాటిస్తూ వచ్చిన పద్ధతని, ఆఫ్ఘన్ నేతృత్వంలో, ఆ దేశ పరిస్థితులకు అనువైన పరిష్కారం వుండాలనేది తమ కల అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో కాశ్మీర్‌లో వేర్పాటువాదులతో కేంద్రం ఎందుకు చర్చలు జరపదనేది ప్రశ్నగా మిగిలింది. అయితే ఈ విషయమై జనరల్ రావత్‌ను ప్రశ్నించగా, కాశ్మీర్‌లో పరిస్థితికి, ఆఫ్ఘన్‌లో పరిస్థితికి చాలా తేడా వుందని వ్యాఖ్యానించారు. అలాగే, గే సెక్స్‌ను సుప్రీంకోర్టు చట్టబద్ధం చేసినంత మాత్రాన భారత సైన్యంలోకి వాటిని అనుమతించమని ఆర్మీ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ స్పష్టం చేశారు. అయితే ఆర్మీ చట్టానికి వ్యతిరేకం కాదని చెప్పారు.

పొత్తులకు, పాత మిత్రులకు బిజెపి స్వాగతం


ప్రధాని నరేంద్రమోడీ



చెన్నయ్: త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఇతర రాజకీయ పార్టీలతో పొత్తులను, విడిపోయిన పాత మిత్రులను తాము స్వాగతిస్తామని ప్రధాని నరేంద్రమోడీ ప్రకటించారు. గురువారం ఆయన తమిళనాడులోని బూత్‌స్థాయి కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ 90వ దశకంలో మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి విజయవంతమైన సంకీర్ణ రాజకీయాలను నిర్వహించారని గుర్తు చేశారు. అటువంటి సంకీర్ణ రాజకీయాల కోసం బిజెపి తలుపులు ఎప్పుడూ తెరిచే వుంటాయన్నారు. రెండు దశాబ్దాల క్రితం సంకీర్ణ రాజకీయాలను విజయవంతంగా నిర్వహించిన అప్పటి ప్రధాని వాజ్‌పేయి భారత రాజకీయాల్లో కొత్త సంస్కృతికి తెరతీశారని మోడీ గుర్తు చేశారు. ఆయన ప్రాంతీయ ఆకాంక్షలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారని, అటల్‌జీ చూపిన మార్గాన్ని బిజెపి అనుసరిస్తోందని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని అధికార అన్నాడిఎంకె లేదా ప్రతిపక్ష డిఎంకె, సినీ నటుడు రజనీకాంత్ ఏర్పాటుచేయనున్న పార్టీలలో దేనితో కలిసి పనిచేస్తారని ఒక కార్యకర్త సంధించిన ప్రశ్నకు బదులిస్తూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో తమిళనాడులో ఆరు పార్టీలతో పొత్తు పెట్టుకుని పోరాడిన బిజెపి కేవలం రెండు స్థానాలను మాత్రమే దక్కించుకున్న విషయం తెలిసిందే. ఇందులో ఒకటి కాషాయ పార్టీకే దక్కగా, మిత్రపక్షమైన పిఎంకె మరో స్థానాన్ని దక్కించుకుంది. అయితే తరువాత మిగిలిన ఐదు పార్టీలు బిపితో సంబంధాలను తెగతెంపులు చేసుకున్నాయి. బలమైన ఎన్డీయే మన విశ్వాసానికి ఆభరణం వంటిదని ప్రధాని వ్యాఖ్యానించారు. తమతో పొత్తుకు తాము ఎవరినీ బలవంతం చేయబోమన్నారు. బిజెపి సొంతంగా మెజార్టీ సాధించినప్పటికీ మిత్రపక్షాలతో కలిసే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. తాము పాత మిత్రులను కూడా స్వాగతిస్తున్నామని, తమ తలుపులు ఇతర రాజకీయ పార్టీలకు ఎల్లపుడూ తెరిచే వుంటాయని మోడీ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ప్రాంతీయ పార్టీలను చిన్నచూపు చూసిందని, అటల్‌జీ అందుకు విరుద్ధంగా వారి ఆకాంక్షలకు పెద్దపీట వేశారని వివరించారు.

విద్యుత్ కంపెనీల మాయాజాలం

- దివాలా కంపెనీల అప్పులు రూ.31,500 కోట్లు
- వీటిని అదానీ గ్రూప్‌కు బదిలీకి బ్యాంకులు ఒకే..
- అప్పుల్లో చాలా భాగం మాఫీ
- అదానీ సంస్థలూ అప్పుల్లోనే..



న్యూఢిల్లీ : అప్పుల ఊబిలో కూరుకుపోయి దివాలా ప్రక్రియకు చేరువైన విద్యుత్ కంపెనీలు ఆస్తుల్ని అమ్ముకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. వీటిలో 7 కంపెనీల అప్పుల విలువ రూ.74,000 కోట్లు. కాగా, రుణదాతలకు నేతృత్వం వహిస్తున్న ఎస్‌బిఐ మూడు ప్రాజెక్ట్‌ల్ని అదానీ గ్రూప్‌నకు బదిలీ చేయడానికి అంగీకారం తెలిపినట్టు అధికార వర్గాల సమాచారం. అదానీ గ్రూప్ ద్వారా రుణపరిష్కారానికి అంగీకరించిన కోస్టల్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ రూ.6132 కోట్లు, కెఎస్‌కె మహానది పవర్ లిమిటెడ్ రూ.17,194 కోట్లు, జీఎంఆర్ ఛత్తీస్‌గఢ్ ఎనర్జీ లిమిటెడ్ రూ.8174 కోట్లమేర బ్యాంకులకు రుణాలు తీర్చలేక చతికిలపడ్డాయి. సమాధాన్(ఆస్తుల నిర్వహణ,రుణ నిర్మాణంలో మార్పు) పథకం కింద అదానీ గ్రూప్‌తో ఈ మూడు కంపెనీలు తమ రుణాలను పరిష్కరించుకోనున్నట్టు చెబుతున్నారు. ఈ మూడు కంపెనీల అప్పుల మొత్తం విలువ రూ.31,500 కోట్లు. ఈ పథకం కింద రుణాల్ని పరిష్కరించగల, పరిష్కరించ సాధ్యంకాని అప్పులుగా వర్గీకరిస్తారు. పరిష్కరించగల భాగాన్ని నూతన యాజమాన్యం చెల్లించాల్సి ఉంటుంది. సాధ్యంకాని భాగాన్ని ఈక్విటీగా మారుస్తారు. మిగతా కంపెనీలు కూడా జనవరి 31 వరకల్లా రుణ పరిష్కారానికి రానున్నట్టు తెలుస్తోంది.

అయితే,ఈ మూడు కంపెనీల్ని కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చిన అదానీ గ్రూప్ కూడా విద్యుత్ ప్రాజెక్టుల విషయంలో అప్పుల ఊబిలో కూరుకుపోవడం గమనార్హం. పార్లమెంటరీ కమిటీ నివేదిక ప్రకారం బొగ్గు ఆధారిత 34 విద్యుత్ ప్రాజెక్టులు అప్పులు చెల్లించలేని స్థితిలో ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల మొత్తం అప్పుల విలువ రూ.లక్షా 77 వేలకోట్లు అని కమిటీ తెలిపింది. ఈ ప్రాజెక్టులు నిధుల కొరత, విద్యుత్ అమ్మకాల ఒప్పందాలను అమలు చేయలేకపోవడం, ఇంధన భద్రత లేకపోవడంలాంటి తీవ్ర సమస్యలనెదుర్కొంటున్నట్టు కమిటీ తన నివేదికలో స్పష్టం చేసింది. కమిటీ నివేదికలోని 34 విద్యుత్ ప్రాజెక్టుల్లో అదానీ పవర్ మహారాష్ట్ర లిమిటెడ్ రూ.11765 కోట్లు, అదానీ కోస్ట్రా వెస్ట్ రూ.3099 కోట్లు బ్యాంకులకు రుణాలు చెల్లించాల్సి ఉన్నట్టు పేర్కొనడం గమనార్హం.

విద్యుత్ కంపెనీల అప్పుల వ్యవహారమిపుడు సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నది. గతేడాది ఫిబ్రవరిలో దేశంలోని బ్యాంకులన్నిటికీ ఆర్‌బీఐ ఓ సర్క్యులర్ జారీ చేసింది. దాని ప్రకారం రూ.2000 కోట్లకుపైగా అప్పులు చెల్లించలేకపోయిన కంపెనీలను 180 రోజుల(ఆరు నెలలు) సమయమిచ్చి ఆ తర్వాత దివాలా ప్రక్రియను ప్రారంభించాలని ఆర్‌బీఐ ఆదేశించింది. దాంతో, జీఎంఆర్ ఎనర్జీ, రత్తన్ ఇండియా పవర్, గుజరాత్‌కు చెందిన షిప్ బిల్డింగ్ అసోసియేషన్‌సహా పలు కంపెనీలపై నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌కు చెందిన ఆయా రాష్ట్రాల కోర్టుల్లో కేసులు నమోదయ్యాయి. తమపై దివాలా చట్టం కింద చర్యలు తీసుకోకుండా పలు కంపెనీలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దాంతో, బ్యాంకులను ఈ కేసుల్లో ముందుకు వెళ్లకుండా సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆర్‌బీఐ సర్క్యులర్ కింద నమోదైన కేసులన్నిటినీ తమకు బదిలీ చేయాల్సిందిగా ట్రిబ్యునల్ కోర్టులను సుప్రీంకోర్టు ఆదేశించింది. రుణాల ఎగవేతకు పాల్పడుతున్న విద్యుత్ కంపెనీలపై కఠిన చర్యలకు సిద్ధమైనందునే ఆర్‌బీఐలోని కొందరు అధికారులతో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం విభేదించినట్టు విమర్శలున్నాయి. ఆర్‌బీఐ మాజీ గవర్నర్ ఉర్జిత్ పటేల్‌పై కేంద్రం ఒత్తిడి వల్లే ఆయన తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చిందని ప్రధాని మోడీపై ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.

నకిలీ వార్తలను షేర్ చేసేది పెద్దలే..

న్యూయార్క్ : ఫేస్‌బుక్ వంటి సామాజిక మీడియాల్లో నకిలీ వార్తలను యువకుల కంటే పెద్ద వయస్కులే ఎక్కువగా షేర్ చేస్తున్నట్లు ఒక అధ్యయనంలో వెల్లడయింది. న్యూయార్క్ యూనివర్శిటీ, ప్రిన్సెటన్ యూనివర్శిటీ విద్యార్థులు చేసిన ఈ అధ్యయనాన్ని సైన్స్ అడ్వాన్స్ అనే జర్నల్ ప్రచురించింది. మిగిలిన వారితో పోలిస్తే 65 ఏళ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉందని అధ్యయనం తెలిపింది. నకిలీ వార్తలను షేర్ చేస్తున్న వారిలో 18 నుంచి 29 ఏళ్ల వయస్సు వారు 3 శాతం ఉండగా, 65 ఏళ్లకు పైబడిన వారు 11 శాతం ఉన్నట్లు వెల్లడించింది. నకిలీ వార్తలను ప్రసారం చేయడంలో విద్య, ఆదాయం, స్త్రీ-పురుషుల వంటి అంశాలకు ప్రాధాన్యత లేదని అధ్యయనం తెలిపింది. అలాగే 2016లో అమెరికా అధ్యక్ష ఎన్నికల సందర్భంగా డెమొక్రాట్స్ (14 శాతం) కంటే రిపబ్లికన్లు (18 శాతం) అధికంగా నకిలీ వార్తలను షేర్ చేశారని అధ్యయనం పేర్కొంది.

అస్సాంలో కొనసాగుతున్న నిరసనలు

గౌహతి : కేంద్రం ఇటీవల తీసుకుని వచ్చిన పౌరసత్వ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా అస్సాంలో నిరసనలు కొనసాగుతున్నాయి. దీంతో గురువారం కూడా రాష్ట్రంలో సాధారణ జన జీవనం స్తంభించింది. ఈ బిల్లుకు వ్యతిరేకంగా విద్యార్థులు, న్యాయవాదులు, డాక్టర్లు గళమెత్తారు. గౌహతి మెడికల్ కాలేజ్ ఆసుపత్రి వైద్యులు నల్ల బాడ్జీలతో విధులను నిర్వహించారు. ముఖ్యమంత్రి సర్బానంద సోనావల్ స్వగ్రామంలోని ఆయన నివాసం వద్ద నిరసనకారులు ఆందోళనకు దిగారు. వాహనాలను దగ్ధం చేశారు. దీంతో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. రాష్ట్రంలో అనేక విద్యా సంస్థల్లో విద్యార్థులు తరగతులను బహిష్కరించారు. ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ 11 గంటల బంద్‌కు గురువారం పిలుపు ఇచ్చింది. దీనికి ఇతర యూనియన్లు కూడా మద్దతు ఇచ్చాయి. కాగా, రాష్ట్రంలోని బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వానికి అసోం గణ పరిషత్ (ఎజిపి) తన మద్దతును ఉపసంహరించుకుంది. బుధవారం ఎజిపి మంత్రులు తమ పదవులకు రాజీనామా చేశారు. రాష్ట్రంలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఎజిపి డిమాండ్ చేస్తోంది.

మంజిత్ సింగ్‌పై కేసు నమోదు

న్యూఢిల్లీ : అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలపై డిఎస్‌జిఎంసి(ఢిల్లీ సిక్కు గురుద్వారా మేనేజ్‌మెంట్ కమిటీ) మాజీ అధ్యక్షుడు మంజిత్ సింగ్‌పై జిల్లా కోర్టు ఆదేశాల మేరకు పోలీ సులు గురువారం ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కమిటీకి సంబంధించి ఒక స్వతంత్ర్య సభ్యుడు గుర్మీత్ సింగ్ డిసెంబర్‌లో ఈ పిటిషన్ దాఖలు చేశారు. విచారించిన మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ మంజిత్ సింగ్, మాజీ జాయింట్ సెక్రటరీ అమర్‌జీత్ సింగ్, మేనేజర్ హర్జిత్‌సింగ్ సుభేదార్‌పై కేసు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మంజిత్ సింగ్ అధ్యక్షుడిగా ఉన్న శిరోమణి అకాళీదల్ పార్టీ ఢిల్లీ శాఖను అధిష్టానం రద్దు చేసింది.

అయోధ్య కేసు : కొన్ని వివరాలు...



- **డిసెంబర్ 22, 1949 :** బాబ్రీ మసీదులో రాముని విగ్రహాన్ని హిందూత్వ శక్తులు ప్రతిష్ఠించడంతో కేసు నమోదైంది.
- **1950 :** ప్రార్థనలు చేసే హక్కును రక్షించాలని, విగ్రహాలను పెట్టి, పూజలు కొనసాగించేందుకు అనుమతినివ్వాలని స్థానిక జిల్లా కోర్టులో రెండు పిటిషన్‌లు నమోదయ్యాయి. అయితే కోర్టు యథాతథ స్థితిని ప్రకటించింది.
- **1959 :** ఆ భూమిపై తమకు హక్కును కల్పించాలని కోరుతూ నిర్మోహి అకారా తరుపున మూడవ పిటిషన్ దాఖలు చేసింది.
- **1961 :** ఆ స్థలంపై తమకు స్వాధీన హక్కును కల్పించాలని కోరుతూ యుపి సున్నీ వక్ఫ్ బోర్డు తరుపున నాల్గవ పిటిషన్ దాఖలైంది.
- **1986 :** తాళాలను తొలగించి, రామునికి పూజలు నిర్వహించాలని జిల్లా న్యాయమూరి తీర్పునిచ్చారు.
- **1989 :** ఈ నాలుగు పిటిషన్‌లు అలహాబాద్ హైకోర్టుకు బదిలీ అయ్యాయి. స్థల స్వాధీనంపై రామ్ లల్ల విరాజ్మాన్ పేరుతో ఐదవ పిటిషన్ నమోదైంది.
- **1991 :** హిందూత్వ శక్తుల కోసం మసీదు చుట్టూ ఉన్న భూమిని స్వాధీనం చేసుకునేందుకు బిజెపి నేతృత్వంలోని యుపి ప్రభుత్వం ప్రయత్నించింది.
- **డిసెంబరు 6, 1992 :** బాబ్రీమసీదును హిందూత్వ మూకలు కూల్చి వేశాయి. కూల్చివేతకు పాల్పడటంతో పాటు దీనికి ప్రేరేపించినందుకు అద్వానీ, జోషి, ఇతర నేతలపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి.
- **1993 :** ఒక చట్టం ద్వారా వివాదాస్పద ప్రదేశంతో సహా 67 ఎకరాల భూమిని కేంద్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.
- **1994 :** స్థల స్వాధీనంపై ఇస్మాయిల్ ఫరూకీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది.
- **2001 :** అద్వానీపై దాఖలైన కేసును ప్రత్యేక జడ్జి కొట్టివేయగా..ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన రివ్యూ పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు కొట్టివేసింది.
- **2010 :** 2.77 ఎకరాల వివాదాస్పద భూమిని సున్ని వక్ఫ్‌బోర్డ్, నర్మోహి అకారా, రామ్‌లల్లాలకు సమాన భాగాలుగా పంచుకోవాలని అలహాబాద్ హైకోర్టు తీర్పునిచ్చింది.
- **2011 :** ఈ తీర్పు సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు.
- **2017 :** అద్వానీతో పాటు మరో 13 మందిపై దాఖలైన పిటిషన్‌పై సుప్రీం విచారణ చేపట్టింది.
- **సెప్టెంబరు 2018 :** 1994 నాటి ఫరూఖీ తీర్పును పునర్‌సమీక్షించాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీం తోసిపుచ్చింది.
- **అక్టోబర్ 2018 :** తక్షణ విచారణ చేయాలంటూ దాఖలైన పిటిషన్‌ను తోసిపుచ్చిన సుప్రీం జనవరి 2019లో విచారణ ప్రారంభించనున్నట్లు పేర్కొంది.
- **4 జనవరి 2019 :** విచారణ తేదీని జనవరి 10న వెల్లడిస్తామని ఐదుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం తెలిపింది.
- **10 జనవరి 2019 :** ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం నుండి యుయు లలిత్ వైదొలగడంతో విచారణను జనవరి 29కి వాయిదా వేసింది.

లాలూ బెయిల్ పిటిషన్ కొట్టివేత

పాట్నా : పశుదాణా కుంభకోణంలో ఆర్‌జెడి అధ్యక్షుడు లాలూప్రసాద్ యాదవ్ బెయిల్ అభ్యర్ధనను జార్ఖండ్ హైకోర్టు గురువారం తిరస్కరించింది. అనారోగ్యం, రానున్న ఎన్నికల దృష్ట్యా బెయిల్ మంజూరు చేయాలని డిసెం బర్ 11న లాలూ తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు ఈ మేరకు తీర్పు వెల్లడించింది. ఈ కేసులో ఏడాదిపాటు జైలుశిక్ష అనుభవించిన లాలూ ప్రస్తుతం వైద్య పరీక్షల నిమిత్తం రాంచీలోని ఒక ఆసుపత్రిలో చేరారు. హైకోర్టు నిర్ణయంపై తాము సుప్రీం కోర్టును ఆశ్రయించనున్నట్లు ఆర్‌జెడి అధికార ప్రతినిధి శక్తి యాదవ్ వెల్లడించారు. దుమ్కా, ధియోగర్, చాయ్‌బాసా ట్రెజరీల నుంచి నిధులు అక్ర మంగా డ్రా చేసిన కేసులో లాలూ డిసెంబర్ 23, 2017 నుంచి శిక్ష అనుభవిస్తున్నారు.

యుపిలో పోలీస్ స్టేషన్ ఎదుటే హత్య

లక్నో : భూ వివాదంపై మొదలైన వాగ్వాదం ముదిరి ఒక వ్యక్తి హత్యకు కారణమైన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని మిరాజ్‌పూర్‌లో గురువారం చోటుచేసుకుంది. ఈ హత్య స్థానిక పోలీస్ స్టేషన్ ఎదురుగానే జరగడం గమనార్హం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్ ఎదురుగా త్రిలోకి మాలి అనే వ్యక్తి తన షాపులో కూర్చొని ఉండగా..సంజయ్ సింగ్ అనే మరో వ్యక్తి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో త్రిలోక్ మృతిచెందగా, సునీల్ అనే మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ హత్య కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రత్యేకం

ప్రజలపై 'ఆవు' పన్ను

గోశాలలకు కోట్లాది రూపాయలు కేటాయిస్తున్న వైనం

యుపి ప్రభుత్వ నిర్వాకం



కాన్పూరు : ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో 'ఆవు' అనే జంతువు ప్రభుత్వ విధానాలను నిర్ణయించే స్థాయికి ఎదిగిందని మాజీ ప్రభుత్వ అధికారి, ప్రముఖ విశ్లేషకులు అవయ్ శుక్లా తెలిపారు. ప్రస్తుత కరువు పరిస్థితుల్లో రాష్ట్ర బిజెపి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల పాలిట భారంగా మారుతున్నాయన్నారు. ఉపయోగం లేని పశువులను తీసుకొచ్చి వాటి పోషణ పేరుతో కోట్లాది రూపాయలు వ్యయం చేస్తూ, ఆ ఖర్చును కూడా అదనపు పన్నుల రూపంలో ప్రజలపై వేస్తున్నారు. దీనికి తోడు అటువంటి పశువులపై వివిధ రూపాల్లో ఆధారపడిన వారు లక్షల మంది ఉపాధి కోల్పోతున్నారని వెల్లడించారు.

2007-12 గణంకాల ప్రకారం రాష్ట్రంలో దాదాపు 6.46 కోట్ల ఆవులు, గేదెలు ఉన్నాయి. సంవత్సరానికి సరాసరిన 64 లక్షల మగ దూడలు పుడుతుండగా, 60 లక్షల ఆవులు ఒట్టి పోవడమో లేక చనిపోవడమో జరుగుతోంది. ఈ లెక్కన సంత్సరానికి 1.2 కోట్లకు పునరుత్పత్తి లేకుండా పోతుంది. ఈ పశువులన్నీ రైతులకు సంబంధించినవి, ఒట్టిపోయిన అనంతరం వాటిని పోషించలేని వారు అమ్మటం, లేదా మాంసం దుకాణాలకు తరలించేవారు. దీనిద్వారా వాటి విలువలో నాలుగో వంతైనా పొందేవారు. అనంతరం ఆ డబ్బుతో మరో ఆవును కొనుగోలు చేసి దాని ద్వారా ఆదాయం పొందేవారు. ఇది ఎన్నో సంవత్సరాలుగా సాగుతున్న ఆర్థిక క్రమం. అయితే ప్రభుత్వం ఒట్టిపోయిన ఆవుల విషయంలో విధించిన నిషేదంతో రైతుల సామాజిక, ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా మారాయని శుక్లా వెల్లడించారు. దేశంలో తోళ్ల పరిశ్రమకు లక్షా పది వేల కోట్ల రూపాయల మార్కెట్ ఉంది. గత రెండు సంవత్సరాల్లో ఈ పరిశ్రమ దాదాపు 40 శాతం నష్టపోయింది. ఆగ్రాలోనే సంవత్సరానికి 10 లక్షల చెప్పుల జతలు తయారవుతాయి. కాన్పూ రులో 5 డజన్ల తోలు శుద్ధి పరిశ్ర మలు ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఈ రెండు పరిశ్రమల్లో దాదాపు 35 లక్షల మంది ఉపాధి కోల్పోనున్నారని ఆయన తెలిపారు.

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బిజెపి లక్ష్యాలను అనుగుణంగా ఉండవచ్చేమో కానీ దీని వలన సంబంధిత ప్రజల ఆర్థిక పరిస్థితితో అనేక మార్పులు చేసుకుంటున్నాయనేది వాస్తవం. జెఎన్‌యు ప్రొఫెసర్, ఆర్థికవేత్త వికాస్ రావల్ దీనిపై జనవరి 2017న ఒక వ్యాసం కూడా రాశారు. దేశంలో ఉన్న 27 కోట్ల పునరుత్పత్తి లేని పశువులను పోషించాలంటే సంవత్సరానికి దాదాపు రూ.5,4 లక్షల కోట్లు అవసరమవుతాయని ఆయన పేర్కొన్నారు. ఇది రక్షణ శాఖ బడ్జెట్‌కు 5 రెట్లు ఉంది. వాటికి ఆశ్రయం కల్పించా లంటే 5 లక్షల ఎకరాలు అవసరం. దీనికి తోడు అన్ని పశువులకు సరిపడా దాణా, నీళ్లు కూడా లేవన్నారు. ఈ లెక్కన ఒక ఆవు లేదా గేదెను పోషించాలంటే సంవత్సరానికి 30 నుంచి 40 వేల రూపాయలు ఖర్చవుతాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఎటువంటి ఆదాయం లేని పశువులపై రైతులు ఇంత వ్యయం చేయలేరు. అందువలన వాటిని అమ్మడమో, వదిలేయడమో చేస్తున్నారు. దీని వలన అవి పంటలను పాడుచేస్తున్నాయి. దీంతో రైతులు పశువులను తీసుకొచ్చి పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పోలీసు స్టేషన్లలో వేసి తాళాలు వేస్తున్నారు. ఈ పశువులతో గోశాలలు నడిపేందుకు ప్రభుత్వం పెద్ద జిల్లాకు అయితే రూ.10 కోట్లు, చిన్న జిల్లాకు అయితే రూ.1.5 కోట్లు కేటాయిం చింది. ఎక్సైజ్, హైవే టోల్ ఫీజు తదితరాలపై అదనపు పన్నుల రూపంలో ఇప్పుడు ఆ భారాన్ని తిరిగి రైతులు, ప్రజలపై మోపుతున్నది. ఆవుల పట్ల తమ విశ్వాసాన్ని చూపించుకోవాలంటే వేరే మార్గాలను ఎంచుకోవాలే తప్ప రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సంక్షోభంలోకి నెట్టే చర్యలకు పూనుకోవడం ముఖ్యమంత్రికి తగదని అవయ్ శుక్లా తెలిపారు. ఈ కార్యక్రమంతో సిఎం యోగికి చెందిన గోరఖ్‌పూర్‌కు చెందిన తప్పిపోయిన ఆవులు తిరిగి వస్తాయే తప్ప ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదని ఆయన ఎద్దేవా చేశారు.



యెమెన్‌లో డ్రోన్ దాడి

అయిదుగురి మృతి

యెమెన్: యెమెన్‌లో అమెరికా- సౌదీ అరేబియా అండతో హౌతి తిరుగుబాటుదారులు గురువారం జరిపిన డ్రోన్ దాడిలో అయిదుగురు సైనికాధికారులు మరణించారని, మరో 20 మంది సైనిక ఉన్నతాధికారులకు గాయాలయ్యాయని స్థానిక మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది. ఈ దాడిలో యెమెన్ సైన్యాధిపతి, ఇతర ముఖ్య అధికారులకు గాయాల పాలయ్యాయని మీడియా తెలియజేసింది. యెమెన్ దక్షిణ ప్రాంతంలో వున్న లాహిజ్ ప్రావిన్స్‌లోని అల్ అనాద్ వైమానిక స్థావరంలో జరుగుతున్న సైనిక కవాతు లక్ష్యంగా ఈ డ్రోన్ దాడి జరిగినట్లు తెలుస్తోంది.

అమెరికా జోక్యాన్ని తిప్పికొట్టిన వెనిజులా

బొలీవియా అధ్యక్షుడు ఎవో మొరేల్స్

కారకస్ : అమెరికా జోక్యందారీ విధానాలను వెనిజులా విజయవంతంగా తిప్పికొట్టిందని బొలీవియా అధ్యక్షుడు ఎవో మొరేల్స్ వ్యాఖ్యానించారు. కారకస్‌లోని మిలటరీ అకాడమీలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మొరేల్స్ మాట్లాడుతూ, అమెరికా ఆంక్షలను, జోక్యందారీ ఎత్తుగడలను వెనిజులా ఓడించిందని, ఈ విషయంలో బొలివారియా జాతీయ సాయుధ బలగాలు (ఎఫ్ఎఎన్‌బి) పట్ల తనకు గల గౌరవాన్ని వ్యక్తం చేస్తున్నానని, విప్లవ, ప్రగతిశీల శక్తులను అభినందిస్తున్నానని చెప్పారు. వెనిజులాలో సుసంపన్నమైన ఖనిజ వనరులను ఎలాగైనా కైవసం చేసుకోవాలన్న ఉద్దేశ్యంతోనే అమెరికా సైనిక బెదిరింపులకు పాల్పడిందని అన్నారు. ఈ వనరుల పరిరక్షణ కోసం ప్రజలు పోషించిన కీలక పాత్రను ఆయన ప్రశంసించారు. వెనిజులాకు బొలీవియా మద్దతు ఎల్లప్పుడూ వుంటుందని పునరుద్ఘాటించారు. వెనిజులా ఎప్పటికీ ఒంటరి కాదని, తామందరమూ అండగా వుంటామని స్పష్టం చేశారు. క్యూబన్లు 50ఏళ్ళు సాగించిన పోరాటాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. బొలివారియన్ యూనివర్శిటీ ఇచ్చిన ప్రతిష్టాత్మకమైన డాక్టరేట్ అవార్డును స్వీకరిస్తూ మొరేల్స్ మాట్లాడారు.



వలసలపై అంతర్జాతీయ ఒప్పందానికి తూట్లు

- బ్రెజిల్ కొత్త ప్రభుత్వం వింత పోకడ

బ్రసీలియా : వలసలకు సంబంధించిన అంతర్జాతీయ ఒప్పందం నుండి వైదొలగుతున్నట్లు బ్రెజిల్ కొత్త ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఐక్యరాజ్య సమితికి బోల్సనారో ప్రభుత్వం తెలియజేసినట్లు మీడియా వెల్లడించింది. డిసెంబరులో అప్పటి మైఖేల్ టెమర్ ప్రభుత్వం ఈ ఒప్పందంపై సంతకాలు చేసింది. ఈ సమాచారం పట్ల ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది. వలసలు, అంతర్జాతీయ సహకారం, మానవ హక్కులు వంటి విషయాల్లో కొత్త ప్రభుత్వ వైఖరి ఎలా వుందనేది దీంతో తెలుస్తోందని పాలో వార్తాపత్రిక పేర్కొంది. ఈ నిర్ణయం గురించి సంబంధిత పక్షాలకు తెలియ చేయాల్సిందిగా బ్రెజిల్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో కోరింది. భద్రత, వృద్ధులు, శరణార్ధుల కోసం కుదుర్చుకున్న ఈ ఒప్పందం నుండి కొత్త ప్రభుత్వం వైదొలగుతుందని ఇతర పక్షాలకు కూడా తెలియచేయాలని ఆ ప్రకటన పేర్కొంది. ఈ ఒప్పందానికి లేదా అమలుకు సంబంధించి ఏ కార్యక్రమంలోనూ బ్రెజిల్ పాల్గొనబోదని కూడా స్పష్టం చేసింది. వలసలు అడ్డుకునేందుకు ట్రంప్ తరహాలోనే బోల్సనారో ప్రభుత్వం నడుస్తోంది.

చర్చల నుంచి ట్రంప్ వాకౌట్

- సమయం వృథా తప్ప ఒరిగేదేమీ లేదని వ్యాఖ్య
- 20వ రోజుకు చేరిన షట్‌డౌన్

వాషింగ్టన్: గత పందొమ్మిది రోజులుగా కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్‌కు తెర దించేందుకు జరిగిన చర్చల నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం వాకౌట్ చేశారు. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింది. సరిహద్దు గోడ నిర్మాణానికి 570 కోట్ల డాలర్ల నిధులివ్వడానికి డెమొక్రాట్లు తిరస్కరించడంతో ట్రంప్ అర్ధాంతరంగా చర్చల నుంచి వాకౌట్ చేశారు. ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసి, సెనేట్‌లో డెమొక్రాటిక్ పార్టీ నాయకుడు చుక్ షూమర్‌తో చర్చలు జరపడం వల్ల సమయం వృథా తప్ప ఉపయోగమేమీ లేదని వాకౌట్ చేసిన అనంతరం ట్రంప్ ట్వీట్ చేశారు. చర్చల్లో నాన్సి పెలోసిని సరిహద్దు గోడకు నిధులు ఇస్తున్నారా అని అడిగాను. అందుకు ఆమె నో అని చెప్పారు. ఆ వెంటనే తాను ఆమెకు బై చెప్పానని ట్రంప్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ట్రంప్ టెంపర్ తంత్రం వల్లే చర్చలు విఫలమయ్యాయని డెమొక్రాటిక్ పార్టీ నాయకులు విమర్శించారు. ట్రంప్ వ్యవహార తీరు అమెరికా అధ్యక్ష స్థానం హుందాతనానికే అప్రతిష్ట తెచ్చేదిగా వుందని ప్రతిపక్షాలు విమర్శించాయి. చర్చలు విఫలం కావడంతో ప్రభుత్వ షట్‌డౌన్ 20వ రోజుకు చేరింది. సరిహద్దు గోడపై తరువాత ఆలోచించవచ్చు, ముందు ఈ షట్ డౌన్‌కు తెరదించుదామని తాము చేసిన విజ్ఞప్తిని ట్రంప్ తిరస్కరించారని, సరిహద్దు గోడపై మంకు పట్టుపట్టారని డెమొక్రాట్స్ ఆరోపిస్తున్నారు. అమెరికా-మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మిస్తానంటూ ట్రంప్ తన అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో హామీలు గుప్పించిన విషయం తెలిసిందే.




ట్రంప్‌పై కోర్టుకెక్కిన కార్మిక సంఘాలు

గత మూడు వారాలుగా కొనసాగుతున్న ప్రభుత్వ షట్‌డౌన్ వ్యతిరేకిస్తూ అమెరికా కార్మిక, ఉద్యోగ సంఘాలు సుప్రీంకోర్టులో గురువారం పిటిషన్‌ను దాఖలు చేశాయి. సరిహద్దు గోడ నిర్మాణంపై అధ్యక్షుడు ట్రంప్ అనుసరిస్తున్న మొండి వైఖరితో దాదాపు నాలుగు లక్షల మందికి పైగా ఫెడరల్ ఉద్యోగులు గత నెల 22 నుండి వేతనాలకు దూరమయ్యారని నేషనల్ ట్రెజరీ ఎంప్లాయీస్ యూనియన్ (ఎన్‌టిఇయు) ఆందోళన వ్యక్తంచేసింది. ఈ ప్రతిష్టంభనకు తెరదించి ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ ఎన్‌టిఇయు మంగళవారం అమెరికా ప్రభుత్వంపై పిటిషన్ దాఖలు చేసినట్లు అమెరికన్ మీడియా తన వార్తా కథనాలలో వెల్లడించింది.

కాంగో కొత్త అధ్యక్షుడిగా ఫెలిక్స్

- ఎన్నిక బూటకం: ఫయులు
- అనుమానాలున్నాయి : ఫ్రాన్స్, బెల్జియం



కిన్షాసా : కాంగో కొత్త అధ్యక్షుడిగా ప్రతిపక్ష నేత ఫెలిక్స్ షికెడి విజయం సాధించారు. ఫెలిక్స్ ఎన్నికను కుట్రగా రెండో స్థానంలో నిలిచిన మరో అభ్యర్థి మార్టిన్ ఫయులు ఆరోపించారు. 1960లో కాంగో స్వాతంత్ర్యం సాధించిన తరువాత ప్రతిపక్ష అభ్యర్థి అధ్యక్షుడిగా ఎన్నికవడం ఇదే ప్రథమం. గత నెల 30న ఎన్నికలు నిర్వహించగా, ఫలితాలు గురువారం నాడు వెల్లడయ్యాయి. ఫెలిక్స్‌కు 70 లక్షల ఓట్లు ఎలా వచ్చాయి. ఎక్కడి నుంచి వచ్చాయని ఫయులు ప్రశ్నించారు. కాంగోను వలస కాలనీగా చాలా కాలంపాటు తన గుప్పెట్లో పెట్టుకున్న బెల్జియం, ఫ్రాన్స్ ఈ ఎన్నికల ఫలితాలపై అనుమానం వ్యక్తం చేశాయి. ఫెలిక్స్ మూడో స్థానంలో వున్న మాజీ అధ్యక్షుడు జోసెఫ్ కబీలాతో కలసి అధికారం పంచుకునేందుకు ఒప్పందానికి ప్రయత్నిస్తున్నారు. ఫయులూ ఈ ఫలితాలను కోర్టులో సవాలు చేసేది లేనిదీ వెంటనే తెలియరాలేదు. సవాల్ చేయడానికి రాజ్యాంగ కోర్టు 14రోజులు గడువు ఇచ్చింది. ఫయులూకు 60లక్షల ఓట్లు వచ్చాయి. ఫెలిక్స్ విజయోత్సవ వేడుకలను పార్టీ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఘనంగా జరిగాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత ఎన్నికల ఫలితాలను ప్రకటించడంతో వందలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నృత్యాలు, సంబరాలు చేసుకున్నారు.

శాంతి ఒప్పందంపై ఉద్రిక్తతలు రెచ్చగొడుతున్న జపాన్

రష్యా విమర్శ

మాస్కో: నాలుగు వివాదాస్పద పసిఫిక్ దీవులకు సంబంధించి తమతో కుదుర్చుకున్న శాంతి ఒప్పందం విషయంలో జపాన్ ఉద్రిక్తతలను రెచ్చగొడుతోందని రష్యా ఆరోపించింది. ఈ దీవులను తమకు బదిలీ చేసేందుకు వీలుగా అక్కడి ప్రజలను సన్నద్ధం చేయాల్సిన అవసరం వుందని, అప్పుడే తాము రష్యా నుండి పరిహారం కోసం చేస్తున్న డిమాండ్‌ను వదులుకుంటామని జపాన్ చేసిన వ్యాఖ్యలపై రష్యా విదేశాంగ శాఖ తీవ్రంగా స్పందించింది. మాస్కోలోని జపాన్ రాయబారి తొయోహిసా కొజుకిని బుధవారం పిలిపించి అధికారికంగా నిరసన తెలియచేసింది. జపాన్ ప్రభుత్వం చేస్తున్న వ్యాఖ్యలు రష్యాతో కుదుర్చుకున్న శాంతి ఒప్పందాల స్ఫూర్తికి విరుద్ధమని, ఇవి ఇరుదేశాల ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని రష్యా ప్రభుత్వం విమర్శించింది.

ముగిసిన చైనా, అమెరికా వాణిజ్య చర్చలు

బీజింగ్ : ఇరుదేశాల మధ్య వాణిజ్య యుద్ధానికి పరస్పర ఆమోదయోగ్యమైన అంగీకారాన్ని కనుగొనేందుకు గత మూడు రోజులుగా చైనా, అమెరికా మధ్య జరుగుతున్న చర్చలు బుధవారంతో ముగిశాయి. చైనా విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి లూ కాంగ్ ఇక్కడ పత్రికా సమావేశంలో మాట్లాడుతూ, చర్చలు ముగిశాయని ప్రకటించారు. అయితే ఒప్పందం కుదిరినదీ, లేనిదీ ఆయన చెప్పలేదు. బుధవారం వరకు చర్చలు జరిగాయంటే ఇరు పక్షాలు కూడా ఒక ఒప్పందం కుదుర్చుకోవడానికి నిబద్ధతతో వున్నాయని స్పష్టమవుతోందని లూకాంగ్ తెలిపారు. అంతకుముందు అమెరికా వాణిజ్య ప్రతినిధులు విలేకర్లతో మాట్లాడుతూ, చర్చలు సానుకూల వాతావరణంలో జరిగాయని చెప్పారు. తొలుత రెండు రోజులు, 7-8తేదీల్లో మాత్రమే చర్చలు జరపాలని అనుకున్నామని, కానీ ఇలా కొనసాగడం కనివినీ ఎరుగని మార్పని వారు వ్యాఖ్యానించారు. మేధో సంపత్తి హక్కులు, సాంకేతిక సహకారం, మార్కెట్ సౌలభ్యం,వాణిజ్య సమతూకం వంటి సున్నితమైన అంశాలపై చర్చలు ప్రధానంగా సాగాయని చైనా వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది.

ఇది శ్వేత జాతి దురహంకారం

కెనడాపై చైనా రాయబారి విమర్శ

బీజింగ్ : కెనడా దాని మిత్రపక్షాలు శ్వేత జాతి దురహంకారాన్ని ప్రదర్శిస్తున్నాయని చైనా రాయబారి ఆక్షేపించారు. గూఢచర్యానికి పాల్పడుతున్నార్న ఆరోపణలపై అరెస్టు చేసిన ఇద్దరు కెనడియన్లను వెంటనే విడుదల చేయాలని కెనడా కోరుతోంది. కెనడాలో చైనా రాయబారి లూ షాయె ఈ మేరకు ఒక లేఖ రాస్తూ, అమెరికా ఆదేశాల మేరకే చైనా ఉన్నతస్థాయి అధికారిని నిరాధారమైన ఆరోపణలపై నిర్బంధంలోకి తీసుకున్నారని విమర్శించారు. ఇరాన్‌పై విధించిన ఆంక్షలను ఉల్లంఘించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న హువెయి ఉపాధ్యక్షుడు మెంగ్ వాంజూను డిసెంబరు 1న అరెస్టు చేయడంతో, చైనా కూడా ఇద్దరు కెనడా అధికారులను అరెస్టు చేసింది.

మొదటి పేజీ తరువాయి

అయోధ్య కేసు విచారణ 29కి వాయిదా

వాదిస్తున్న సీనియర్ అడ్వకేట్ హరీష్ సాల్వే అన్నారు. అయితే ధావన్ లేవనెత్తిన అభ్యంతరాలపై ప్రధాన న్యాయమూర్తితో పాటు బెంచ్‌లోని ఇతర జడ్జిలతో చర్చించిన అనంతరం లలిత్ స్వచ్ఛందంగా రాజ్యాంగ ధర్మాసన నుండి వైదొలిగారు. కేసు విచారణ తదుపరి తేదీ, సమయాలను నిర్ణయించడానికి కేసును జనవరి 29కి వాయిదా వేసింది. ఈ మేరకు ఆయన స్థానంలో మరొకరు న్యాయమూర్తి నియమించనున్నారు. అయోధ్య కేసు మొత్తం రికార్డులను కోర్టు రూంలో అనేక సంవత్సరాలుగా 15 సీల్డ్ బాక్సుల్లో ఉన్నట్లు గుర్తించింది. వాటిని పూర్తిగా పరిశీలించి సరైన క్రమంలో ఉంచాలని సుప్రీంకోర్టు రిజిస్ట్రీకి రాజ్యాంగ ధర్మాసనం ఆదేశించింది.

నెల్లిమర్ల జ్యూట్‌మిల్లు అక్రమ లాకౌట్

ప్రయత్నిస్తున్నారని ఈ నోటీస్ బోర్డులో యాజమాన్యం ఆరోపించింది. ఈ కారణాలేవీ సరైనవి కావని కార్మికులు చెబుతున్నారు.

వెంటనే మిల్లును తెరవాలి : సిఐటియు

అక్రమ లాకౌట్ ఎత్తివేసి మిల్లును వెంటనే తెరవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ డిమాండ్ చేశారు. లాకౌట్‌కు నిరసనగా మొయిద జంక్షన్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే స్పందించి మిల్లును తెరిపించాలని కోరారు. లేదంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఆర్టీసికి 61 ఏళ్లు

సాంకేతికతను అందిపుచ్చుకుంటూ సామాన్య ప్రజలకు సేవలందిస్తోంది. అత్యధిక బస్సులను నడపడంతో 1999లో గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లోనూ స్థానం సంపాదించుకుంది. 2016 నవంబర్ వరకూ రూ.585.96 కోట్లు నష్టాల్లో ఉండగా 2017 నవంబర్‌కు ఆ నష్టాలు రూ.420.42కోట్లకు తగ్గించుకోగలిగింది. ఏపిఎస్ ఆర్టీసి బస్టాండ్లలో కార్గో పేరుతో సొంత పార్సిల్ సర్వీసును ప్రారంభించింది. 190 ప్రాంతాల్లో ఈ సర్వీసును నడుపుతూ ఏడాదికి రూ.52 కోట్లకుపైగా ఆదాయాన్ని గడిస్తోంది. ఇటీవలే ఆర్టీసి లైవ్ ట్రాక్ పేరుతో యాప్‌ను ప్రారంభించింది. దాని ద్వారా ప్రయాణికులకు కావాల్సిన బస్సు ఎక్కడ నడుస్తోందో ఖచ్చితమైన సమాచారాన్ని అందిస్తోంది.

తొలి సంస్థగా పలు ముద్రలు

దేశంలోనే మొట్టమొదట జాతీయం అయిన రోడ్డు రవాణా సంస్థగా ఆర్‌టిసికి గుర్తింపు పొందింది. దాంతో పాటు దూర ప్రయాణపు నైట్ ఎక్స్‌ప్రెస్ సర్వీసెస్‌ను ప్రారంభించిన తొలి సంస్థగా, ఎసి స్లీపర్, హైటెక్, మెట్రో లైనర్, ఇంటర్ సిటీ సర్వీసులు, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లను ప్రవేశపెట్టిన తొలి సంస్థగానూ పేరొందింది. 1986లో డిపో కంప్యూటరైజేషన్ చేసిన తొలి సంస్థగానూ, ప్రయాణికుల భద్రతా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు భద్రతా కమిషనర్‌ను మొదట ప్రవేశపెట్టిన తొలి సంస్థగానూ చరిత్రలో ఎక్కింది.

ఈ ఏడాది 84 కొత్త ఎసి బస్సులు

2018-19 ఆర్థిక సంవత్సరంలో ఆర్టీసి 84 కొత్త ఎసి బస్సులను కొనుగోలు చేయనుంది. ఎసి సీటర్ విభాగంలో 48 ఇంద్ర, నాలుగు అమరావతి బస్సులు, ఎసి సీటర్ కమ్ స్లీపర్ విభాగంలో 12 బస్సులు, ఎసి స్లీపర్ విభాగంలో 20 వెన్నెల బస్సులను కొనుగోలు చేయనున్నారు. రానున్న వేసవి సీజన్‌లో ఆదాయాన్ని పెంచుకునేందుకు, ప్రయివేటు బస్సులకు పోటీ ఇచ్చే విధంగా ఈ బస్సులు ఉపకరిస్తాయని ఆర్టీసి అధికారులు చెబుతున్నారు.

సంక్రాంతి సందర్భంగా రెండు వేలకుపైగా ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకుని హైదరాబాదు నుండి రాష్ట్రంలో పలు నగరాలకు, ముఖ్యపట్టణాలకు బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. రద్దీకనుగుణంగా జనవరి 9న 50 బస్సులు, 10న 250 బస్సులు, 11న 800 బస్సులు, 12న 500 బస్సులు 13న 350 బస్సులు నడిపేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రిజర్వేషన్ చేసుకునే ప్రయాణికుల సంఖ్యను గమనిస్తూ అవసరానికి తగినట్లు ఏర్పాట్లలో మార్పులు చేస్తామని అధికారులు వెల్లడించారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసిని ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరముందని ఆర్టీసి ఉన్నతాధికారులే చెబుతున్నారు. ఈ విషయంపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు.

సిబిఐలో మరో కుదుపు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అక్టోబర్ 23న అలోక్‌వర్మతో పాటు, సిబిఐ ప్రత్యేక డైరక్టర్ రాకేశ్ ఆస్థానాలను బలవంతంగా సెలవుపై పంపిన అనంతరం సిబిఐ తాత్కాలిక డైరక్టర్‌గా నియమితులైన ఒడిశా క్యాడర్‌కు చెందిన నాగేశ్వరరావుకే తిరిగి ఆ బాధ్యతలు అప్పగించింది. సిబిఐలో చోటుచేసుకున్న పరిణామాలపై స్వతంత్ర విచారణ జరిపించాలని మల్లికార్జున ఖర్గే హైపవర్ కమిటీ సమావేశంలో డిమాండ్ చేసినట్లు సమాచారం. అలోక్‌వర్మను తొలగించాలన్న హైపవర్ కమిటీ నిర్ణయాన్ని వ్యతిరేకించిన ఆయన ఈ మేరకు డీసెంట్‌నోట్‌ను అందచేసినట్లు తెలిసింది. 23, 24 తేదీలలో సిబిఐలో ఏం జరిగిందన్నది దేశ ప్రజలముందుకు రావాల్సిఉందని ఆయన పేర్కొన్నారు. అలోక్‌వర్మ అవినీతికి పాల్పడినట్టు, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సివిసి చేసిన ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు లేవని బలంగా చెప్పిన ఆయన అలోక్‌వర్మను పూర్తిస్థాయిలో విధుల్లో కొనసాగించాలని కోరారు.

ఎందుకు భయపడుతున్నారు ? కాంగ్రెస్ ప్రశ్న

అలోక్‌వర్మను సిబిఐ డైరక్టర్‌గా కొనసాగించడానికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఎందుకు భయపడుతున్నారని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఆనంద్ శర్మ ప్రశ్నించారు. హైపవర్ కమిటీ నిర్ణయం వెలువడిన అనంతరం నిర్ణయించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 'దాచేందుకు ఏమీ లేకపోతే , ఎందుకు పదవిలో కొనసాగించరు?' అని ప్రశ్నించారు. అక్టోబర్ 23-24 తేదీల్లో జరిగిన పరిణామాలపై స్వతంత్ర దర్యాప్తు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. 'జస్టిస్ సిక్రి ఏం చెప్పారో మాకు తెలియదు. ప్రస్తుత సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ విశ్వసనీయతను కోల్పోయింది' అని ఆయన ఒక ప్రశ్నకు జవాబుగా చెప్పారు.

మోడీని భయం తొలిచేస్తోంది : రాహుల్ ట్వీట్

మోడీమనస్సును భయం తొలిచేస్తోందని ఎఐసిసి అధ్యక్షుడు రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆయన ట్వీట్ చేశారు. ' మోడీ మనస్సును భయం తొలిచేస్తోంది. 30 వేల కోట్ల రూపాయల లబ్ధిని అనీల్ అంబానికి చేకూర్చిన మోడీ దాన్ని కప్పిపుచ్చుకోవడానికి తంటాలు పడుతున్నారు. సిబిఐ చీఫ్ అలోక్‌వర్మను రెండుమార్లు తొలగించడం ద్వారా మోడీ తన అబద్ధాల వలలో తానే బందీ అయ్యారు' అని ఆయన పేర్కొన్నారు.

మోడీ- ఖర్గే పాత్రలు తారుమారు

ప్రధానమంత్రి నరేంద్రమోడీయే అలోక్‌వర్మను సిబిఐ డైరక్టర్‌గా మొదట్లో ప్రతిపాదించారు. అప్పట్లో ఈ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ ఖర్గే డీసెంట్ నోట్ ఇచ్చారు. ఇప్పుడు ఆ పాత్రలు తారుమారయ్యాయి. అలోక్‌వర్మను తొలగించాలని మోడీ పట్టుబడితే, కొనసాగించాలంటూ ఖర్గే డీసెంట్ నోట్ ఇచ్చారు. ఇలా పాత్రలు తారుమారు కావడం వెనుక రాఫెల్ కుంభకోణంపై విచారణ డిమాండ్ ముందుకు రావడమే కారణమా అన్నది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు ఆస్థానా కేసుపై నేడు ఢిల్లీ హైకోర్టు తీర్పు వెలువరించనుంది. సిబిఐ వివాదం ఇంకెన్ని మలుపులు తిరుగుతుందోనన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

పిఎసిఎస్ ఉద్యోగుల భారీ ప్రదర్శన

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర కార్యదర్శి పి. మధు మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సిబ్బంది పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు దారుణమని అన్నారు. వారి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ బహిరంగ సభ అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి ఆయన లేఖ రాశారు. సభలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు 43 శాతం పిఆర్‌సి ఇచ్చారని, మరలా అదే ఉద్యోగులు 35 శాతం పెంచాలని అడుగుతున్నారని, అదే సమయంలో పిఎసిఎస్ ఉద్యోగులకు ఎప్పుడో పెంచిన వేతన సవరణకు ఇప్పుడు పదిశాతం ఇవ్వాలని కమిటీ సూచించడం దారుణమన్నారు. సర్వీసు రూల్స్ ప్రకారం ప్రతి 15 రోజులకు ఒకసారి వేతనం గ్రాట్యుటీ ఇవ్వాల్సి ఉండగా లక్ష, రెండు లక్షలతో సరిపెట్టుకోవాలని సూచించడం మానవత్వం కాదని పేర్కొన్నారు. శాసనమండలిలో పిడిఎఫ్ పక్షనేత వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఉద్యోగులకు తమ సంపూర్ణమద్దతు ఉంటుందని తెలిపారు. ఎవరి ప్రభుత్వం అధికరాంలో ఉన్నా లేకపోయినా కార్మికులు, ఉద్యోగుల తరుపున పోరాడేది ఎర్ర జెండా మాత్రమేనని అన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ సహకార రంగంలో అమలవుతున్న సంస్కరణలపై ఉద్యోగులు పోరాడి సంస్థను నిలబెట్టుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనుబంధ సంఘాల నాయకులు ముజఫర్, రమాదేవి, ఆర్.వి.నరసింహారావు తదితరులు మాట్లాడారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.సత్యనారాయణ, కోశాధికారి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

సిఎంగారూ స్పందించండి

సహకార రంగ (పిఎసిఎస్) ఉద్యోగుల వేతన సవరణ, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి మధు గురువారం లేఖ రాశారు. ఉద్యోగుల వేతన సవరణ గడువు ముగిసి నాలుగున్నర సంవత్సరాలు అయినప్పటికీ నేటి వరకూ వేతన సవరణకు నోచుకోలేదని, పెరుగుతున్న ధరల ఫలితంగా పిఎసిఎస్ ఉద్యోగుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. వేతన సవరణ కోసం ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫార్సులు అశాస్త్రీయంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత మార్కెట్ ధరలను, ఇతర ఉద్యోగులకు ఇస్తున్న జీతాలను పరిగణలోకి తీసుకుని పిఎసిఎస్ ఉద్యోగులు వేతాలను సవరించి వారిని ఆదుకోవాల్సిన అవసరముందని కోరారు. 50 శాతం వేతనాలు పెంచి 2014 ఏప్రెల్ 1 నుంచి అమలు చేయాలని, గ్రాడ్యుటీ రూ.5లక్షలు చెల్లించాలని, డిసిసిబిలో ఐదో క్యాడర్ పోస్టుల్లో 50 శాతం పోస్టులను పిఎసిఎస్ ఉద్యోగులతో సీనియార్టీ ఆధారంగా భర్తీ చేయాలని కోరారు. డిసిసిబి తరహాలో రెండు శాతం వర్కింగ్ కేపిటల్ పద్ధతిని, పిఎసిఎస్ ఉద్యోగులకు కూడా అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసును 60 ఏళ్లకు పెంచాలని, సహకార సంఘాలను మూసివేయాలన్న సిఫార్సులను ఉపసంహరించుకోవాలని, ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

చిన్నవ్యాపారులకు జిఎస్టీ నుంచి ఊరట

(మొదటి పేజీ తరువాయి)

భవన్‌లో జిఎస్టీ కౌన్సిల్ 32వ సమావేశం జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాల ఆర్థిక మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఇందులో చిన్న, మధ్య తరహా పరిశ్రమల వ్యాపారులకు లాభం చేకూరే విధంగా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశ అనంతరం జైట్లీ మీడియాతో మాట్లాడుతూ, "కాంపొజిషన్ పథకం కింద వ్యాపారులు ప్రతి మూడు నెలలకు ఒకసారి పన్నులు చెల్లించాలి. కానీ, రిటర్న్ మాత్రం ఏడాదికి ఒకసారి మాత్రమే దాఖలు చేయాలి. కాంపొజిషన్ పథకం పరిమితిని కోటి రూపాయలు నుంచి రూ.1.5 కోట్లకు పెంచాం. 2019 ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి వస్తుంది. చిన్న, మధ్య తరహా వ్యాపారుల పన్ను విధింపు పరిమితిని రూ.20 లక్షల వార్షిక టర్నోవర్‌ను రూ.40లక్షల వరకు పెంచాం. రెండేళ్ల వరకు అంతర్ రాష్ట్ర అమ్మకాలపై ఒక శాతం సెస్ విధించేందుకు కేరళకు అనుమతి ఇస్తున్నాం" అని వెల్లడించారు.

విపత్తు నష్టం నుంచి తేరుకోలేదు: ఐజాక్, కేరళ ఆర్థిక మంత్రి

ఇటీవల కేరళ రాష్ట్రాన్ని వరదలు ముంచెత్తాయని, ఆ విపత్తు నుంచి రాష్ట్రం ఇంకా కోలేకోలేదని ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి థామస్ ఐజాక్ పేర్కొన్నారు. పెద్ద ఎత్తున ఆస్తి నష్టం వాటిల్లడంతో దానిపై దృష్టి సారించేందుకు ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. జిఎస్టీ కౌన్సిల్‌లో పాల్గొన్న ఆయన కేరళ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కేరళలో వరదల వల్ల సంభవించిన ఆర్థిక నష్టం విషయాన్ని కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనికి అన్ని రాష్ట్రాలు మద్దతు తెలిపాయన్నారు. దీంతో కౌన్సిల్ తమ రాష్ట్రానికి కొంతమేర వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. దీంతో తమ రాష్ట్రంలో చేపట్టే అమ్మకాలపై ఒక శాతం పన్ను అదనంగా విధించుకోవడానికి కౌన్సిల్ తమ ప్రభుత్వానికి అనుమతిని ఇచ్చిందని అన్నారు. అయితే, ఈ వెసులుబాటును తాము రెండేళ్ల వరకు పొందగలుగుతామని థామస్ చెప్పారు. సాధారణంగా కరువు, కాటకాలు, వరదలు, విపత్తులు సంభవించిన సందర్భంలో ఆయా రాష్ట్రాలకు సెస్ విధింపు విషయంలో కొంత ఉపశమనం కలిగించడం అవసరమని అన్నారు. అందులో భాగంగానే తమకు ఈ అవకాశం వచ్చిందని అన్నారు. జీఎస్టీ అమలు జరిగాక ప్రత్యేక సెస్ విధించుకునేందుకు అవకాశం పొందిన తొలి రాష్ట్రం కేరళేనని అన్నారు. ముఖ్యంగా మధ్య తరగతి ప్రజానీకం చేసే వాణిజ్యంపై జీఎస్టీ కౌన్సిల్ లోతుగా చర్చ జరిగినట్లు మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చారు.

రాష్ట్రాల ప్రతిపాదనలు చర్చకు రావటం లేదు: యనమల

ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి జిఎస్టీపై అభ్యంతరాలను సమావేశంలో వెల్లడించానని రాష్ట్ర ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. జిఎస్టి మండలి సమావేశం అజెండా ఖరారు చేయడంలో రాష్ట్రాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవడం లేదని విమర్శించారు. కేంద్రం నిర్ణయించిన వస్తువులనే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకొస్తున్నారని అన్నారు. దీంతో రాష్ట్రాల నుంచి వచ్చే ప్రతిపాదనలు చర్చకు రావడం లేదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. తదుపరి సమావేశాలకు రాష్ట్రాల ప్రతిపాదనలు తీసుకొని అజెండా ఖరారు చేస్తామని అరుణ్ జైట్లీ చెప్పారన్నారు. ఈ సమావేశంలో రియల్ ఎస్టేట్‌కు సంబంధించి చర్చ జరిగిందని, ఫిట్‌మెంట్ కమిటీ ఇచ్చిన ప్రతిపాదనలపై సానుకూలంగా ఉన్నారని అన్నారు. ఏపి నుంచి రియల్ ఎస్టేట్‌కి సంబంధించి ఏమైతే కోరుతున్నామో, ఫిట్‌మెంట్ కమిటీ కూడా అవే ప్రతిపాదనలు చేసిందని తెలిపారు. సెటిల్ కానీ ఐజిఎస్టీ డబ్బు రూ.ఏడు వేల కోట్లు వెంటనే సెటిల్ చేయాలని కోరినట్లు చెప్పారు. దీనివల్ల రాష్ట్రానికి రూ.100 కోట్లు వస్తుందని అన్నారు.

సుమోటోగా సంపన్నుల సేవ!

(మొదటి పేజీ తరువాయి)

అంటున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో 1బి, ఆర్ఎస్ఆర్ రిజిష్టర్లు సక్రమంగా లేవన్నది తిరుగులేని వాస్తవం. కాబట్టి అర కొర రికార్డులతో పెద్దలకే లబ్ధి తప్ప పేదలకు న్యాయం జరుగడం కష్టం.

న్యాయపరంగా చిక్కులు!

చుక్కల భూములు, ఆర్ఎస్ఆర్ సవరణ చట్టం-2017 ప్రకారం రైతు అనుభవంలోని భూమి అయి ఉండాలి. 12 సంవత్సరాలుగా ఆయా భూములు రైతు అనుభవంలో ఉండాలి. ఇందుకు సంబందించిన ఏదైనా ఇతర ఆధారం భూమి యజమానే చూపాలంటూ ఈ చట్టం చెబుతోంది. తమదే భూమి అని నిరూపించుకోవాల్సిన బాధ్యత రైతుపైన ఉండేది. తాజాగా ప్రభుత్వం జారీ చేసిన మెమో ప్రకారం 1బి రిజిష్టర్‌లో పట్టాదారుని పేరు నమోదై ఉంటే చాలని పేర్కొన్నారు. రైతు దరఖాస్తు చేసుకోకపోయినా 1బి రిజిష్టర్ ఆధారంగా సుమోటోగా అధికారులు నిర్ణయం తీసుకోవచ్చు. దీంతో తప్పులు దొర్లే అవకాశాలు మెండుగా వున్నాయి. 2017 ఆర్ఎస్ఆర్ సవరణ చట్టానికి సవరణ చేయకుండా కేవలం 1బి రిజిష్టర్ ఆధారంగా ప్రైవేటు భూముల కిద తొలగిస్తే ఎవరైనా తనకు అన్యాయం జరిగిందని కోర్టు కెళితే సంబందిత ఉద్యోగులు ఇరుకున పడినట్లేనంటున్నారు న్యాయనిపుణులు. తాజా మెమో ప్రకారం ఏది ప్రభుత్వ భూమి? ఏది ప్రైవేటు భూమి అనే విషయాన్ని అధికారులు తేల్చాల్సి ఉంటుంది. ప్రైవేటు భూమి అని తేల్చితే ఇంత కాలం నిషేధిత భూముల జాబితాలో ఉంచారో స్పష్టం చేయాల్సింది అధికారులే. ప్రభుత్వం రోజుకో రకంగా భూముల క్రమబద్ధీకరణ విషయంలో వ్యవహరిస్తుండటంతో అధికారులు డోలాయమానంలో పడుతున్నారు.

అన్ని వివరాలనూ మీ భూమిలో పెట్టాలి: ఎం.సునీల్ కుమార్,నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం

ప్రభుత్వం 1బి, ఆర్ఎస్ఆర్, 22(ఎ), భూమలు వివరాలు మీ భూమి పబ్లిక్ డొమైన్‌లో పెట్టాలి. సమాచారం రైతులందరికీ తెలిస్తే తప్పులు దొర్లే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. 2017 చుక్కల భూములు, ఆర్ఎస్ఆర్ చట్టం ప్రకారం తమ భూములకు సంబందించిన ఆధారాలను వారే చూపాల్సి ఉండేది. ప్రభుత్వం ఆ భాధ్యతను తీసుకోవడం మంచిపరిణామమే. ప్రభుత్వం జారీ చేసిన మెమోను అడ్డంపెట్టుకుని కొందరు అక్రమ మార్గాల్లో లబ్ధి పొందే అవకాశం ఉంటుంది. రైతులు, ప్రభుత్వం అప్రమత్తంగా ఉండాలి.



వెంకటేశ్, వరుణ్ తేజ్, తమన్నా, మెహరీన్ హీరో హీరోయిన్లుగా రూపొందిన 'ఎఫ్2' చిత్రం ప్రీ రిలీజ్ వేడుక గురువారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ చిత్రానికి అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీవెంకటేశ్వర ఫిల్మ్స్ బ్యానర్‌లో దిల్ రాజు నిర్మించారు.

ప్రతి అమ్మాయికీ కనెక్ట్ అవుతుంది



కీర్తి సురేశ్, కల్యాణ్ రామ్

కీర్తి సురేశ్ కొత్త చిత్రం హైదరాబాద్ అన్నపూర్ణ స్టూడియోస్‌లో గురువారం లాంఛనంగా ప్రారంభమైంది. దేవుడి చిత్రపటాలపై తీసిన ముహూర్తపు సన్నివేశానికి నందమూరి కల్యాణ్ రామ్ క్లాప్ కొట్టారు. డైరెక్టర్ వెంకీ అట్లూరి, నిర్మాత బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ కెమెరా స్విచ్చాన్ చేశారు. ఎస్.హరీష్ శంకర్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఈస్ట్ కోస్ట్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతోంది. నరేంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. మహేష్ కోనేరు నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి కల్యాణ్ కోడూరి బాణీలు సమకూరుస్తున్నారు.

కీర్తి సురేష్ మాట్లాడుతూ 'తెలుగులో 'మహానటి' తర్వాత నటిస్తోన్న సినిమా ఇది. మహిళా ప్రధానమైన చిత్రంలో నటించడం చాలా హ్యాపీగా ఉంది. ప్రతి అమ్మాయికీ కనెక్ట్ అయ్యే సినిమా. ఎక్కువ భాగం సినిమా యు.ఎస్‌లో చిత్రీకరణ జరుపుకోనుంది. డైరెక్టర్ నరేంద్ర మంచి కథను సిద్ధం చేశారు. తప్పకుండా సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరవుతాననే నమ్మకం ఉంది' అని అన్నారు.

దర్శకుడు నరేంద్ర మాట్లాడుతూ '2016 నుండి ఈ కథపై వర్క్ చేస్తున్నాను. తరుణ్ నాకు స్క్రిప్ట్‌లో సాయం చేశాడు. అన్ని భావోద్వేగాలూ కలగలిపిన కథ ఇది. ఈ కథకు కీర్తి సురేష్ తప్ప మరెవ్వరూ సూట్ కారు. 25 శాతం ఇండియాలో, 75 శాతం యు.ఎస్‌లో చిత్రీకరించనున్నాం. ఏప్రిల్‌లో యు.ఎస్.షెడ్యూల్ ప్లాన్ చేస్తున్నాం. ఫిబ్రవరిలో షూటింగ్ ప్రారంభమవుతుంది' అని తెలిపారు.

నిర్మాత మహేష్ కోనేరు మాట్లాడుతూ 'ప్రతి అమ్మాయి తమ జీవితంలో ఎక్కడో ఒకచోట ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనే ఉంటుంది. మహిళలకు కనెక్ట్ అవుతుంది. సినిమాకు సంబంధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే తెలియజేస్తాం' అని పేర్కొన్నారు.

అందుకే రిచ్ అనిపిస్తుందేమో!

"ఏ సినిమాకైనా ప్రొడ్యూసర్‌దే ప్రధాన పాత్ర. జ్యూస్ నాదైనా మంచి గ్లాస్ ఉండాలి. అందుకే రామ్ చరణ్, నాకు డీవీవీ గారైతేనే బెటర్ అని చెప్పారు. సినిమా ఈ రోజు ఇంత అద్భుతంగా వచ్చిందంటే అది ఆయన వల్లే పాసిబుల్ అయింది. నాకు రామ్ చరణ్‌లో ఎక్కువగా నచ్చింది ఒకటే. ఆయనకీ అసలు తృప్తి ఉండదు. ఎంత సాధించినా ఇంకా ఏదో చేయాలి అనుకుంటూ ఉండడు. సినిమా సినిమాకీ ఎదుగుతూనే ఉంటాడు. ఇంకా ఆశగా చూస్తూనే ఉంటాడు" అని అన్నారు దర్శకుడు బోయపాటి శ్రీను. ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినయ విధేయ రామ'. రామ్ చరణ్, కియరా అద్వాని హీరో హీరోయిన్లు. డి.వి.వి.దానయ్య నిర్మించారు. ఈ చిత్రం సంక్రాంతికి జనవరి 11న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు బోయపాటి శ్రీను గురువారం మాట్లాడారు.


వినయం విధేయత ఉంది కాబట్టే రాముడయ్యాడు. ఈ రాముడు ఫ్యామిలీ పట్ల విధేయుడు. ఆ విధేయత ఏ స్థాయిలో ఉంటుందనేది మీరు సినిమాలో చూస్తారు. ఈ సినిమా ట్రైలర్‌లో రామ్ చరణ్ కటౌట్ చూస్తుంటే ఐరన్ మ్యాన్‌లా కనిపిస్తున్నాడు. ఆ బాడీలో ఈ రోజు ఉన్న పరిణితి నాలుగేళ్ల క్రితం లేదు. అందుకే పర్ఫెక్షన్ కోసం టైమ్ తీసుకోవాల్సిన వచ్చింది. ఈ సినిమాకి ఇదే కరెక్ట్ టైమ్. నేను చేసిన సినిమాలు 'భద్ర' నుండి బిగిన్ అయితే 'వినయ విధేయ రామ' వరకు ఫ్యామిలీ ఇమోషన్లకే ఫస్ట్ ఫౌండేషన్ ఉంటుంది. ఆ తరవాతే సొసైటీ గురించి కథలో ఇంకా స్కోప్ ఉందనుకుంటే తక్కిన విషయాల గురించి ఆలోచిస్తా. అజర్ బైజాన్ సీక్వెన్స్ ప్రిపేర్ చేసుకుని రామ్ చరణ్‌కి చెప్పినప్పుడు, అప్పటికే 2 నెలల కన్నా ఎక్కువ టైమ్ లేదు.

ఇప్పట్లో కష్టం అని నాకు తెలిసినా, మీరు చేసేస్తారు అని ఒక మాట అనేసి వెళ్లిపోయా. ఆయన కూడా ఆ మాటని అలాగే తీసుకుని, నన్ను నమ్మాడు కాబట్టే అంతలా కష్టపడ్డాడు. 'వినయ విధేయ రామ' విజన్ నుండి విజువల్ వరకు ఉన్న మెయిన్ కనెక్టివిటీ రామ్ చరణ్.. ఆయన లేకపోతే ఇది సాధ్యపడేది కాదు. సినిమా అంటే పండుగ. పండుగని అభిమానుల వరకు చేర్చాలంటే ఆర్టిస్ట్ నన్ను నమ్మాలి. వాళ్లు నన్ను నమ్మాలంటే వాళ్ల కన్నా ముందు నేను పదింతలు ఎక్సర్‌సైజు చేసి, వాళ్లను ఇన్‌స్పైర్ చేయగలగాలి. ఈ ప్రాసెస్‌లో ఆర్టిస్టుల కన్నా కథలో నేనే ఎక్కువగా ఇన్వాల్వ్ అవుతాను. కథ చెప్పేటప్పుడే ఎఫెక్ట్స్‌తో సహా వివరిస్తాను.

మాస్, ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో పాటు సినిమాలో ఒక కొత్త పాయింట్‌ని 'వినయ విధేయ రామ'లో రైజ్ చేశాం. అది ఆడియెన్స్‌కి రీచ్ అవుతుంది. సినిమాలో క్యారెక్టర్స్ కూడా ఎవరు అందుబాటులో ఉన్నారో వారిని తీసుకోలేదు. ఒక ఐఎస్ ఆఫీసర్, హీరోకి పెద్దన్నయ్య అన్నప్పుడు ఎవరిని తీసుకున్నా ఈ క్యారెక్టర్‌లో పర్ఫెక్ట్‌గా సింక్ అవ్వాలి. అందుకే ప్రశాంత్. అలా వరసగా వయసు దగ్గరి నుంచి నటనా స్థాయి వరకూ ప్రతిదీ క్షుణ్ణంగా ఆలోచించి నిర్ణయం తీసుకున్నాం.

వివేక్ ఒబెరాయ్‌ని కలిసినపుడు ఆయన అన్న మొదటి మాట 'నేను చేయను. నేను 'రక్త చరిత్ర' సినిమా చేశాను. మళ్లీ అదే స్థాయి సినిమా అయితే తప్ప ..నేను ఆలోచించనండి' అని చెప్పాడు. 'సరే సర్.. మీరు చేయకండి కానీ, ఒకసారి క్యారెక్టర్ వినండి' అని చెప్పాను. అంతే విన్నాడో లేదో.. డేట్స్ ఇచ్చేశాడు. నా దృష్టిలో సినిమా అంటే కలర్ ఫుల్‌గా ఉండాలి. అందుకే ఎక్కువగా అర్బన్ బ్యాక్ డ్రాప్‌లో కథల్ని ఎంచుకుంటాను. అందుకే ప్రతి సినిమాలోనూ రిచ్ ఫ్యామిలీ బ్యాక్ డ్రాప్ అన్పిస్తుందేమో..

నేను చిన్న సినిమాలు చేయలేను. నా నుండి ఆడియెన్స్ ఏదైతే ఆశిస్తారో అది 100శాతం ఇవ్వాలని అనుకుంటా. అవతల అంచనాలు ఒకలా ఉండి, మన ప్రొడక్ట్ ఇంకోలా ఉంటే మ్యాచ్ అవ్వదు. అందుకే నేను చిన్న సినిమాలు చేయను. ఒకవేళ నేను బయోపిక్ చేసినా, అందులో కూడా దమ్ము తప్పకుండా ఉంటుంది. ఏ హీరోతో సినిమా చేసినా, ఆ హీరోకి అభిమానినై చేస్తా. చరణ్ కోసం సినిమా రాసుకున్నప్పుడు కూడా ఫ్రంట్ సీట్లోకూర్చుని చూస్తున్నట్టుగా ఫీలై కథ రాసుకున్నా. ప్రతి హీరోకి అదే చేస్తా. ఇది కూడా అలాంటి సినిమానే.



బోయపాటి శ్రీను

అద్భుతంగా ఉండాలన్నారు

- యామి గౌతమ్

భారత సైనిక స్థావరం ఉరిపై పాకిస్థాన్ సైనికులు ఆకస్మికంగా దాడులు చేశారు. దానికి ప్రతిదాడిగా మన సైనికులు సర్జికల్ దాడులు నిర్వహించారు. 2016లో జరిగిన ఈ ఘటనలపై తెరకెక్కిన చిత్రం 'ఉరి'. విక్కీ కౌసల్, మోహిత్ రైనా, పారేశ్ రావల్, యామి గౌతమ్ తదితరులు నటించారు. ఇందులో యామి గౌతమి ఇంటిలిజెన్స్ ఆఫీసర్‌గా చేసింది. ఈ చిత్రం శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా గౌతమ్ మీడియాతో మాట్లాడింది." మేము ఈ చిత్రం కోసం వర్క్‌షాపులు చేస్తున్నప్పుడు ఈ దర్శకుడు ఆదిత్యాను అడిగాను 'ఇంత కంటే ఏం చేయాలి? దీని కోసం ఏం చూడాలి? అని అడిగా. దానికి ఆయన సమాధానమిస్తూ..'నువ్వు ఏదైనా చూడు. కానీ నీ పాత్ర మాత్రం అద్భుతంగా రావాలి. అలా రావడానికి ఏం చేయాలో నువ్వే ఆలోచించు. ఈ పాత్ర గురించి నువ్వే అన్నీ అయి చేయాలి. అలా ప్రిపేర్ అవండి' అని చెప్పారు. ఈ పాత్ర గురించి నన్ను సంప్రదించినప్పుడు చాలా ఆనందమేసింది. దీని కోసం తీవ్రంగా అయితే ప్రయత్నించలేదు. కానీ అంతా సహజంగా చేశాను. నిజంగా ఇది సాధ్యమేనా అన్నట్టు చేశాను. అదే సమయంలో ఇంటిలిజెన్స్ ఆఫీసర్ పాత్ర ఎలా ఉంటుంది. వారు చేసే పని విధానం గురించి చాలా అన్వేషించి అలా నేనూ ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నా. సినిమాలో పాత్ర అంటే పాత్ర అనే వరకూ ఉంటుంది. కానీ విక్కీ కౌసల్ మాత్రం నాకు నిత్యం సలహాలు ఇస్తూ ఉండేవారు. హావభావాలు వ్యక్తం చేయడంలో తప్పిదాలు జరిగితే వెంటనే సరిచేసేవారు. ఇది తప్పు అని చెప్పే వారు కాదు కానీ ఇంకా మెరుగ్గా రావడానికి ప్రయత్నించమని పట్టుబట్టేవారు. ఆయన అనుకున్నట్టు వస్తే 'నేను అనుకున్నది ఇదే' అనేవారు" అని అన్నారు యామి గౌతమ్.





కార్తి, రకుల్ ప్రీత్‌సింగ్

14న 'దేవ్' గీతావిష్కరణ

కార్తి హీరోగా నటిస్తోన్న 'దేవ్' సినిమా విడుదల తేదీ ఖరారైంది. వాలెంటైన్స్ డే కానుకగా ఫిబ్రవరి 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర ఆడియో విడుదల తేదీని కూడా ప్రకటించారు దర్శక నిర్మాతలు. ఈనెల 14న ఆడియో విడుదల కానుంది. హరీష్ జయరాజ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. 'ఇప్పటికే విడుదలైన పాటలకు అద్భుతమైన స్పందన వస్తోంది. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌కు ప్రేక్షకుల నుంచి సూపర్ రెస్పాన్స్ వచ్చింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి' అని నిర్మాత తెలిపారు. ఈ యాక్షన్ ఫ్యామిలీ డ్రామాను రజత్ రవిశంకర్ తెరకెక్కిస్తున్నారు. రకుల్ ప్రీత్ సింగ్ కథానాయిక. నిక్కీ గిర్లానీ కీలక పాత్రలో కనిపించనుంది. 'ఖాకీ' తర్వాత కార్తితో రకుల్ నటిస్తోన్న రెండో చిత్రమిది. ప్రకాశ్ రాజ్, రమ్యకృష్ణ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆర్ వేల్‌రాజ్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. రిలయన్స్ ఎంటర్‌టైన్మెంట్ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని ప్రిన్స్ పిక్చర్స్ బ్యానర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి లక్ష్మణ్ కుమార్, ఠాగూర్ మధు నిర్మాతలు. ప్రిన్స్ పిక్చర్స్, లైట్ హౌజ్ మూవీ మేకర్స్, రిలయన్స్ ఎంటర్ టైన్మెంట్ బ్యానర్లపై తెరకెక్కుతోంది. హరీష్ జయరాజ్ బాణీలు సమకూరుస్తున్నారు.

ప్రధానికి ధన్యవాదాలు



ఇటీవల సినిమా టికెట్లపై జీఎస్టీ భారాన్ని తగ్గిస్తూ ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో బాలీవుడ్ నిర్మాతలు, దర్శకులు, నటీనటులు గురువారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోడీకి కృతజ్ఞతలు తెలిపారు. గత నెల 19వ తేదీన బాలీవుడ్ నిర్మాతలు, ప్రముఖ హీరోలంతా ప్రధానిని కలిసి అనంతరం వీరంతా సమావేశానికి రావడం ప్రత్యేకత సంతరించుకుంది. గత సమావేశానికి మహిళలను ఎవరినీ ఆహ్వానించకపోవడంతో విమర్శలు ఎదుర్కొన్న బాలీవుడ్ ఈ సారి మాత్రం నటీమణులతో కలసి ఢిల్లీ వచ్చారు. ఆ సమావేశంలో అజయ్ దేవగన్, అక్షయ్ కుమార్, కరణ్ జోహార్, సిద్ధార్థ్ రాయ్ కపూర్, రితేశ్ సిధ్వాని తదితరులు ఉన్నారు. ఇప్పుడొచ్చిన వారిలో రణవీర్ సింగ్, రణవీర్ కపూర్ అలియా భట్, వరుణ్ ధావన్, రోహిత్ శెట్టి, కరణ్ జోహార్, రాజ్ కుమార్‌రావు, విక్కీ కౌసల్, ఆయుష్మాన్ ఖురానా, భూమి పడ్నేకర్, సిద్ధార్థ్ మల్హోత్ర తదితరులు ఉన్నారు.

రేపు 'జెర్సీ' టీజర్ విడుదల

నాని నటిస్తోన్న చిత్రం 'జర్సీ'. ఈ చిత్రం టీజర్ ఈనెల 12న విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని నాని తన ట్విట్టర్ ఖాతా ద్వారా గురువారం పంచుకున్నారు. ఈ చిత్రానికి 'మళ్లీ రావా' ఫేమ్ గౌతమ్ తిన్నూరి దర్శకత్వం వహిస్తున్నారు. నాగ వంశీ నిర్మాత. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో ఈ చిత్రం రూపొందుతోంది. క్రికెట్ నేపథ్యంలో తెరకెక్కుతోన్న శరవేగంగా తెరకెక్కుతోంది. శ్రద్ధా శ్రీనాథ్ ఇందులో కథానాయిక. సమ్మర్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రం నాని కెరీర్‌లో ఉత్తమ చిత్రంగా నిలుస్తుందని ప్రారంభంలో దర్శకుడు గౌతమ్ తిన్నూరి చెప్పారు.



నాని

ఎవ్వరూ ఒత్తిడి చేయలేదు

- కంగనా రనౌత్



బాలథాక్రే జీవితం ఆధారంగా రూపొందిన 'థాక్రే', ఝాన్సీ లక్ష్మీబాయి బయోపిక్ 'మణికర్ణిక' ఈనెల 23, 25 తేదీల్లో వరుసగా విడుదల కావాల్సి ఉంది. ఈ రెండు చిత్రాలు విడుదల విషయంలో క్లాష్ వస్తుంది. ఈ నేపథ్యంలో 'థాక్రే'ను ఐదు రోజులు ముందుగా అంటే ఈనెల 18న విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు. ఇదే తరుణంలో 'మణికర్ణిక' చిత్రాన్ని కూడా ఈనెల 25న విడుదల చేయడం వాయిదా వేయాలని శివసేన ఒత్తిడి తెచ్చిందని ప్రచారం జరిగింది. 'మణికర్ణిక' సినిమాలో విజయీభవ...అనే పల్లవితో సాగే రెండో గీతాన్ని గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మణికర్ణికపై జరుగుతున్న ప్రచారంపై బాలీవుడ్ నటి కంగనా రనౌత్ స్పష్టతనిచ్చింది. ఈ చిత్రం విడుదల వాయిదా వేయాలని ఎవ్వరూ తనపై ఒత్తిడి తీసుకురాలేదని చెప్పింది. 'ఈ విషయం ఎవరూ నాతో మాట్లాడలేదు. ఈ సినిమా విడుదల వాయిదా వేయమని కానీ, ఏవిధమైన ఒత్తిడి కానీ ఎవరూ చేయలేదు. ఇంకో విషయం ఏమిటంటే ఎవ్వరూ నన్ను సంప్రదించలేదు కూడా" అని చెప్పింది.

సైన్యంలో ధైర్యం నింపుతూ...

వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జీవితం ఆధారంగా రూపుదిద్దుకుంటోన్న చిత్రం 'మణికర్ణిక'. కంగనా రనౌత్ టైటిల్ రోల్ పోషిస్తుంది. క్రిష్ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. గురువారం విడుదల చేసిన విజయీభవ..'లో కంగన తన సైన్యంలో ధైర్యం నింపుతూ యుద్ధానికి సిద్ధం చేస్తూ కనిపించారు. వెండితెర ఝాన్సీరాణి హీరోయిజాన్ని చక్కగా చూపించారు. ప్రసూన్ జోషి ఈ చిత్రానికి సాహిత్యం అందించారు. శంకర్-ఇషాన్-లాయ్ పాటకు సంగీతం అందించారు. శంకర్ మహదేవన్ పాటను ఆలపించారు. ఈ పాటకు యూట్యూబ్‌లో మంచి స్పందన లభిస్తోంది.



'మణికర్ణిక'లో ఓ సన్నివేశం

ఐషూ...చోళ రాణి

ఐశ్వర్యరాయ్ మళ్లీ దక్షిణాది చిత్రంలో నటించబోతుంది. దర్శకుడు మణిరత్నం చిత్రంలో ఈమె కూడా భాగమవుతుందట. 'ఫన్నీఖాన్' తర్వాత ఐశ్వర్య చేయనున్న సినిమా ఇదే. ఈ దర్శకుడంటే ఈమెకు అభిమానం. అందుకే ఆయన డేట్స్ అడిగిన వెంటనే గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని ప్రచారం జరుగుతోంది. ఈమె మాత్రమే కాదు ఐశ్వర్య మామ అమితాబ్ బచ్చన్ కూడా నటించబోతున్నారట. ఐశ్వర్య రాయ్ ఇందులో రాణిగానూ, అమితాబ్ ఓ కీలక పాత్రలోనూ కనిపించబోతున్నారు. 'సర్కార్ రాజ్' చిత్రం తర్వాత ఈ చిత్రంలో ఒకే తెరపై అమితాబ్, ఐశ్వర్య కనబడనున్నారు. దక్షిణాది నంచి భారీ ఎత్తున ఈ చిత్రం కోసం నటీనటులను తీసుకుంటున్నారట. అయితే ఎవర్ని తీసుకుంటున్నది మాత్రం ఇప్పటివరకూ వెల్లడించలేదు. చోళుల పరిపాలనపై భారీ బడ్జెట్‌తో బహుభాషా చిత్రంగా తెరకెక్కిస్తున్నారు. పొన్నియిన్ సెలవన్ రాసిన 'కల్కీ కృష్ణమూర్తి' పుస్తకం ఆధారంగా ఈ సినిమా తెరకెక్కబోతుంది. ప్రస్తుతం స్క్రిప్ట్ దశలో ఉంది. ఐదు భాగాలుగా రూపొందనుంది. చోళ రాజు రాజరాజు చోళుడు జీవితం ఆధారంగా తెరకెక్కనుందట. ఇది 'బాహుబలి'ని మించి చిత్రీకరించాలనే యోచనలో మణిరత్నం ఉన్నారు. సంక్రాంతి తర్వాత ఈ చిత్రం సెట్స్‌పైకి వెళ్లనుంది.



అగ్రి ప్లస్



మిరపలో పురుగుల్ని నివారించండి

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వేల హెక్టార్లలో రైతులు మిరప పంటను సాగుచేస్తున్నారు. ముఖ్యంగా మెట్ట మండలాల్లో రైతాంగం మిరప పంటను ఆశించే పురుగు, తెగుళ్లపై సరైన అవగాహన లేక సస్యరక్షణపై ఆధికంగా ఖర్చు పెడుతున్నారు. దీనివల్ల సాగు ఖర్చు పెరిగి, అధిక నికరాదాయం పొందలేకపోతున్నారు. కాబట్టి రైతులు మిరప పైరును ఆశించే పురుగులు, తెగుళ్లు, వాటి నష్టలక్షణాలు గురించి అవగాహన పెంచుకుంటే కనుక అవసరం మేరకే సస్యరక్షణ మందులు పిచికారీ చేసుకొని, సస్యరక్షణపై ఖర్చు తగ్గించుకొనే అవకాశముంది. అంతేగాక వాతావరణ కాలుష్యాన్నీ తగ్గించవచ్చు. కనుక మిరప పైరును ఆశించే పురుగులు, వాటి నష్ట లక్షణాలు గురించి వ్యవసాయ శాస్త్రవేత్తలు ఇస్తున్న సస్యరక్షణ చర్యలు తెలుసుకుందాం.

మిరప నాశించే పురుగులలో పై ముడత (తామర పురుగులు), కింది ముడత (తెల్లనల్లి) ముఖ్యమైనవి. కానీ ఇటీవల కాలంలో పూతను ఆశించే కోడ పురుగు (మిడ్జ్), ఆకుముడత వైరస్‌ని వ్యాపింపజేసే తెల్లదోమ ఉధృతి కూడా పెరుగుతుంది.

పైముడత (తామర పురుగులు) : వీటి రెక్కల పురుగులు, పిల్ల పురుగులు ఆకుల ఆడుగుభాగాన చేరి, రసాన్ని పీల్చడం వల్ల ఆకుల అంచులు పైకి ముడుచుకుంటాయి. పూత, పిందె రాలిపోతుంది. దీని నివారణకు ఎకరానికి ఎసిఫెట్ 300 గ్రా.లు, ఫిప్రోనిల్ 400 మి.లీ./ స్పైనోసాడ్ 75 మి.లీ./ పెగాసస్ 300 గ్రా.లను లీటరు నీటికి కలిపి, ఆకుల అడుగుభాగం బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి. నాటిన 15వ రోజు, 45వ రోజు ఫ్రిపోనిల్ గుళికలను ఎకరానికి ఎనిమిది కిలోల చొప్పున భూమిలో తగినంత తేమ చూసుకొని, మొక్కలకు అందజేయటం ద్వారా కూడా వీటిని నివారించుకోవచ్చు.

కింది ముడత (తెల్ల నల్లి) : ఈ పురుగులు ఆకుల నుంచి రసాన్ని పీల్చడం వల్ల ఆకులు కిందికి ముడుచుకొని, తిరగబడిన పడవ ఆకారంలో కనబడతాయి. ఆకుల కాడలు సాగి, ఆకులు ముదురు ఆకుపచ్చ రంగులోకి మారతాయి. మొక్కల పెరుగుదల ఆగిపోతుంది. లేత ఆకులు ముద్దగా వస్తాయి. దీని నివారణకు ఎకరానికి డైకోఫాల్ లీటరు/ నీటిలో కరిగే గంధకం పొడి 600 గ్రా.లు/ పెగాసస్ 300 గ్రా.లను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలి. కింద ముడత ఉన్నప్పుడు ఇతర పురుగుల నివారణకి కార్బరిల్, ఎసిఫేట్ లాంటి మందులను వాడరాదు. వాడితే కనుక తెల్లనల్లి ఉధృతి పెరుగుతుంది.



పూత పురుగు (మిడ్జ్) : దోమ జాతికి చెందిన వీటి పిల్ల పురుగులు, మొగ్గలు, పూత, పిందెలను ఆశించి నష్టపరుస్తాయి. పురుగు సోకిన పూతలో అండాశయం తెల్లగా ఉబ్బి ఉంటుంది. పూతలో పిల్ల పురుగులు, కోశస్థ దశ పురుగులు కన్పిస్తాయి. మిరప పూత రాలిపోతుంది. కాయలు తక్కువగా ఏర్పడతాయి. ఒకవేళ ఏర్పడినా గిడసబారి, వంకరలు తిరిగి ఉంటాయి. దీని నివారణకు మొగ్గ దశలో ఫ్రెడ్‌ఫాస్ 250 మి.లీ. లేదా మార్షల్ 400 మి.లీ.లను ఎకరానికి పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి వారం రోజులకు క్లోరిఫైరిఫాస్ 500 మి.లీ.లను పిచికారీ చేయాలి.

తెల్లదోమ : ఇటీవల కాలంలో దీని ఉధృతి మిరప పైరులో అధికంగా కనిపిస్తుంది. ఆకుల నుంచి వీటి రెక్కల పురుగులు, పిల్ల పురుగులు రసాన్ని పీలుస్తాయి. దానివల్ల తొలుత ఆకులపై పసుపు రంగు మచ్చలేర్పడి, క్రమేణా ఆకంతా పండి, రాలిపోతుంది. మొక్కలు ఎదుగుదల లోపించి, బలహీనంగా ఉంటాయి. కానీ ఇవి ఆకుముడత వైరస్ తెగులును వ్యాపింపజేస్తే, నష్టం అధికంగా ఉంటుంది. ఈ వైరస్ తెగులు ఆశించినప్పుడు లేత ఆకులు పసుపు రంగుకి మారి, చిన్నవిగా ఉండి, గుత్తుగా మొక్కల పైభాగాన ఏర్పడతాయి. పూత రాలిపోతుంది, కాయలు కాయవు. ఈ తెల్లదోమ నివారణకు ముందుగా నారు నాటేటప్పుడే పొలం చుట్టూ గట్లపై మొక్కజొన్న/ జొన్న/ సజ్జ వంటి వాటిని విత్తుకోవాలి. తెల్లదోమ ఆశించే కలుపు మొక్కలను, ఇతర పంట మొక్కలను లేకుండా చూసుకోవాలి. ఇబడాక్లోప్రిడ్ మందుతో విత్తన శుద్ధి చేసుకోవాలి. లేదంటే విత్తన శుద్ధి చేసి పెంచిన నారును కొనుక్కోవాలి. పైరులో పసుపు రంగు జిగురు పూసిన అట్టలను 4-5 అమర్చుకోవాలి. వీటి నివారణకు ట్రైజోఫాస్ 250 మి.లీ. లేదా ఎసిఫేట్ 300 గ్రా.లను ఎకరానికి 200 లీటర్ల నీటికి కలిపి, పిచికారీ చేసుకోవాలి.

పేనుబంక : ఇవి లేత కొమ్మలు, ఆకులు అడుగుభాగాన చేరి, రసాన్ని పీల్చటం వల్ల పెరుగుదల తగ్గుతుంది. ఇవి విసర్జించే తియ్యటి పదార్థానికి చీమలు ఆకర్షితమవుతాయి. ఆకులు, కాయలపై నల్లటి మసిలాంటి బూజు పెరుగుతుంది. దీని నివారణకు ఎకరానికి ఎసిఫేట్ 300 గ్రా.లు లేదా మిథైల్ డెమటాన్ 400 మి.లీ. లేదా డైమిథోయేట్ 400 మి.లీ.లను 200 లీటర్ల నీటికి కలిపి, పిచికారీ చేసుకోవాలి.

కాయ తొలుచు పురుగులు (పొగాకు లద్దె పురుగు, శనగ పచ్చ పురుగు మొదలైనవి) : లద్దె పురుగులు కాయలు ఏర్పడక ముందు ఆకులను తింటూ, కాయలు ఏర్పడిన తర్వాత వాటిలో చేరి, లోపలి పదార్థాలను తింటాయి. వీటి ఉనికిని గుర్తించటానికి పొలంలో ఎకరానికి నాలుగు చొప్పున లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి. పొగాకు లద్దె పురుగులని ఆకర్షించటానికి ఆముదం, శనగపచ్చ పురుగులకి బంతిని ఆకర్షణ పైర్లుగా పొలంలో వేసుకోవాలి. అవసరాన్ని బట్టి పురుగు మందుల ద్వారా సస్యరక్షణ చేపట్టాలి. వీటి నివారణకు ఎకరానికి థయోడికార్బ్ 200 గ్రా.లు/ ఎసిఫేట్ 300 గ్రా.లు/ క్లోరిపైరిఫాస్ 500 మి.లీ./ స్పైనోసాడ్ 75 మి.లీ./ నోవాల్యురాన్ 150 మి.లీ./ డై ఫ్లూ బెంజియురాన్ 200 గ్రా.లను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. బాగా ఎదిగిన పొగాకు లద్దె పురుగులను విషపు ఎర ద్వారా నివారించుకోవాలి. దీనికి ఐదు కిలోల తవుడుకి, 500 గ్రా.ల కార్బరిల్/ 500 మి.లీ. క్లోరిపైరిఫాస్, 500 గ్రా.ల బెల్లమును తగినంత నీటితో కలిపి తయారుచేసుకొని, దానిని చిన్న చిన్న ముద్దలుగా చేసి, పొలంలో సాయంత్రం వేళ సమానంగా చల్లాలి. లద్దె పురుగులు రాత్రిపూట బయటకు వచ్చి, వీటిని తిని చనిపోతాయి.

రైతాంగం ఇటీవల కాలంలో నారుమడులు పోసుకోకుండా నేరుగా నారును నర్సరీల నుంచి తెచ్చుకొని నాటుకుంటున్నారు. కనుక వారు నర్సరీలలోని నారుని జాగ్రత్తగా పరిశీలించి, ఏ విధమైన పురుగులు/ తెగుళ్లు ఆశించనివిగా నిర్ధారించుకున్న తర్వాతే వాటిని కొంటే మంచి ఫలితాలు పొందవచ్చు.

డాక్టర్ కె. వసంతభాను
ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్,
డా. కె.ఎల్.రావు కృషి విజ్ఞానకేంద్రం,
గరికపాడు, కృష్ణాజిల్లా.



శీతాకాలంలో గొర్రెలు

శీతాకాలంలో ముఖ్యంగా చలిగాలులు, మంచు కురవడం ఎక్కువగా ఉంటుంది. కనుక గొర్రెలలో మామూలుగా ఉండే ఉష్ణోగ్రతలకన్నా శరీర ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది. దీనివల్ల పెరుగుదల ఉండదు. ముఖ్యంగా గొర్రె పిల్లల్లో పెరుగుదల కుంటుపడుతుంది. అందువల్ల మామూలు శరీర ఉష్ణోగ్రతలు ఉండాలంటే పాకల చుట్టూ గోనె సంచులు గానీ, పట్టలు గానీ కట్టాలి. అలాగని పూర్తిగానూ కప్పకూడదు. అదే ఆరుబయట పెంచే జీవాలకు మంచు పడకుండా ఏదయినా చెట్టు కింద ఏర్పాటు చేసుకోవాలి. వీలయితే



చుట్టుపక్కల తగినంత అగ్గి మంట వేసి, వెచ్చదనాన్ని ఏర్పాటు చేయాలి. ఎండు గడ్డిని పక్కగా (బెడ్) పరవాలి. జీవాలకు పాకలలో నేల, తేమను త్వరగా పీల్చుకునే విధంగా లేదా ఆరిపోయే విధంగా ఏర్పాటు చేసుకోవాలి.

ముఖ్యంగా విత్తనపు పొట్టేళ్ళు, చూలు ఉండే జీవాలలో దాణా పరిమాణాన్ని పెంచాలి. దీనివల్ల తగినంత శక్తి ఇంకా లభిస్తుంది. గోరువెచ్చని నీటిని రాత్రి పడుకునే ముందు ఇస్తే మరీ మంచిది. శీతాకాలంలో ఎక్కువగా గొర్రెలలో న్యుమోనియా, దగ్గు, చీమిడి ఎక్కువగా వస్తుంది. వచ్చిన వెంటనే తగు వైద్యం చేయించాలి. చలి గాలులు ఎక్కువగా వీచినట్లయితే కొన్ని గొర్రెల రక్తంలో గ్లూకోజ్ శాతం తగ్గి, కీటోసిస్ వ్యాధి వస్తుంది. ఇది రాకుండా తగినంత గ్లూకోజ్ లేదా తిండిని ఇవ్వాలి. చూలు కట్టిన జీవాలలోనూ క్యాల్షియం శాతం తగ్గి, పాల జ్వరమూ వచ్చే అవకాశం ఉంది. కనుక తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

డాక్టర్ జి.రాంబాబు,
పశు వైద్య సహాయ
శస్త్ర చికిత్సకులు,
కడప.



ఈ మాసంలో విత్తుకోండి

జనవరి మాసంలో విత్తుకోదగిన నువ్వు, కొర్ర పంటల కోసం మేలుకరమైన విత్తనాలు, విత్తన శుద్ధితో పాటు విత్తుకునే సమయంలో తీసుకోవాల్సిన చర్యలను క్లుప్తంగా తెలుసుకుందాం.

నువ్వు : జనవరి మొదటి పక్షం విత్తుకోవడానికి అనువైన సమయం. విత్తన లభ్యతను బట్టి ఎలమంచిలి-11, ఎలమంచిలి-17, ఎలమంచిలి-66 రకాలను సాగు చేసుకోవచ్చు.



విత్తన మోతాదు : ఎకరాకు 2.5 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తనానికి సమపాళ్లలో ఇసుక కలిపి గొర్రుతో వరుసల్లో విత్తుకోవాలి. వరుసల మధ్య 30 సెం.మీ., మొక్కల మధ్య 15 సెం.మీ. ఉండాలి.

విత్తన శుద్ధి : కిలో విత్తనానికి 3 గ్రాముల థైరం/ కాప్టాన్/ మాంకోజెబ్‌తో విత్తన శుద్ధి చేసి, విత్తటం మంచిది.

ఎరువులు : ఆఖరి దుక్కిలో ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువు, 16 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులు వేసుకోవాలి. నత్రజని సగభాగం, మొత్తం భాస్వరం, పొటాష్ నిచ్చే ఎరువులను ఆఖరి దుక్కిలో వేసి బాగా కలియదున్నాలి. మిగతా సగభాగం నత్రజని ఎరువును విత్తిన నెల రోజులకు కలుపు తీసి వేయాలి.

కొర్రలు : కొర్ర పంటను వేసవిలో జనవరి మాసంలో విత్తుకోవచ్చు.



అధిక దిగుబడినిచ్చు కొర్ర రకాలు : ప్రసాద్, కృష్ణదేవరాయ, నరసింహరాయ, శ్రీలక్ష్మీ, సూర్య నంది, ఎస్.ఐ.ఎ 3085 మొదలైన రకాలను సాగు చేసుకోవాలి.

- ఎకరాకు 2 కిలోల విత్తనం సరిపోతుంది. విత్తన శుద్ధి కొరకు కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండైజిమ్ మందును కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. చాళ్ళ మధ్య 20-25 సెం.మీ., మొక్కల మధ్య 7.5-10 సెం.మీ. దూరంలో విత్తుకోవాలి. ఎకరాకు 4 టన్నుల పశువుల ఎరువును వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 8 కిలోల నత్రజని, 8 కిలోల భాస్వరం విత్తేటప్పుడు వేయాలి.

మరిన్ని వివరాలకు మీ జిల్లాలోని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ లేదా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్‌ను సంప్రదించగలరు. రైతులు మరిన్ని సలహాల కోసం ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతుల కాల్ సెంటర్ ఉచిత నంబరు (1800 425 0430)ను సంప్రదించవచ్చు.

డా. పి. రాంబాబు,
విస్తరణ సంచాలకులు,
ఆచార్య ఎన్. జి.రంగా వ్యవసాయ
విశ్వవిద్యాలయం,
లాం, గుంటూరు - 522 034.




చిన్నారి



చుక్కలు కలపండి!

పిల్లలూ! పక్కన ఉన్న చిత్రంలో
చుక్కలను కలిపి,
ఆ బొమ్మేంటో కనుక్కోండి!



గులాబి

గులాబీ పూవు పూసింది
గుండె ఎంతో మురిసింది
కనులకు పండగ చేసింది
మనసును బహుగా దోచింది
పూవు కింద ముల్లుంది
కష్టపడితేనే సుఖమంది!





బి. మల్లికార్జున
5వ తరగతి,
ప్రాథమిక పాఠశాల,
మెయిన్,హెచ్. మురవణి,
కర్నూలు జిల్లా.

దారి చూపండి!



పిల్లలూ! పక్కనున్న చిత్రంలోని చింటూకి పూలమొక్కల దగ్గరకు వెళ్ళే దారినిచూపండి.

పొడుపు కథలు

ఒంటికాలి మనిషి
వానలో తిరుగుతాడు



జవాబు : గొడుగు

జోక్:

రాము : మేము మా పై అంతస్తుకు వెళ్లేందుకు లిఫ్ట్ వాడతాం తెలుసా?

శ్యాము : ఓస్ అంతేనా మేము పక్క ఊరికి వెళ్లేందుకు కూడా 'లిఫ్టే' వాడతాం!

నేను గీసిన బొమ్మ



సి. వికాస్,
7వ తరగతి, జెడ్.పి.హైస్కూల్,
కాణిపాకం,
చిత్తూరు జిల్లా.



పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - Chinnaarips@gmail.com

మేరీ కోమ్ @1



బాక్సింగ్ ఫెడరేషన్ ర్యాంకింగ్స్ విడుదల

న్యూఢిల్లీ : సీనియర్ మహిళా బాక్సర్ మేరీ కోమ్ ప్రపంచ బాక్సింగ్ ఫెడరేషన్ (ఏఐబిఏ) తాజాగా ప్రకటించిన ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాది నవంబర్‌లో న్యూఢిల్లీ వేదికగా జరిగిన ఏఐబీఏ మహిళా ప్రపంచ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ 48 కేజీల విభాగంలో మేరీ స్వర్ణంతో సత్తా చాటిన సంగతి తెలిసిందే. దీంతో మేరీ ప్రపంచ బాక్సింగ్ చరిత్రలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్ టైటిళ్లను ఆరుసార్లు గెలిచి చరిత్ర సృష్టించింది. దీంతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 48 కేజీల విభాగంలో 1700 పాయింట్లతో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. అంతేగాక 2020లో జరగబోయే ఒలింపిక్స్‌లో 48 కేజీల విభాగాన్ని చేర్చని కారణంగా మేరీ 51కేజీల విభాగంలో బరిలోకి దిగనుంది. 2018 మేరీకోమ్‌కు ఎన్నో మధురానుభూతులను మిగిల్చింది. 51కేజీల విభాగంలో పింకీ జంగ్రా ఎనిమిదో స్థానంలో నిలవగా, ఆసియా క్రీడల్లో రజతం సాధించిన మనీషా మాన్ 54 కేజీల విభాగంలో ఎనిమిదో స్థానాన్ని కైవసం చేసుకుంది. 57 కేజీల విభాగంలో సోనియా లాథర్ రెండో స్థానంలో నిలిచింది. మరో బాక్సర్ సిమ్రంజిత్ కౌర్ 64 కేజీల విభాగంలో నాలుగోస్థానానికి చేరింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ ఎల్ సరితా దేవి 16 స్థానానికే పరిమితమైంది. ఇండియా ఓపెన్‌లో స్వర్ణాన్ని ముద్దాడిన లవ్లీనా 69కేజీల విభాగంలో ఐదో స్థానంలో నిలిచింది.

పోరాడి ఓడిన ఛెత్రీ సేన

ఎఎఫ్‌సి ఫుట్‌బాల్ టోర్నీ



అబుదాబి : దుబాయ్ వేదికగా జరుగుతున్న ఎఎఫ్‌సి ఫుట్‌బాల్ టోర్నీ రెండో మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైంది. హోరాహోరీగా సాగిన ఈ పోటీలో భారత్ 0-2 గోల్స్ తేడాతో ఆతిథ్య యుఏఈ జట్టు చేతిలో ఓడింది. భారతజట్టుకు గోల్ చేసే సువర్ణావకాశాలు దక్కినా చివర్లో ఒత్తిడికి గురై గోల్స్‌గా మలచక చేజేతులా మూల్యం చెల్లించుకుంది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో యుఏఈ జట్టు 79వ స్థానంలో ఉండగా, భారత్ 97వ స్థానంలో ఉంది. గ్రూప్-ఏలోని ఛెత్రీ సేన ఈ మ్యాచ్‌లో ఫేవరేట్ యుఏఈ జట్టుతో పోటాపోటీగా ఆడడం విశేషం. అరబ్ జట్టు తరఫున ముబారక్ ప్రథమార్థం 42వ నిమిషంలో ఫీల్డ్ గోల్ చేశాడు. రెండోగోల్ రెండో అర్ధభాగం 89వ నిమిషంలో మబ్‌కుహత్ గోల్ చేసి ఆతిథ్యజట్టుకు 2-0 ఆధిక్యతను చేకూర్చారు. రెండు సందర్భాల్లో భారతజట్టుకు గోల్ చేసే అవకాశం దక్కినా ఆ అవకాశాన్ని ఛెత్రీసేన వినియోగించుకోలేకపోయింది. అంతకుముందు ఆతిథ్యజట్టు బహ్రెయిన్‌తో తొలిమ్యాచ్‌ను 1-1తో డ్రాగా ముగించింది. ఛెత్రీసారథ్యంలోని భారతజట్టు 4-1తో థాయ్‌లాండ్‌ను ఓడించిన సంగతి తెలిసిందే. మరోమ్యాచ్‌లో థాయ్‌లాండ్ 1-0తో బహ్రెయిన్‌పై సంచలన విజయం సాధించింది. ఇంకో గ్రూప్ మ్యాచ్‌లో జోర్డాన్ 2-0 గోల్స్‌తో సిరియాను చిత్తుచేసింది. సోమవారం భారతజట్టు బహ్రెయిన్‌తో ఆఖరి లీగ్‌మ్యాచ్ ఆడనుంది.



సెమీస్‌కు బెంగళూరు

ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్

బెంగళూరు : ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ సెమీఫైనల్లోకి బెంగళూరు ర్యాప్టర్స్ దూసుకెళ్లింది. గురువారం జరిగిన ఆఖరి లీగ్‌మ్యాచ్‌లో చెన్నై స్మాషర్స్‌పై గెలిచింది. చెన్నై ట్రంప్ మ్యాచ్‌లో కశ్యప్ 11-15, 12-15 పాయింట్ల తేడాతో అనూహ్యంగా సాయిప్రణీత్(బెంగళూరు) చేతిలో ఓడాడు. దీంతో చెన్నై జట్టు మైనస్ పాయింట్‌కు పడిపోయింది. బెంగళూరు ట్రంప్ మ్యాచ్‌లో కిదాంబి శ్రీకాంత్ 15-10, 15-10 పాయింట్ల తేడాతో ఛంగ్(చెన్నై)పై గెలుపొందడంతో బెంగళూరు విజయం ఖాయమైంది. పురుషుల డబుల్స్, మహిళల సింగిల్స్ పోటీల్లో చెన్నై గెల్చినా ఫలితం లేకపోయింది. మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ ఢిల్లీ 8-15, 15-12, 15-4 పాయింట్ల తేడాతో గెలిచినా అప్పటికే బెంగళూరు ఆధిక్యత లో ఉండడంతో ఆ జట్టు సెమీస్‌కు చేరింది.

శుక్రవారం (తొలి సెమీఫైనల్)
అవధే వారియర్స్ × బెంగళూరు ర్యాప్టర్స్
శనివారం (రెండో సెమీఫైనల్)
హైదరాబాద్ హంటర్స్ × ముంబయి రాకెట్స్



మహారాష్ట్రలోని పూణేలో బుధవారంరాత్రి శివ్ ఛత్రపతి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' పోటీలను ప్రారంభించిన మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిజ్, కేంద్ర క్రీడల మంత్రి రాజ్యవర్థన్‌సింగ్ రాథోర్.



టీమిండియా బిజీ షెడ్యూల్

న్యూఢిల్లీ : టీమిండియా ఆటగాళ్లు బిజీ షెడ్యూల్‌తో ఊపిరిసలుపుకోలేకపోతున్నారు. గత ఏడాది సుదీర్ఘ పర్యటనలో భాగంగా టీమిండియాజట్టు ఆస్ట్రేలియాకు బయల్దేరిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు సిద్ధమైన టీమిండియా పర్యటనను జనవరి 18తో ముగియనుంది. అనంతరం జనవరి 23 నుంచి న్యూజిలాండ్ జట్టుతో ఐదు వన్డేలు, మూడు టీ20ల్లో భారత్ తలపడనుంది. కివీస్ పర్యటన ఫిబ్రవరి 10 వరకు కొనసాగనుంది. అనంతరం ఫిబ్రవరి 24 నుండి స్వదేశంలో ఆస్ట్రేలియాతో టీ20, వన్డే సిరీస్‌లకు షెడ్యూల్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి(బిసిసిఐ) ఖరారు చేసింది. మార్చి 13 వరకూ కంగారు జట్టుతో ఐదు వన్డేల్లో టీమిండియా పోటీపడనుంది. ఆ తర్వాత మార్చి 23 నుంచి ఇండియన్ ప్రిమియర్‌లీగ్(ఐపిఎల్) 12వ సీజన్ ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. ఈ మెగాటోర్నీ ముగిసిన వెంటనే టీమిండియా ఇంగ్లాండ్‌లో మే 30 నుంచి ఐసీసీ వన్డే ప్రపంచకప్‌కు పయనం కావాల్సి ఉంటుంది. దీంతో రాబోయే ఆరు నెలలు టీమిండియా జట్టు ఊపిరి సలుపుకోవడానికి వీలులేకుండా బిజీ షెడ్యూల్‌ను బిసిసిఐ ఖరారు చేసింది.

ఆసీస్ షెడ్యూల్...

వచ్చే నెలలో స్వదేశంలో ఆస్ట్రేలియాతో జరుగునున్న భారత క్రికెట్ జట్టు ద్వైపాక్షిక సిరీస్ షెడ్యూల్ అధికారికంగా ఖరారైంది. ఈ సిరీస్‌లో భారత్-ఆస్ట్రేలియాల మధ్య రెండు టీ20ల సిరీస్‌తో పాటు ఐదు వన్డేల సిరీస్ జరుగనుంది. దీనికి సంబంధించిన షెడ్యూల్ వివరాలను భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బిసిసిఐ) గురువారం ప్రకటించింది. ఫిబ్రవరి 24న బెంగళూరులో జరిగే తొలి టీ20తో సిరీస్ ఆరంభం కానుంది. ఆపై 27వ తేదీన విశాఖపట్నంలో రెండో టీ20 జరుగనుంది. మార్చి2 నుంచి 13 వరకు ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా పోటీపడనుంది. మార్చి 2న తొలి వన్డే హైదరాబాద్‌లో, 5వ తేదీన నాగ్‌పూర్‌లో రెండో వన్డే, 8వ తేదీన రాంచీలో మూడో వన్డే, 10వ తేదీన మొహాలీలో నాల్గో వన్డే, 13వ తేదీన ఢిల్లీలో ఐదో వన్డేలు జరుగ నున్నాయి. ముందుగా ఇరుజట్ల మధ్య వన్డే సిరీస్ జరిగే అవకాశం ఉందని భావించినప్పటికీ, టీ20లతో సిరీస్‌ను ఆరంభించనున్నారు. 2017లో భారత్‌లో చివరిసారి ఆసీస్ పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ ద్వైపాక్షిక సిరీస్‌లో ఐదు వన్డేల సిరీస్‌తో పాటు, మూడు టీ20ల సిరీస్ జరిగింది. ఐదు వన్డేల సిరీస్‌ను భారత్ 4-1తో గెలవగా, టీ20 సిరీస్ 1-1తో సమం అయ్యింది.

న్యూజిలాండ్ పర్యటన షెడ్యూల్...

- జనవరి 23 నుండి ఫిబ్రవరి 3 వరకు ఐదు వన్డేల సిరీస్
- ఫిబ్రవరి 6 - 10 : మూడు టీ20 మ్యాచ్‌ల సిరీస్

స్వదేశంలో ఆస్ట్రేలియా పర్యటన షెడ్యూల్...

- ఫిబ్రవరి 24 - 27 : రెండు టీ20ల మ్యాచ్‌ల సిరీస్
- మార్చి 2 - 13 : ఐదు వన్డేల మ్యాచ్‌ల సిరీస్

మార్చి 23 నుంచి ఇండియన్ ప్రిమియర్ లీగ్
మే 30 నుంచి ఇంగ్లాండ్‌లో ఐసిసి వన్డే ప్రపంచకప్

రెండు మ్యాచ్‌ల నిషేధానికి దయానా సిఫార్సు



టీమిండియా క్రికెటర్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్‌ల వ్యవహారం చినికి చినికి గాలివాన అయ్యేలా ఉంది. పాలకుల మండలి సభ్యురాలు దయానా ఎడుల్జీ ఈ విషయమై గురువారం మీడియాతో మాట్లాడారు. బాలీవుడ్ నిర్మాత కరణ్ జోహార్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న కార్యక్రమంలో టీమిండియా క్రికెటర్లు పాండ్య, రాహుల్ చేసిన వ్యాఖ్యల పట్ల తీవ్ర దుమారం రేగిన విషయం తెలిసిందే. ఈ విషయంపై ఇప్పటికే వీరిద్దరి నుంచి బీసీసీఐ వివరణ కోరింది. అయితే పాండ్యా ఇచ్చిన వివరణ పట్ల గానీ, క్షమాపణల పట్లగానీ తమకు సంతృప్తి కలగలేదని ఎడుల్జీ తెలిపారు. వీరిద్దరిపై రెండు వన్డే మ్యాచ్‌ల నిషేధం విధించాల్సిందిగా బిసిసిఐకి సిఫార్సు కూడా చేశారు.

హోరాహోరీ పోరులో నాగార్జున గెలుపు

మహిళల బాల్‌బాడ్మింటన్ టోర్నీ

(ప్రజాశక్తి-స్పోర్ట్స్ డెస్క్)

కృష్ణా యూనివర్శిటీ ఆధ్వర్యంలో శ్రీదుర్గా మల్లేశ్వర సిద్దార్థ మహిళా కళాశాలలో అఖిలభారత బాల్‌బాడ్మింటన్ టోర్నీ రెండో రోజు జరిగిన పోటీలలో నాగార్జున విశ్వవిద్యాలయం హోరాహోరీ పోరులో ఆర్‌టిఎం నాగపూర్ యూనివర్శిటీపై గెలిచింది. గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో కృష్ణా విశ్వవిద్యాలయం జట్టు అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయం(కర్ణాటక) జట్టుపై 35-19, 35-21 పాయింట్ల తేడాతో గెలిచి ముందజ వేసింది. మరో మ్యాచ్‌లో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం హోరాహోరీ పోరులో 35-31, 24-35, 35-15 పాయింట్ల తేడాతో ఆర్‌టిఎం నాగపూర్ యూనివర్శిటీపై చివరివరకూ పోరాడి గెలిచింది. మరో మ్యాచ్‌లో ఆంధ్ర విశ్వవిద్యాలయం జట్టు అనూహ్యంగా ముంబయి విశ్వవిద్యాలయం చేతిలో ఓడింది.





గుజరాత్, జమ్మూ కాశ్మీర్‌లో మూడు కొత్త ఎయిమ్స్

న్యూఢిల్లీ : గుజరాత్, జమ్మూ కాశ్మీర్ రాష్ట్రాల్లో కొత్తగా మూడు ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)ను నెలకొల్పాలని కేంద్ర మంత్రివర్గం గురువారం నిర్ణయించింది. జమ్మూలోని సాంబా, కాశ్మీర్‌లోని పుల్వామా, గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో వీటిని ఏర్పాటుచేయనున్నారు. ప్రధానమంత్రి స్వాస్థ్య సురక్షణ యోజన (పిఎంఎస్ఎస్‌వై) కింద ఏర్పాటు చేస్తున్న ఈ ఎయిమ్స్ సంస్థల్లో ఒక్కొక్కదాంట్లో వంద ఎంబిబిఎస్ సీట్లు, 60 బిఎస్సీ నర్సింగ్ సీట్లు వుంటాయి. నాణ్యమైన బోధనాసుపత్రులతో కూడిన వైద్యం అందించాలన్న లక్ష్యంతోనే ఈ కొత్త జాతీయ సంస్థలను ఏర్పాటు ఏ చేసినట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. న్యూఢిల్లీలోను, మరో ఆరు చోట్ల ఎయిమ్స్ తరహాలోనే ఈ కొత్త సంస్థల్లోను మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ప్రభుత్వం పేర్కొంది. రాజ్‌కోట్‌లో ఎయిమ్స్‌ను 45 మాసాల్లోను, సాంబాలో ఎయిమ్స్‌ను 48 మాసాల్లోను, పుల్వామాలో ఎయిమ్స్‌ను 72 మాసాల్లోను పూర్తి చేస్తామని ప్రభుత్వం ఆ ప్రకటనలో వివరించింది.

మరింత కావాల్సిందే!

- 'తల్లి సురక్ష'కు 'ప్రైవేటు' షరతులు
- లబ్ధిదారులపైనే భారం?

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్టీఆర్ వైద్య సేవల కిందకు ప్రసవాలను కూడా చేర్చుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'తల్లి సురక్ష' పథకాన్ని అమలు చేయడానికి ప్రైవేటు ఆస్పత్రులు ముందుకు రావడం లేదు. ఈ పథకం కోసం ప్రభుత్వం ఇచ్చే మొత్తంపై ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలు అసంతృప్తిగా ఉన్నాయి. మరింత కావాలని డిమాండ్ చేస్తున్నాయి. తాము కోరిన మొత్తం ఇచ్చేంతవరకు ఈ పథకం కింద సేవలు అందించలేమని ఇప్పటికే ప్రభుత్వానికి స్పష్టం చేశాయి. దీంతో ఈ అదనపు మొత్తం చెల్లించే భారం లబ్ధిదారులపైనే పడనుంది. ఈ మొత్తం కనిష్టంగా 7వేల రూపాయల నుండి 30 వేల రూపాయల వరకు ఉంటుందని అంచనా! దీంతో ఈ పథక లక్ష్యమే ప్రశ్నార్థకంగా మారనుంది. ఎన్‌ఎబిహెచ్ గుర్తింపులేని ప్రయివేటు ఆస్పత్రుల్లో సాధారణ కాన్పుకు రూ. 8000, సిజేరియన్‌కు రూ. 14, 050, ఎన్‌ఎబిహెచ్ గుర్తింపు ఉన్న ఆస్పత్రులలో సాధారణ కాన్పుకు రూ. 9200, సిజేరియన్‌కు రూ. 16,158 ఎన్టీఆర్ వైద్యసేవల కింద ఆయా ఆస్పత్రులకు చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రభుత్వం ప్రకటించిన ధరలు తమకు సరిపోవని ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలు వెల్లడించాయి. సాధారణ నర్సింగ్ హోమ్‌లోనే సహజ కాన్పుకు రూ. 15 వేలు నుంచి రూ. 20వేలు, సిజేరియన్‌కు రూ. 50 వేలు నుంచి రూ. 60 వేలు తీసుకుంటున్నారని ఆ యాజమాన్యాలు చెబుతున్నాయి. ధరలు నిర్ణయించేటప్పుడు కనీసం తమ అభిప్రాయం తెలుసుకోలేదని. కొన్ని సందర్భాల్లో జన్మించిన శిశువుకు ఏమైనా సమస్యలుంటే ప్రత్యేకంగా అందించాల్సిన చికిత్సకు ఎవరు నిధులు చెల్లిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ఎన్‌టిఆర్ వైద్యసేవ అధికారులు మాత్రం 2014 కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం (సిజిహెచ్ఎస్) ప్రకారం నిర్దేశించిన వ్యయాన్ని పరిగణలోకి తీసుకుని ఈ మొత్తాలను నిర్ణయించినట్లు చెబుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన మొత్తాన్నే తాము ప్రైవేటు ఆస్పత్రులకు విడుదల చేస్తామని, మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారులే చెల్లించాల్సిఉంటుందని అధికారులు అంటున్నారు.

ప్రైవేటీకరించేందుకే .. వైద్య నిపుణుల విమర్శ

మరోవైపు ప్రసూతి సేవలను క్రమంగా ప్రయివేటీకరించేందుకే ప్రభుత్వం తల్లి సురక్ష పథకాన్ని తీసుకొచ్చిందని పలువురు వైద్యులు విమర్శిస్తున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రాల (సిహెచ్‌సి) స్థాయి నుంచే మౌలిక వసతులు, వైద్యులు లేకపోవడంవల్ల దాదాపు 75 శాతం ప్రసవాలు ప్రయివేటు ఆస్పత్రుల్లోనే జరగుతున్నాయని అంటున్నారు. ఈ పథకంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుతున్న అంతంతమాత్రం సేవలు కూడా నీరుగార్చేలా ఉందని అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే చిత్తూరు సర్వజన ఆస్పత్రి, విశాఖలో పలు ప్రత్యేక విభాగాలను ప్రయివేటుకు నిర్వహణ అప్పగించిన ప్రభుత్వం క్రమంగా ప్రసూతి సేవలను కూడా అదే దారిలోకి మళ్లించేలా ఈ పథకాన్ని తీసుకువచ్చారంటూ విమర్శిస్తున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలను మభ్య పెట్టేందుకే తప్ప వాస్తవంగా వారికి లబ్ధిచేకూరేది లేదని చెబుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందే ఎక్కువ



" తల్లి సురక్ష పథకం కింద ప్రయివేటు ఆస్పత్రుల్లో ప్రసవాలకు చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలే ఎక్కువ. వాటికి ఇష్టమైన వారే ముందుకువస్తారు. ప్రస్తుతం పథకానికి మార్గదర్శకాలను రూపొంది స్తున్నాం. త్వరలోనే ఈ పథకం అమలులోకి తీసుకు వస్తాం. నెట్‌వర్క్ ఆస్పత్రులు కూడా మేము నిర్ణయించిన ధరలు, మార్గదర్శకాలు నచ్చితేనే అమలు చేయవచ్చు."

డాక్టర్ ఎన్. సుబ్బారావు, సిఇఒ, ఎన్టీఆర్ వైద్యసేవ

ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయాలి



"ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్యఆరోగ్య సేవలను బలోపేతం చేయాలి. సిహెచ్‌సి స్థాయిలోనే ప్రసూతికి అవసరమైన వైద్యులు, బ్లడ్ బ్యాంక్, స్కానింగ్ మెషిన్లు తదితర మౌలిక వసతులు అందుబాటులో ఉంచాలి. తల్లి సురక్ష కింద ప్రయివేటు ఆస్పత్రులకు ఇచ్చే సొమ్ము తో ప్రభుత్వ వైద్య సేవలను మెరుగుపరచవచ్చు."

డాక్టర్ ఎమ్‌వి. రమణయ్య,
ప్రజారోగ్య వేదిక రాష్ట్ర నాయకులు

మూతపడిన హబుల్ అధునాతన కెమెరా

నాసా వెల్లడి



వాషింగ్టన్ : హబుల్ రోదసీ టెలిస్కోప్‌లోని అత్యాధునిక కెమెరా కార్యకలాపాలు నిలిపివేసినట్లు అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా వెల్లడించింది. ఈ కెమెరాలో హార్డ్‌వేర్ సంబంధిత సమస్య ఎదురవటంతో కార్యకలాపాలను నిలిపివేశామని నాసా తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. అయితే హబుల్ టెలిస్కోప్ వ్యవస్థలో పనిచేస్తున్న ఇతర ప్రధాన పరికరాల సాయంతో శాస్త్ర పరిశోధనలు నిరంతరాయంగా కొనసాగుతాయని, కెమెరాలో ఎదురైన లోపాలను పరిశీలిస్తున్నామని నాసా వివరించింది. హబుల్‌లోని ఈ కెమెరాలో బ్యాకప్ ఎలక్ట్రానిక్స్ వ్యవస్థ వుందని, ఈ పరికరం రికవరీ అవసరమైనపుడు దీనిని ఉపయోగిస్తారని నాసా తెలిపింది. 1990లో రోదసిలోకి ప్రయోగించిన హబుల్ టెలిస్కోప్ ప్రపంచ తొలి రోదసీ టెలిస్కోప్ కావటం విశేషం. విశ్వ విస్తరణ, బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతం తదితర అంశాలను ఈ టెలిస్కోప్ తన పరిశోధనల ద్వారా నిర్ధారించిన విషయం తెలిసిందే.

శాంతిభద్రతలు సక్రమంగా ఉంటేనే అభివృద్ధి : పునేటా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాంతిభద్రతలు సక్రమంగా ఉంటేనే ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేటా అన్నారు. నేరాలను ఛేధించడంలో ప్రతిభ చాటిన పోలీసు స్టేషన్లకు, సిబ్బందికి బహుమతుల ప్రదానోత్సవం మంగళగిరిలోని పోలీస్ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పునేటా ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు అవార్డులను అందజేశారు. శాంతి భద్రతలను పరిరక్షిస్తూనే పోలీసులు తమ వృత్తి నైపుణ్యాన్ని కూడా పెంచుకోవాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. మనుషుల్లో మార్పు తీసుకురాగలిగితే మంచి వ్యవస్థను నిర్మించగలుగుతామన్నారు. డిజిపి ఆర్‌పి ఠాకూర్ మాట్లాడుతూ పోలీసుల్లో ఉన్న వృత్తి నైపుణ్యాలను వెలికితీసేందుకే ప్రతి త్రైమాసికానికీ ఈ అవార్డులు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాంతిభద్రతల అడిషనల్ డిజి హరీష్ కుమార్ గుప్తా, సిఐడి చీఫ్ అమిత్‌గార్గ్, విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ద్వారకాతిరుమలరావు, పోలీస్ ఉన్నతాధికారులు కుమార్ విశ్వజిత్, కిశోర్‌కుమార్, సంజయ్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

విజేతలుగా నిలిచిన ఠాణాలివే..

- రాజస్థాన్‌కు చెందిన వ్యాపారి హత్య కేసును ఛేదించి నెల్లూరు చిన్నబజార్ పోలీస్ స్టేషన్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.
- నగదు, ఆభరణాల కోసం మహిళను హత్య చేసిన కేసును ఛేదించి విజయవాడ అజిత్‌సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ రెండో స్థానం దక్కించుకుంది.
- చిత్తూరు జిల్లా బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ 5.75 కిలోల బంగారు దొంగతనం కేసును ఛేదించి మూడో స్థానంలో నిలిచింది.

ప్రైవేట్‌తో కలిసి పర్యాటకాభివృద్ధి

హిమాన్షు శుక్లా



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రైవేట్ భాగస్వాములతో కలిసి పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర పర్యాటక శాఖ సిఇవో హిమాన్షు శుక్లా అన్నారు. అతిధ్య రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్‌లో విస్తారమైన అవకాశాలున్నాయన్నారు. ఎపి పర్యాటక ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అతిధ్యరంగ అవకాశాలపై విజయవాడలోని హరిత బెరం పార్కులో గురువారం రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా శుక్లా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటే పర్యాటక రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయొచ్చని తెలిపారు. రానున్న కాలంలో భవిష్యత్తు ప్రైవేటు పెట్టుబడిదారులదేనని, ఈ క్రమంలోనే పర్యటక శాఖ కేవలం మార్కెటింగ్‌పై దృష్టి పెడుతుందని వివరించారు. పర్యాటక శాఖ పరంగా ఔత్సాహిక పెట్టుబడి దారులకు తమ వంతు సహకారం అందిస్తామని, అవసరమైన భూమిని నిబంధనల మేరకు ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కీలక సమయాలలో అతిధి గృహాల కొరత నెలకొంటుందని, దీనిని అధికమించేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశామని వివరించారు. వివిధ రాష్ట్రాలతో పాటు ఢిల్లీ నుంచి హోటల్ పరిశ్రమకు చెందిన నిపుణులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

కాలినడకన తిరుమలకు జగన్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

ప్రధాన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ప్రజా సంకల్పయాత్ర, బహిరంగసభలను బుధవారం సాయంత్రం ముగించుకున్న జగన్ సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్‌లో రేణిగుంటకు గురువారం ఉదయం 10.10 గంటలకు చేరుకున్నారు. రేణిగుంట నుంచి భారీ ఎత్తున, అడుగడుగునా స్వాగతం పలికారు. రోడ్డు మార్గంలో తిరుపతి పద్మావతి అతిథిగృహానికి చేరుకున్న ఆయన మూడు గంటలపాటు విశ్రాంతి తీసుకున్నారు. అనంతరం 1.35కు అలిపిరి మీదుగా పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టి కాలినడకన తిరుమలకు బయలుదేరి వెళ్లారు. శుక్లాగిరి పర్వతం వద్ద సాధారణ భక్తుల మాదిరిగానే క్యూలైన్లో వెళ్లి నడకదారిన వచ్చే భక్తులకు ఇచ్చే శ్రీవారి దర్శన టోకెన్‌ను తీసుకుని ముందుకు సాగారు. ఆయనతో పాటు వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు భూమన కరుణాకర్‌రెడ్డి, నగరి ఎంఎల్‌ఏ రోజా, చంద్రగిరి ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఉన్నారు. సాయంత్రం 4.40 నిమిషాలకు తిరుమలకు చేరుకుని, శ్రీకృష్ణ అతిథిగృహానికి వెళ్లారు. రాత్రి 7.30 గంటలకు సామాన్యుల దర్శన క్యూలైన్‌లో వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం బయటకు వచ్చి విశాఖ పీఠాధిపతి స్వరూపానందస్వామి ఆశీస్సులు తీసుకుని, రాత్రి తిరుమలలోనే బస చేశారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు రోడ్డు మార్గంలో కడప మీదుగా పులివెందుల వెళ్లనున్నారు. ప్రధాన ప్రతిపక్షనేత కావడంతో భారీఎత్తున భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. 2003లో జగన్ తండ్రి, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర అనంతరం ఇచ్ఛాపురం నుంచి రైల్లో రేణిగుంటకు చేరుకున్నారు. అనంతరం పద్మావతి అతిథిగృహం చేరుకుని విశ్రాంతి తీసుకుని తిరుమలకు కాలినడకన వెళ్లారు.



శ్రీవారి సేవలో జగన్మోహన్‌రెడ్డి

అసెంబ్లీ సిబ్బందికి ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సంక్రాంతి సందర్భంగా అసెంబ్లీ మహిళా ఉద్యోగులకు గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ముప్పై మంది మహిళా ఉద్యోగులు పోటీల్లో పాల్గొని సంక్రాంతి శోభ ప్రతిభింబించేలా రంగవల్లులను రూపొందించారు. ఉద్యోగులు వేసిన ముగ్గులను శాసనమండలి సభ్యురాలు శమంతకమణి, మండలి కార్యదర్శి సత్యనారాయణ పరిశీలించి ఉద్యోగులను అభినందించారు.



Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68